ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-8-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 199 పేజీలు: 10+4 వెల: 6.50


ప్రజాప్రతినిధులపై 4,192 కేసులు

తమిళనాడుకు కావేరి జలాలు విడుదల చేయాలి: సుప్రీం 5

## బిజెపికి 13 మంది జాతీయ సారథులు

**ఉపాధ్యక్షుల్లో పురందేశ్వరి, రామ్‌మాధవ్, వసుంధరా రాజె.**

**జనరల్ సెక్రటరీగా స్మృతి ఇరానీ, ట్రెజరర్‌గా పీయూష్ గోయల్**



**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సోమవారం పార్టీ కొత్త జాతీయ పదాధికారులను ప్రకటించారు. వసుంధర రాజే సింధియా, తీర్థ్ సింగ్ రావత్, రామ్ మాధవ్, బైజయంత్ పాండా, దగ్గుబాటి పురందేశ్వరి, రేఖా వర్మ, వర్షాబెన్ నరేంద్రభాయ్ దోషి, భారతి ప్రవీణ్ పవార్, మన్‌ప్రీత్ సింగ్ బాదల్, లాల్ సింగ్ ఆర్య, ఎం. నాగరాజా, తారిఖ్ మన్సూర్, మధుచంద్ర కర్‌లను జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించారు. వినోద్ తావ్డే, స్మృతి ఇరానీలను జాతీయ ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. పీయూష్ గోయల్‌కు >>2

## మీ పేరుందా?

'సర్' ముసాయిదా ఓటరు జాబితా విడుదల

వివరాలు ఇవ్వని 92 లక్షల మందికి నోటీసులు

సెప్టెంబరు 16 దాకా అభ్యంతరాల స్వీకరణ

**మీడియాతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు17:** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో కీలక ఘట్టం పూర్తి కావడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం సాయంత్రం బిఆర్‌కెఆర్ భవన్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో సుమారు 92 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు తెలంగాణలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారు.నిర్ణీత గడువులో ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించిన 2,64,87,214 మంది వివరాలతో ముసాయిదా ఓటర్ల జాబితాను రూపొందించినట్లు ఎన్నికల సంఘం సీఈఓ తెలిపారు. మొత్తం మీద 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు అందినట్లు సీఈవో సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల వివరాలను పరిశీలించగా.. సుమారు 73 లక్షల మంది ఏఎస్‌డీడి (ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్) కేటగిరీలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మరోవైపు సుమారు 60 లక్షల మంది అనామలీస్ ఓటర్లు, 32 లక్షల మంది మ్యాపింగ్ కాని ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ఎన్యుమరేషన్ పత్రాలు ఇచ్చిన వారిలో సుమారు 32 లక్షల మంది గత 2002 ఎస్ఐఆర్ వివరాలను ప్రస్తావించలేదు. అన్‌మ్యాపింగ్ ఓటర్లుగా పేర్కొంటూ వారందరికీ ఎన్నికల కమిషన్ నోటీసులు రానున్నాయి. మరో 60 లక్షల మంది ఎన్యూమరేషన్ ఫారాల్లో >>2



సోమవారం హైదరాబాద్ సనత్‌నగర్‌లోని టిమ్స్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో డి.సిఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, దామోదర, పొన్నం తదితరులు

# మరో 4 టాప్ హాస్పిటళ్లు

డిసెంబర్ 9 కల్లా ఉస్మానియా, ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేస్తాం

**వైద్యం, ఆరోగ్యానికి రెండేళ్లలో రూ.21,800 కోట్లు ఖర్చు**

**కెసిఆర్, కెటిఆర్ అబద్ధాలు చెబుతుంటే నేను నిజాలు చెబుతుంటా**

**సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 17:** తెలంగాణ ప్రజా పాలనలో వ్యవసాయం, మహిళా సంక్షేమంతో పాటు విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు, రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం సనత్‌నగర్ టిమ్స్(డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు.మన బిడ్డలను ప్రపంచంలోనే గొప్ప స్థానాల్లో చూడాలని నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపాన్ దేశాల్లోనూ అవకాశాలు మెండుగా >>2

## కాళ్లు, కడుపు చుట్టూ డ్రగ్స్ ప్యాకెట్లే

రూ.1.5 కోట్ల హాషిష్ ఆయిల్ పట్టివేత

ఇద్దరు మైనర్లు సహా ఆరుగురు అరెస్టు 7

## దిగివచ్చిన సోరెన్

జార్ఖండ్‌లో విద్యార్థుల విజయం

జెపిఎస్‌సి-సిజిఎల్ పరీక్షలు రద్దు



**రాంచి, ఆగస్టు 17:** ఉద్యోగార్థుల ఆందోళనల నేపథ్యంలో జార్ఖండ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్-కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్షలను రద్దు చేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సోమవారం ప్రకటించారు. రాంచీలో మూడు వారాలకు పైగా ఆందోళన చేస్తున్న ఉద్యోగార్థుల ప్రధాన డిమాండ్లలో ఈ పరీక్షలరద్దు కూడా ఉంది. నేడు కేబినెట్ జెఎస్ఎస్‌సి సిజిఎల్ పరీక్షలను కూడా రద్దు చేయాలని నిర్ణయించింది. అంతేకాకుండా >>2



సోమవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నంకు వినతి పత్రం అందజేస్తున్న ఆటో కార్మికుల నేతలు

# త్వరలో ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు

ఛార్జీల పెంపుపై నిర్ణయిస్తాం..

ఎలక్ట్రిక్ ఆటోలను ఆర్టీసీ కొనుగోలు చేయదు..

ఆటో కార్మిక సంఘాలతో మంత్రి పొన్నం

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 17:** రాష్ట్రంలోని ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలో ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయనున్నట్టు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆటో కార్మిక సంఘాలకు తెలిపారు. ఆటో ఛార్జీల పెంపుపై ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను తెలంగాణ కేకేసీ యూనియన్ ప్రతినిధులు కలిసి ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ >>2

# సారీ.. అప్‌డేట్‌లో పొరపాటు!

**22ఎ నిషేధిత జాబితా నుంచి ప్రైవేటు భూములను తొలగిస్తాం**

సమస్యల పరిష్కారానికి ఉన్నత కమిటీ

**పెండింగ్ దరఖాస్తులు 15 రోజుల్లో పరిష్కారం: మంత్రి పొంగులేటి**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతి నిధి, హైదరాబాద్,ఆగస్టు 17:** తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల సమ స్యల పరిష్కారానికి ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ కమిటీ వారానికి ఒకసారి సమావేశమై నిషేధిత భూముల దరఖాస్తులు, ఇతర సమస్యలను సమీక్షించి నిర్ణయాలు తీసుకుంటుందని వెల్లడించారు. నిషేధిత భూములపై పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను 15 రోజుల్లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో ప్రైవేట్ భూములను 22ఏ జాబితాలో చేర్చారంటూ 757ఫిర్యాదులు అందినట్లు వివరించారు. ఈ క్రమంలో 22ఏ పై సోమవారం సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా రిజిస్ట్రార్లు, సబ్‌రిజిస్ట్రార్లతో సుదీర్ఘంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉన్నతస్థాయి కమిటీ వారానికోసారి సమావేశమై దరఖాస్తులు, ఇతర సమస్యలపై సమీక్షించి నిర్ణయాలు తీసుకుంటుందని మంత్రి పొంగులేటి వివరించారు. రాష్ట్రంలో ప్రధానంగా ఈ నాలుగు జిల్లాల్లోనే సమస్య ఎక్కువగా ఉందని, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 511 దరఖాస్తులు,రంగారెడ్డి జిల్లాలో 146 అప్లికేషన్లు వచ్చాయి. హైదరాబాద్‌లో 49, సంగారెడ్డిలో 38 అప్లికేషన్లు వచ్చాయని, వీటితోపాటు మిగిలిన జిల్లాల్లో 22ఏ దరఖాస్తులన్నింటినీ ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించామన్నారు. ఇందుకోసం అవసరమైతే స్లాట్ బుకింగ్‌ల సంఖ్య పెంచాలంటూ సూచించినట్లు మంత్రి పొంగులేటి చెప్పారు. నిషేధిత భూములపై సమాచారానికి టోల్‌ఫ్రీ నంబరు 1800 5994788ను ఏర్పాటు చేశామని, ఎవరైనా దీనికి సమాచారం పంపినా కనీసం 3రోజుల్లో సమాధానం అందుతుందని, పరిష్కారానికి చర్యలు చేపడతారని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయడానికి అవకాశం లేని కేసుల్లో ఎందుకు >>2


## ప్రియుడే యముడు

**బీహార్ యువతి దారుణహత్య** 7

## సిఎం ఇల్లు కూడా నిషేధిత జాబితాలోనే

**ఇది సర్కారా లేక సర్కస్సా?**

**మాజీ మంత్రి హరీష్ మీడియాతో చిట్‌చాట్**



సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో హరీష్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు17:** సర్కార్ నడుపుతున్నవా.. లేక సర్కస్ నడుపుతున్నవా రేవంత్ రెడ్డి? అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సోమవారం సాయంత్రం తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన చిట్‌చాట్ చేశారు. మీ తప్పులకు ప్రభుత్వ అధికారులు బలి కావాలా? తప్పు మీరు చేస్తే శిక్ష వారు అనుభవించాలా? అని ప్రశ్నించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను బంద్ చేయాలనే కుట్ర బయటపడటంతో ఆ తప్పును అధికారులపైకి నెట్టే ప్రయత్నం మంత్రి పొన్నం ప్రభాకర్ చేస్తున్నారు.22ఏ నిషేధిత భూముల విషయంలో భూదందా వెలుగులోకి రావడంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 'సారీ' అంటూ తప్పించుకుని, అధికారులపై నెపం నెట్టే >>2

## హైదరాబాద్ టు భోగాపురం ఎగిరిన విమానం

**అల్లూరి ఎయిర్‌పోర్టులో వాణిజ్య కార్యకలాపాలు ఆరంభం**

**'గేట్ వే ఆఫ్ ది ఈస్ట్' ఇక విమానయానానికి సిద్ధం**



హైదరాబాద్ నుంచి భోగాపురంలో ల్యాండయిన తొలి విమానం

**విజయనగరం, ఆగస్టు 17, ప్రభాతవార్త:** జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ అభివృద్ధి చేసిన అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం నేడు వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించింది. దీంతో ఉత్తర ఆంధ్రప్రదేశ్‌లో కనెక్టివిటీ, ఆర్థిక అవకాశాలు, ప్రాంతీయ అభివృద్ధిలో నూతన శకం ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ విమానయాన రంగంలో ఇది ఒక కీలక మైలురాయిగా నిలిచింది. దేశీయ, అంతర్జాతీయ విమాన ప్రయాణాలకు రాష్ట్రాన్ని తూర్పు ముఖద్వారంగా మరింత బలోపేతం చేస్తోంది. విమానాశ్రయం వాణిజ్య కార్యకలాపాల ప్రారంభం పలు చారిత్రాత్మక తొలి విమాన సర్వీసులతో ఘనంగా జరిగింది. దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసుల ద్వారా విశాఖపట్నం భారతదేశంలోని కీలక నగరాలతో పాటు మధ్యప్రాచ్యం, ఆగ్నేయాసియాలోని ముఖ్య గమ్యస్థానాలకు అనుసంధానమైంది. ఈ తొలి విమాన సర్వీసులు ఉత్తర ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచంతో అనుసంధానించే వ్యూహాత్మక విమానయాన కేంద్రంగా విమానాశ్రయం సిద్ధంగా ఉందని చాటిచెప్పాయి. పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు, విమానాశ్రయ వర్గాలకు చెందిన భాగస్వాములతో కలిసి ఈ చారిత్రాత్మక మైలురాయి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా, తొలి ఇండిగో మరియు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాల్లో ప్రయాణించే ప్రయాణికులకు ఆయన లాంఛనంగా బోర్డింగ్ పాస్‌లను అందజేశారు. అలాగే, విమానాశ్రయ కార్యకలాపాల ప్రారంభానికి గుర్తుగా జ్ఞాపికలను అందజేశారు. ఇండిగో విమానం 6ఈ 6408: హైదరాబాద్ - విశాఖపట్నం - అరైవల్స్, ఇండిగో విమానం 6ఈ 9051: విశాఖపట్నం - హైదరాబాద్ - డిపార్చర్స్, ఇండిగో విమానం 6ఈ 1443: అబుదాబి (ఎయుహెచ్) - విశాఖపట్నం (విటిజెడ్)-అరైవల్స్, >>2

# మరో 4 టాప్ హాస్పిటళ్లు

>> ఉన్నాయని చెప్పారు. ఈ రోజుల్లో ప్రైవేటు వైద్యం అత్యంత ఖరీదుగా మారిందని, అందుకే పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు టిమ్స్‌ను ప్రారంభించుకున్నామని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ కోసం రూ.2700 కోట్లు ఖర్చు చేశాం, సీఎంఆర్ఎఫ్ కోసం రూ.2526 కోట్లు ఖర్చు చేశాం, ఇప్పటి వరకు రూ.5226 కోట్లు పేదల ఆరోగ్యం కోసం ఖర్చు చేశామని వివరించారు. రెండేళ్లలో రూ.21,800 కోట్లు వైద్యఆరోగ్య శాఖ కోసం ఖర్చు చేశామని పేర్కొన్నారు. ఉస్మానియా ఆసుపత్రి శిథిలావస్థకు చేరితే... పదేళ్ల అధికారంలో ఉన్నవాళ్లు కొత్త ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించాలని ప్రయత్నించలేదని విమర్శించారు. టిమ్స్ ఆసుపత్రులకు, వరంగల్ ఆసుపత్రికి కేవలం టెంకాయకొట్టి వదిలేశారు, మేం అధికారంలోకి వచ్చాక సనత్‌నగర్, ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇవన్నీ పూర్తయితే 10 వేల పడకల ఆసుపత్రులు అందుబాటులోకి వస్తాయి, 2027, డిసెంబర్ 9 వరకు ఉస్మానియా, ఎల్బీ నగర్, అల్వాల్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేస్తామని చెప్పారు. ఒక్కో ఆసుపత్రికి ఒక్కో డైరెక్టర్‌ను నియమించి పర్యవేక్షి స్తాం, కార్పొరేట్ తరహాలో ఆసుపత్రుల నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆసుపత్రికి వచ్చే రోగుల అటెండెంట్‌లు ఉండేదుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అదనంగా సమయాన్ని కేటాయించే సూపర్ స్పెషాలిటీ వైద్యులకు ప్రోత్సహకాలను అందిచేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నామన్నారు. పేదలకు వైద్యం అందించేందుకు ప్రజా ప్రభుత్వం ఉంది.. మా రేవంతన్న ఉన్నాడు అనేలా ప్రజలకు నమ్మకం కలిగించండి అని చెప్పారు. అయితే మేం టిమ్స్‌ను ప్రారంభిస్తామని చెప్పగానే కొందరు పగటి వేషగాళ్లల్లా వచ్చి తిరిగి పోతున్నారు. కేటీఆర్ వచ్చి ఇది తామే కట్టామని చెప్పి వెళ్లారు. వెనక ఉన్న మెంటల్ హాస్పిటల్‌కు వెళ్లి పేషంట్లకు టిమ్స్ లు కట్టింది నేనే నన్ను గుర్తుపట్టలేదా అని కేటీఆర్ అడిగాడట. అక్కడ ఉన్న రోగి ఊకో బిడ్డా నేను కూడా మొదట్లో అలాగే మాట్లాడేవాడిని.. రాను రాను అదే తగ్గిపోతది అని చెప్పాడట. అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మీరు కడితే పదేళ్లలో ప్రారంభించడానికి సమయం దొరకలేదా? మీ కుటుంబమే అధికారంలో వున్నపుడు ఎందుకు రిబ్బన్ కట్ చేయలేదు? అని ప్రశ్నించారు. మీరు ఎర్రవెల్లి, జన్వాడ, మొయినాబాద్, శంకర్ పల్లి ఫామ్ హౌసులు నిర్మించుకునేందుకు ఒక్క క్షణం కూడా ఆలస్యం కానివ్వలేదు, కానీ పేదలకు వైద్యం అందించే ఆసుపత్రులు పూర్తి చేయాలని ఆలోచన రాలేదా?ఇకనైనా ఆత్మ పరిశీలన చేసుకోండి అని వ్యాఖ్యానించారు. నియోజకవర్గానికో రూ.పది, రూ.20 కోట్లు ఖర్చు చేసి సేవ చేస్తే మీ పాపాలు కొంతైనా తగ్గుతాయి, కానీ అబద్ధపు ప్రచారాలతో ఏదో చేయాలనుకుంటే ప్రజలు నమ్మరు అని చెప్పారు. కెసీఆర్, కేటీఆర్ 2034 వరకు మారకూడదని, ఇలాగే ఉండాలని కోరుకుంటున్నా వాళ్లు అబద్ధాలు చెప్పడం మాననంత కాలం నేను ఇలాగే నిజాలు చెబుతూనే ఉంటా అని చెప్పారు. ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. సనత్ నగర్ టిమ్స్ ప్రారంభ కార్యక్రమంలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సనత్ నగర్ టిమ్స్‌కు మర్రి చెన్నారెడ్డి పేరు పెట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ టిమ్స్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలి, తెలంగాణ కోసం మంత్రి పదవికి రాజీనామా చేసి తన జీవితాంతం పోరాడిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ, 94ఏళ్ల వయసులో ఢిల్లీలో ఎముకలు కొరికే చలిలో దీక్ష చేశారు..అట్లాంటి మహనీయుని పేరు ఎల్బీనగర్ టిమ్స్‌కు పెట్టాలని ముఖ్యమంత్రిని కోరుతున్నట్లు ప్రకటించారు. అల్వాల్ టిమ్స్ హాస్పిటల్‌కు స్వర్గీయ అంజయ్యపేరు పెట్టాలి, వరంగర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు ప్రొ.జయ శంకర్ పేరు పెట్టాలని సిఎంను కోరారు.



పాట్నా అసెంబ్లీలో సోమవారం ప్రశాంత్ కిషోర్ చేత ఎమ్మెల్యేగా ప్రమాణం చేయిస్తున్న బీహార్ అసెంబ్లీ స్పీకర్ ప్రేమ్ కుమార్

## కెఆర్ఎంబీ సమావేశం వాయిదా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు17:** కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) త్రిసభ్య కమిటీ సమావేశం ఈనెల 24కు వాయిదా పడింది. ఏపీ అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో సమావేశాన్ని వాయిదా వేయాలని ఆ రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్సీ కోరడంతో కెఆర్ఎంబీ ఈ నిర్ణయం తీసుకుంది. సోమవారం నిర్వహించాల్సిన త్రిసభ్య కమిటీ సమావేశాన్ని ఈనెల 24న ఉదయం 11 గంటలకు నిర్వహించాలని సభ్య కార్యదర్శి సతీష్ కుమార్ కాంబోజ్ ఉత్తర్వులు జారీ చేశారు. కెఆర్ఎంబీ సభ్య కార్యదర్శి ఛాంబర్‌లో ఈ సమావేశం జరగనుంది.

## దిగివచ్చిన సోరెన్

>> 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన చిన్నా, పెద్దా అన్ని తప్పిదాలపై సమగ్ర విచారణ నిర్వహిస్తామని సోరెన్ తెలిపారు.గిరిజనులకు సంబంధించిన అన్ని కార్యకలాపాలు రద్దుకు వ్యవహారంలో టిడిపిఎల్ సంస్థకు సంబంధించిన అన్ని కార్యకలాపాలను రద్దు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. టిడిపిఎల్ నిర్వహించిన పరీక్షలు, ప్రకటించిన ఫలితాలు, ఎంపికైన అభ్యర్థులు, పరీక్షకు హాజరైన అభ్యర్థులు, అలాగే సంస్థ చేపట్టిన ఇతర అన్ని కార్యకలాపాలను రద్దు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు.సమస్యకు సంబంధించిన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకునిటిడిపిఎల్‌కు సంబంధించిన ప్రతిదాన్నీ రద్దు చేయాలని నిర్ణయించాం" అని హేమంత్ సోరెన్ వెల్లడించారు. జెపిఎస్సి,జెఎస్ఎస్సి సంస్కరణ మంచ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసనలు సోమవారం 24వ రోజుకు చేరుకున్నాయి. తమ డిమాండ్లను ఈనెల18లోగా పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని నిరసనకారులు ఇప్పటికే హెచ్చరించారు.

## మీ పేరుందా?

>> 2002 ఎస్ఐఆర్ వివరాలు ప్రస్తావించినప్పటికీ, అనుసంధానం ఉన్నాయి. అలాంటి వాటిని అనామలీస్ ఓటర్లుగా పేర్కొంటూ వారికి కూడా నోటీసులు ఇచ్చేందుకు సీఈఓ కార్యాలయం జాబితాను సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో సుమారు 92 లక్షల మందికి నోటీసులు ఇవ్వనున్నట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ వివరాలను, అవసరమైన పత్రాలను సమర్పించి తమ ఓటు వివరాలను నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 16వ తేదీ వరకు నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు గడువు ఉన్నట్టు సీఈఓ సుదర్శన్ రెడ్డి తెలిపారు. నోటీసులను బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) పోస్టు ద్వారా పంపించనున్నట్టు చెప్పారు.

ఎస్ఐఆర్ ముసాయిదా జాబితాలో తమ పేరు లేకపోతే సంబంధిత వ్యక్తులు ఫారం 6ఏ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్నికల అధికారులు సూచించారు. అలాగే తమ ఓటును తొలగించే అవకాశం ఉందని భావించిన వారు అభ్యంతరాలను సమర్పించుకోవచ్చు. ఓటర్లకు నోటీసు ఎందుకు జారీ చేశారనే కారణాన్ని కూడా స్పష్టంగా తెలియజేస్తామని అధికారులు వెల్లడించారు.ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైన నేపథ్యంలో ఆగస్టు 17వ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు అభ్యంతరాలు, సంబంధిత దరఖాస్తులను పరిశీలించనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత అక్టోబర్ 19వ తేదీన తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మందికి పైగా అధికారులు పనిచేయనున్నట్టు సీఈఓ సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు.

**జాబితాలో పేరు లేకుంటే ఏం చేయాలి?**

ముసాయిదా జాబితాలో పేరు లేని వారు లేదా ఏఎస్‌డీడీ జాబితాలో ఉన్న వారు కొత్తగా ఓటు నమోదు కోసం ఫారం6 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ దరఖాస్తుతో పాటు వయసు, గుర్తింపు ధ్రువీకరణ పత్రాలను జత చేయాలి. దరఖాస్తులో పూర్తి పేరు, పుట్టిన తేదీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, కుటుంబ సభ్యులలో ఒకరి వివరాలు, పూర్తి చిరునామా, ఓటర్ ఐడీ నంబర్ (ఉంటే) వంటి సమాచారాన్ని పొందుపరచాలి.

**జాబితాలో పేరు ఉండి వివరాలు తప్పుగా ఉంటే..?**

ఇప్పటికే జాబితాలో పేరు ఉండి, వివరాల్లో తప్పులు (పేరు, ఫొటో, చిరునామా మార్పు) ఉన్న వారు ఫారం8 ద్వారా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ పద్ధతిలో సవరణలు చేసుకోవచ్చు. అభ్యంతరాలు, పేర్లు స్వీకరణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఓటర్లు తమ వివరాలను సీఈఓ తెలంగాణ లేదా కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్లలో తనిఖీ చేసుకొని, అవసరమైన మార్పులు చేసుకోవాలని అధికారులు సూచించారు.

**రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల సీఈఓ సమావేశం**

సోమవారం ఉదయం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్‌రెడ్డి, అదనపు కార్యదర్శి ఎన్. శంకర్, డిప్యూటీ సీఈఓ జి.ఎస్. హరి, పిఎం నోడల్ అధికారులు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో సి. సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ సర్ 2026లో భాగంగా 25 జూన్ నుంచి 10 ఆగస్టు వరకు నిర్వహించిన ఎన్యూమరేషన్ దశ విజయవంతంగా పూర్తయినట్లు తెలిపారు.

ఎలక్టర్ల నుంచి సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాలు 2.65 కోట్లు అంటే మొత్తం ఎలక్టర్లలో 78.30 శాతం ఉన్నట్లు తెలిపారు. అలాగే మరణించిన ఎలక్టర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు,అందుబాటులో లేని/గైర్హాజరైన ఎలక్టర్లు, ఇతర కేటగిరీలకు చెందిన వారు అలాగే ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల్లో నమోదైన ఎలక్టర్లకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ, అలాగే 17 ఆగస్టు నుంచి 16 సెప్టెంబర్ 2026 వరకు నిర్వహించనున్న క్లెయిమ్స్ అండ్ ఆబ్జెక్షన్స్ దశ కోసం చేపట్టిన ఏర్పాట్లను కూడా రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. సర్ ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా తెలియజేసి, పలు పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు, వారి నుంచి వచ్చిన సలహాలను స్వీకరించి పరిశీలిస్తామన్నారు. అనంతరం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ముసాయిదా ఓటర్ల జాబితా (డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్స్) హార్డ్ డిస్క్ ద్వారా అందజేశారు.

## జాతీయ సారథులు

>> జాతీయ కోశాధికారి బాధ్యతలు అప్పగించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు)గా బీఎల్ సంతోష్‌ను కొనసాగించారు.మొత్తం ఎనిమిది మంది జాతీయ ప్రధాన కార్యదర్శులతో కూడిన కొత్త బృందంలో మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, మాజీ త్రిపుర ముఖ్యమంత్రి బిప్లబ్ కుమార్ దేబ్‌లకు చోటు కల్పించారు.బీఎల్ సంతోష్‌కు ముంబై కేంద్రంగా పనిచేసే సంయుక్త ప్రధాన కార్యదర్శి శివ్ ప్రకాశ్, చండీగఢ్ కేంద్రంగా పనిచేసే సౌదాన్ సింగ్ సహకారం అందించనున్నారు. ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కు రాజీనామా చేసిన సందీప్ పాఠక్‌ను బీజేపీ జాతీయ కార్యదర్శిగా నియమించడం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈశాన్య రాష్ట్రాల సమన్వయకర్తగా సంబిత్ పాత్రాకు బాధ్యతలు అప్పగించారు.2027 ఎన్నికలే లక్ష్యంగా పునర్వ్యవస్థీకరణ2027లో జరగనున్న కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ సన్నద్ధమవుతున్న నేపథ్యంలో ఈ సంస్థాగత మార్పులు చోటు చేసుకున్నాయి. ఉత్తరప్రదేశ్, పంజాబ్ సహా పలు రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ నాయకత్వం కొత్త బృందాన్ని ఏర్పాటు చేసింది. 2029 లోకసభ ఎన్నికలకు దీర్ఘకాలికంగా పార్టీని సిద్ధంచేసే వ్యూహంలో భాగంగానూ ఈ మార్పులను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే బీజేపీ రాష్ట్ర స్థాయిలోనూ సంస్థాగత మార్పులకు శ్రీకారం చుట్టింది. పంజాబ్‌లో 2027 అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న పార్టీ ఇటీవల మొత్తం 36 సంస్థాగత జిల్లాలకు ఇన్‌చార్జ్‌లను నియమించింది.కొత్తగా నియమితులైన జాతీయ పదాధికారులకు ప్రధాని నరేంద్ర మోడీ అభినందనలు తెలిపారు. సంస్థాగత అనుభవం, ఉత్సాహం, క్షేత్రస్థాయి అనుసంధానం కలిగిన కొత్త బృందం పార్టీని మరింత బలోపేతం చేస్తుందని, ప్రజాసేవపై దృష్టి సారిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.అనుభవజ్ఞులతోపాటుయువతకు చోటు బీజేపీ కొత్త జాతీయ బృందంలో అనుభవజ్ఞులైన నేతలతో పాటు యువతకు కూడా ప్రాధాన్యం ఇచ్చారు. ప్రాంతీయ ప్రాతినిధ్యానికి పెద్దపీట వేశారు. 16 మంది జాతీయ కార్యదర్శుల బృందంలో కవితా పాటిదార్, కె. సురేంద్రన్, సందీప్ పాఠక్, మనోజ్ తిగ్గా తదితర కొత్త ముఖాలకు చోటు కల్పించారు.మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ కీలక సంస్థాగత బాధ్యతలోకి తిరిగి రావడం విశేషం. రాజస్థాన్ మాజీ సిఎం వసుంధరరాజే సింధియాను జాతీయ ఉపాధ్యక్షురాలిగా కొనసాగించారు.13 మంది జాతీయ ఉపాధ్యక్షుల్లో ఆరుగురు మహిళలు ఉండటం ద్వారా పార్టీ అగ్రస్థాయి సంస్థాగత పదవుల్లో మహిళలకు మరింత ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టమవు తోంది. కొత్త బృందంలో నలుగురు మహిళా కార్యదర్శులు, ఒకమహిళా ప్రధాన కార్యదర్శి ఉన్నారు. ముస్లిం సామాజికవర్గానికి చెందిన ఇద్దరు నేతలకు కొత్త బృందంలో స్థానం కల్పించారు.

## వారం - వర్జ్యం

18-08-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.షష్ఠి సా.5.55
న.స్వాతి పూర్తి
వ.ఉ.11.00-మ.12.43
దు1.ఉ.8.23-ఉ.9.14
దు2. రా.11.34-రా.12.25
రాహు.మ.3.00-సా.4.30 శుభ లేదు

## వార్తాఫలం

**మేషం :** వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తత కలిగి ఉండండి. వృత్తి పరంగా అభివృద్ధి సాధిస్తారు. కాంట్రాక్ట్‌లు దక్కుతాయి.

**వృషభం :** వీసా, పాస్‌పోర్ట్ అంశాలు ఒకింత పురోభివృద్ధి సాధిస్తారు. తనఖాలు విడిపిస్తారు. ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు తొలగుతాయి.

**మిథునం :** మీ వారెవరో మీకు అపకారం చేసే వారెవరో స్పష్టంగా తెలుస్తుంది. వాహన సౌఖ్యం. ముఖ్య వ్యవహారాలలో ఆచితూచి నిర్ణయాలు తీసుకొంటారు.

**కర్కాటకం :** ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టడంలో కాస్త జాప్యం జరుగుతుంది. నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. వాహన సౌఖ్యం.

**సింహం :** మీ మేధస్సు నలుగురిలో ప్రశంసించ బడుతుంది. బంధుత్వాలకు అతీతంగా వ్యవహరించండి. సభలలో పాల్గొంటారు.

**కన్య :** ఆర్థిక ఒడిదుడుకులు కొంత చికాకు గురి చేస్తాయి. పనులు నిదానంగా పూర్తి చేస్తారు. క్రయ విక్రయాలకు దూరంగా ఉండండి.

**తుల :** ఇంటా బయటా సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. ఉద్యోగులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. నూతన విద్యావకాశాలు లాభిస్తాయి.

**వృశ్చికం :** దూరప్రాంత ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. వస్తు లాభం.

**ధనుస్సు :** కోర్ట్ కేసులు ఓ కొలిక్కి వస్తాయి. బాధ్యతలు సమర్థవంతంగా పూర్తి చేస్తారు. వస్త్రాలు కొనుగోలు.

**మకరం :** సంతానం కోసం అధికంగా ఖర్చు చేస్తారు. నూతన ప్రయత్నాలు కలిసి వస్తాయి. బంధువుల కలయిక. ఇంటా బయటా ప్రోత్సాహం.

**కుంభం :** నూతన పెట్టుబడులకు అనుకూల కాలం. జీవిత భాగస్వామి ద్వారా ధన లాభం పొందుతారు. వాహన యోగం.

**మీనం :** కొత్త కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేయుటానికి విఫల యత్నం చేస్తారు. చర్చాగోష్ఠులలో పాల్గొంటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## సిఎం ఇల్లు కూడా నిషేధిత జాబితాలోనే

>> ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల జీవితాలతో ముడి పడి ఉన్న అంశాల్లో సరిదిద్దుకోలేని తప్పు చేసి, 'సారీ' చెప్పి తప్పించుకుంటే సరిపోదు రేవంత్‌రెడ్డి అని వ్యాఖ్యానించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఇక రావేమోనని పేదలు ఆందోళన చెందుతున్నారు. 22ఏ నిషేధిత భూముల వ్యవహారంతో ఎంతోమంది మానసిక వేదనకు గురయ్యారు అని చెప్పారు. ఏకంగా ఎయిర్‌పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు లాంటి ప్రభుత్వ భూములను కూడా 22ఎ నిషేధిత జాబితాలో పెట్టారంటే ఈ అధికారుల పనితీరు ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చునని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో లక్షలాది ప్రాపర్టీలను రాత్రికి రాత్రి ప్రొహిబిషన్ లిస్ట్‌లో చేర్చారు. శ్రీనగర్ కాలనీ సర్వే నంబర్ 8, 9లలో గత 20 ఏళ్లుగా ఇళ్లు కట్టుకుని ప్రశాంతంగా నివసిస్తున్న ప్రజల ప్రాపర్టీలను కూడా ఇప్పుడు 22ఏ లో పెట్టడం దుర్మార్గం అని చెప్పారు. 30 ఏళ్ల క్రితం కొనుక్కున్న అపార్ట్‌మెంట్ ఫ్లాట్లను కూడా నిషేధిత జాబితాలో పెడితే ఆ ప్రజలు ఇప్పుడు ఎక్కడికి పోవాలి..తమ ప్రాపర్టీ 22ఏ లో ఉందన్న విషయం చాలామంది సామాన్యులకు తెలియడం లేదన్నారు. తీరా రిజిస్ట్రేషన్ కోసం చలాన్లు కట్టి, డబ్బులు చెల్లించిన తర్వాత.. చివర్లో మీ భూమి 22ఏ లో ఉందని చెప్పి రిజిస్ట్రేషన్ ఆపేస్తున్నారు. పైగా రిజిస్ట్రేషన్ కోసం కట్టిన చలాన్ డబ్బులు కూడా వాపస్ ఇవ్వకుండా ప్రభుత్వం ప్రజల సొమ్మును నిలువునా దోచుకుంటోందన్నారు. గతంలో ప్రభుత్వం నుంచి అధికారికంగా ఎన్‌ఓసి వచ్చిన భూములకు బ్యాంకులు కూడా లోన్లు ఇచ్చాయి. ఇప్పుడు అవే భూములను తీసుకొచ్చి 22ఏ లో పెట్టడంతో అటు ప్రజలు, ఇటు బ్యాంకులు ఇద్దరూ ఆగం అవుతున్నారని చెప్పారు. బంజారాహిల్స్ హౌసింగ్ సొసైటీ లాంటి ప్రాంతాలను సైతం ప్రొహిబిషన్ లో పెట్టారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చునని చెప్పారు. 22ఎ అనేది ఈ ప్రభుత్వానికి ప్రజలను అడ్డగోలుగా దోచుకునే ఒక ఆయుధంగా మారిందన్నారు. రెవెన్యూ శాఖలో ఏ పని కావాలన్నా, 22ఎ నుంచి భూమిని బయటకు తీయాలన్నా 30 శాతం కమీషన్ ఇవ్వాలనేది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం అని వ్యాఖ్యానించారు. 30 శాతం కమీషన్ లేనిదే రెవెన్యూ శాఖలో ఒక్క ఫైల్ కూడా కదలడం లేదన్నారు..చివరకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఎ ప్రొహిబిషన్ లిస్ట్‌లో ఉందంటే ఆశ్చర్యం కలుగుతోంది. తన సొంత ఇంటికి సెగ తగిలే సరికి ప్రభుత్వంలో హడావిడి మొదలైంది. నీకు చురుకు తగిలితేనే కానీ సామాన్యుల బాధలు పట్టవా..స్వయంగా ముఖ్యమంత్రి పరిస్థితే ఇలా ఉంటే, ఇక రాష్ట్రంలో సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి? వాళ్ల గోడు ఎవరు వినాలి అని ప్రశ్నించారు.

## సంధ్య థియేటర్ కేసు, వర్చువల్‌గా హాజరైన అల్లు అర్జున్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు17:** సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో సినీ నటుడు అల్లు అర్జున్ సోమవారం వర్చువల్ విధానంలో కోర్టు విచారణకు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన తన హాజరును నమోదు చేసుకోగా, ఆయన తరపు న్యాయవాదులు నాంపల్లి కోర్టులో స్వయంగా హాజరయ్యారు. అనంతరం న్యాయస్థానం కేసు విచారణను సెప్టెంబర్ 1వ తేదీకి వాయిదా వేసింది. పుష్ప2 ప్రీమియర్ సందర్భంగా 2024 డిసెంబర్ 4న హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు.

ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం 23 మందిని నిందితులుగా పేర్కొంటూ ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. అందులో థియేటర్ యాజమాన్యానికి చెందిన పలువురితో పాటు అల్లు అర్జున్, ఆయన మేనేజ్‌మెంట్, భద్రతా సిబ్బంది, బౌన్సర్లు ఉన్నారు. కాగా, అల్లు అర్జున్‌కు గతంలో కోర్టు ఆదేశాల మేరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యే అవకాశం లభించింది.



సిమ్లాలో సోమవారం తూతికండి బైపాస్ వద్ద అదుపుతప్పి పడిపోయిన ట్రక్కు

## అప్‌డేట్‌లో పొరపాటు!

>> చేయలేమో? ప్రజలకు స్పష్టమైన కారణం చెప్పాలని అధికారులకు సూచించారు. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించినట్లయితే నిబంధనల ప్రకారం తిరిగి వారికి చెల్లించాలని ఆదేశించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని భూదాన్ భూములు, వాటికి సంబంధించిన పెండింగ్ సమస్యలు, వివాదాలు, పరిష్కార మార్గాలపై సమగ్ర నివేదిక రూపొందిస్తామని తెలిపారు. యూఎల్‌సీ(అర్బన్ ల్యాండ్ సీలింగ్) జాబితాను సరిచేస్తున్నామని, అసలైన హక్కుదారులకు న్యాయం చేస్తూ మరో రెండు రోజుల్లో తగు చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇచ్చామని మంత్రి పొంగులేటి తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో ఒక ఆస్తికి సర్వే శాఖ నుంచి టీఎస్ఎల్ఆర్, సర్వే నంబర్లు ఇవ్వగా, అదే ఆస్తికి జీహెచ్ఎంసీ కూడా ఇచ్చిందని, ఈ రెండింటినీ సూపర్ ఇంపోజ్ చేసే సమయంలో సమస్యలు ఏర్పడ్డాయని, వీటిని కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి శ్రీనివాస రెడ్డి వివరించారు. రంగారెడ్డి జిల్లాలో 12 ఎకరాల భూమి ఉంటే అందులో రెండు ఎకరాలు భూదాన్ భూములు ఉండగా, మొత్తం 12 ఎకరాలను 22ఏ లో పెట్టడంతో సమస్య ఉత్పన్నమైనట్లు తెలిపారు. అదేవిధంగా కొన్ని దేవాదాయ, అటవీ భూములు కూడా నిషేధిత జాబితాలో ఉన్నాయని, జియో ట్యాగింగ్ ద్వారా అసలు స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసి మిగిలిన భూములను ఫ్రీహోల్డ్ చేయాలంటూ ఆదేశించినట్లు తెలిపారు. గతంలో హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో అప్పట్లో అధికారులు నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూముల వివరాలను వదిలేయడంతో అవి నేటికీ నిషేధిత జాబితాలో ఉండిపోయాయన్నారు. అధికారుల చర్యలతో సామాన్యులు కూడా ఇబ్బంది పడినట్లు ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి పొంగులేటి ప్రజలకు 22ఏ విషయంలో ప్రజలకు క్షమాపణలు చెప్పారు. అయితే అధికారులపై నెపం నెట్టి తమ ప్రభుత్వం ఈ సమస్యను ప్రజలపై వదిలేయడం లేదని, దీనిని పరిష్కరించే బాధ్యత కూడా తానే తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. నిషేధిత భూముల పేరిట అసలైన యజమానులకు ఎటువంటి అన్యాయం జరగదని మంత్రి హామీ ఇచ్చారు. ఓ వైపు ప్రభుత్వ భూములను పరిరక్షిస్తూనే భవిష్యత్తులో ఎటువంటి పొరపాట్లు జరగనివ్వబోమని వెల్లడించారు. ప్రైవేటు ఆస్తుల యజమానులను ఇబ్బందిపెట్టాలనే ఉద్దేశం మాకు లేదు. గ్రౌండ్ రియాలిటీ ఎలా ఉందనే అంశంపై సమీక్షించాం. న్యాయంగా ఉన్నవాటిని త్వరలోనే నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం అని స్పష్టం చేశారు, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. కోర్టులకు వెళ్లాల్సిన పనిలేదు. అధికారులకు అప్లికేషన్స్ ఇస్తే చాలు. న్యాయబద్ధమైన మీ ఆస్తులకు తొందరగా క్లియరెన్స్ అభిస్తుంది. ప్రజలు ఆందోళన చెందవద్దు. కొన్ని ప్రాంతాల్లో అధికారుల తప్పిదాలను గుర్తించాం. కోర్టు ఆదేశాలను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయకపోవడం వల్లే సమస్య ఏర్పడింది. అధికారుల తప్పిదాలను సవరణ చేస్తున్నాం. నిజమైన కేసులు త్వరలోనే పరిష్కారం అవుతాయి అని అన్నారు. సీఎస్7, సీఎస్14కు సంబంధించి కొన్ని దశాబ్దాలుగా కోర్టు కేసుల్లో మగ్గుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు.

## కార్మికుల సంక్షేమ బోర్డు

>> సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆటో కార్మికుల సమస్యలను ఇప్పటికే కేబినెట్‌లో చర్చించామని త్వరలోనే రవాణా శాఖ తరపున కార్మిక శాఖతో చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం హామీ ఇచ్చిన విధంగా వీలైనంత త్వరలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఆటో ఛార్జీలను పెంచాలని ఆటో కార్మిక సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయని.. 2012లో ఆటో ఛార్జీలు పెరిగాయని, దాదాపు 14 సంవత్సరాలుగా ఛార్జీల పెంపు జరగలేదన్నారన్నారు. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు వాహనాల ధరలు, నిర్వహణ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ఆటో కార్మికుల ఇబ్బందులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందన్నారు. ప్రయాణికులపై అదనపు భారం పడకుండా అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆటో ఛార్జీల పెంపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఆర్‌టీసీ తరఫున ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేసి ఆర్‌టీసీనే ఆటోలు నడుపుతుందని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఆటో కార్మికుల ఉపాధిని దెబ్బతీసే ఎలాంటి ఆలోచన ఆర్‌టీసీకి లేదని తేల్చి చెప్పారు. ఆర్‌టీసీ ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేయదని మంత్రి స్పష్టం చేశారు. లాస్ట్‌మైల్ కనెక్టివిటీని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని.. ప్రస్తుతం ఉన్న ఆర్టీసీ, రైల్వే, మెట్రో వంటి ప్రజా రవాణా వ్యవస్థలను పరస్పరం అనుసంధానం చేసి ప్రయాణికులకు ఇంటి నుంచి బయలుదేరినప్పటి నుంచి తిరిగి ఇంటికి చేరే వరకు సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థను రూపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. పెట్రోల్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు రూ.1.50 లక్షల సాయంఆటో కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం వినియోగంలో ఉన్న పెట్రోల్, డీజిల్ ఆటోలను రెట్రో ఫిట్‌మెంట్ ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు ఒక్కో ఆటోకు రూ.1.50 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. ఆటో కార్మికులకు మరింత మేలు చేసేలా త్వరలోనే శుభవార్త చెబుతామని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. ఆటో కార్మికుల ఉపాధికి పూర్తి రక్షణగా ప్రజా ప్రభుత్వం ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.

## ఎగిరిన విమానం

>> ఇండిగో విమానం 6ఈ 1444: విశాఖపట్నం (విటిజెడ్) - అబుదాబి (ఎయుహెచ్) - డిపార్చర్స్. స్కూట్ విమానం టిఆర్ 784: సింగపూర్ (ఎస్ఐఎన్) - విశాఖపట్నం (విటిజెడ్) - అరైవల్స్. స్కూట్ విమానం టిఆర్ 785: విశాఖపట్నం (విటిజెడ్) - సింగపూర్ (ఎస్ఐఎన్) - డిపార్చర్స్. రోజులో తొలి రాక విమానాలుగా వచ్చిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఎయిర్ ఇండియా, ఇండిగో, స్కూట్, ఇండియా వన్ విమానాలకు సంప్రదాయబద్ధమైన వాటర్ క్యానన్ సెల్యూట్‌తో స్వాగతం పలికారు. ఇది ప్రాంతీయ విమానయానంలో నూతన అధ్యాయానికి నాంది పలికిన వేడుకగా నిలిచింది. తొలి రోజున 52 ఎయిర్ ట్రాఫిక్ మూవ్‌మెంట్స్ నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించడంతో, విమానాశ్రయం సందడిగా మారి తన కార్యకలాపాల ప్రయాణాన్ని ఉత్సాహభరితంగా ప్రారంభించింది.

## బలపడిన అల్పపీడనం

### మూడు రోజులు వర్ష సూచన

**హైదరాబాద్, అగస్టు 17, ప్రభాతవార్త:** వాయువ్య బంగాళా ఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారింది. దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ బెంగాల్ ఉత్తర ఒడిశా తీర ప్రాంతాలలో ఏర్పడిన వాయుగుండం సోమవారం ఉదయం 8.30 గంటలకు అదే ప్రాంతంలో కేంద్రీకృతమై ఉన్నట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది కోల్‌కతాకు సమీపంలో 22.5 ఉత్తర అక్షాంశం, 88.3 తూర్పు రేఖాంశం వద్ద సత్ఖీరా (బంగ్లాదేశ్)కు పశ్చిమనైరుతి దిశలో సుమారు 80 కిలోమీటర్లు, బంకురా (పశ్చిమ బెంగాల్)కు ఆగ్నేయంగా 160 కిలోమీటర్లు, బాలేశ్వర్ (ఒడిశా)కు ఈశాన్యంగా 180 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది రాబోయే 24 గంటల్లో మొదట ఉత్తరవాయువ్య దిశగా, ఆపై గంగానది పరివాహక పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, బీహార్ మీదుగా వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉంది. షియర్ జోన్ ఈ రోజు సుమారుగా 22 ఉత్తర అక్షాంశం వెంబడి మధ్య, ఆనుకొని ఉన్న ఉత్తర భారతదేశం ద్వీపకల్ప ప్రాంతము మీదుగా సగటు సముద్ర మట్టానికి 3.1, 9.4 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉంది. వీటి ఫలితంగా తెలంగాణలో రాబోయే మూడ్రోజుల పాటు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. రాష్ట్రంలో ఈరోజు, రేపు కొన్ని జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు కొన్నిచోట్ల కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. ఎల్లుండి తెలంగాణ రాష్ట్రంలో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. రాగల మూడు రోజుల్లో క్రింది స్థాయి ఉపరితల గాలుల వేగం 30 నుంచి 40 కి.మీ వరకు కొన్ని ప్రాంతాలలో కొనసాగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది.

# జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్‌సిటీతో రెండు లక్షల మందికి ఉపాధి

## ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్, ఇంప్లిమెంటేషన్‌పై విడియో కాన్ఫరెన్స్

## పాల్గొన్న కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్‌గోయల్, రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 17:** జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీ అభివృద్ధి పనులన్నీ 2028 మార్చి వరకు పూర్తి చేస్తామని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. 3,245 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ పారిశ్రామికవాడకు రూ.15 వేల కోట్ల పెట్టు బడులు వచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన చెప్పారు. సోమవారం కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్ న్యూఢిల్లీ నుంచి నిర్వహించిన నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్ మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ (ఎన్ఐసిడిఐటీ) విడియో కాన్ఫరెన్సులో శ్రీధర్‌బాబు సచివాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల ముఖ్య మంత్రులు, పరిశ్రమల మంత్రులు ఈ విడియో కాన్ఫ రెన్సులో పాల్గొన్నారు. జహీరాబాద్ స్మార్ట్ సిటీలో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభమైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండు లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని శ్రీధర్‌బాబు వివరించారు. ఈ స్మార్ట్ సిటీలో భూమి రూపంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా 51 శాతం ఉండగా, కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులు అంద జేస్తోంది. ఇప్పటికే స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పివి) కు అభివృద్ధి ప్రణాళికను అందజేసినట్టు శ్రీధర్ బాబు తెలిపారు. ఇంజనీరింగ్, ప్రొక్యూర్ మెంట్, కన్ స్ట్రక్షన్ (ఇపిసి) పద్ధతిలో జరగుతున్న పనులు ముందుగా నిర్ణయించిన సమయానికి పూర్తవుతాయిని శ్రీధర్ బాబు వెల్లడించారు. నీటి సరఫరా పనుల టెండర్ల ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. విద్యుత్తు సరఫరా పనులను కూడా గడువులోగా పూర్తి చేస్తామని వివరించారు. భవ్య (భారత్ అద్యోగిక్ వికాస్ యోజన) పథకం కింద కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల్లో నాలుగింటిని తెలంగాణాకు కేటాయిం చాలని మంత్రి పీయూష్ గోయెల్ ను కోరారు. వీడియో కాన్ఫరెన్సులో టిజి ఐఐసి ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య, పరిశ్రమల కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



# అశోక్‌ధామ్ ఆలయంలో తొక్కిసలాట

## ఏడుగురు మృతి, మరికొందరికి గాయాలు

**పాట్నా, ఆగస్టు 17:** శ్రావణమాసం కావడంతోభక్తులు పవిత్ర ఆలయాలకు వచ్చి స్వామిని దర్శించుకుని భక్తిప్రపత్తులతో పూజలు చేసుకోవడం ఆనవాయితీ. అయితే శ్రావణ సోమవారం కావడంతో బీహార్‌లోని అశోక్ ధామ్ ఆలయానికి భక్తులు భారీగా పోటెత్తారు. అదే సమయంలో కరెంటు వైర్ తెగిపడటంతో భక్తులు భయంతో పరుగులు తీశారు. దాంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. పలువురికి గాయాలయ్యాయి. బీహార్ రాష్ట్రం లఖిసరాయ్ జిల్లా లోని అశోక్‌ధామ్ ఆలయంలో ఈ తొక్కిస లాట విషాద ఘటనలో ఏడుగురు మృతిచెంది మరెందరికో గాయాలయ్యాయి. శ్రావణమాసం తొలి సోమవారం కావడంతో లఖిసరాయ్‌లోని ప్రముఖ శైవక్షేత్రం అయిన అశోక్‌ధామ్‌కు భక్తులు పోటెత్తారు. అయితే అనూహ్యంగా భక్తులపై కరెంటు వైర్ తెగిపడి విషాదానికి దారితీసింది. ఈ ఘటనలో గాయపడినవారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. మృతుల సంఖ్య అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది. కాగా ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# రాష్ట్రంలోని థర్మల్ కేంద్రాలకు బొగ్గు

## యేటా జి-11 రకం 50 లక్షల టన్నుల సరఫరా

## మహానది నుంచి తెలంగాణకు నాణ్యమైన బొగ్గు

## విద్యుదుత్పత్తికి కొరత లేకుండా కేంద్ర నిర్ణయం

## బొగ్గు సమస్యతో 9,593 మిలియన్ యూనిట్ల నష్టం

## కేంద్ర మంత్రిత్వ శాఖల సమన్వయ కమిటీ ఆమోదం

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు కొరత లేకుండా కేంద్రం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి నాణ్యమైన బొగ్గు సరఫరా చేసేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. కోల్ ఇండియా సంస్థకు చెందిన మహానది కోల్ ఫీల్డ్స్ నుంచి తెలంగాణ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా చేయడానికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఒడిశాలోని మహానది కోల్ ఫీల్డ్స్ సంస్థకు చెందిన గనుల నుంచి ప్రతి సంవత్సరం 50 లక్షల టన్నుల నాణ్యమైన బొగ్గును సరఫరా చేయడానికి కేంద్ర మంత్రిత్వ శాఖల సమన్వయ కమిటీ ఇటీవల ఆమోదం తెలిపింది. గత కొన్ని నెలలుగా సింగరేణి గనుల నుంచి సరఫరా లేకపోవడం వల్ల తెలంగాణ థర్మల్ ప్లాంట్లలో 9593 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో, దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ పెరిగిన నేపథ్యంలో, కేంద్ర బొగ్గు శాఖ అన్ని థర్మల్ కేంద్రాలకు ఉత్పత్తిని తగ్గించవద్దని ఆదేశించింది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లోని కోల్ ఇండియా అనుబంధ సంస్థల గనుల నుంచి నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలని కేంద్ర బొగ్గు శాఖను తెలంగాణ విద్యుత్ ఉత్పాదక సంస్థ జెన్కో కోరింది. మహానది కోల్ ఫీల్డ్స్‌కు చెందిన ఒడిశాలోని తాల్చేరు ప్రాంత గనుల నుంచి బొగ్గు సరఫరా చేయడానికి కేంద్ర కమిటీ ఇటీవల నిర్ణయం తీసుకుంది. ఈ ప్రక్రియలో రోజుకు గరిష్ఠంగా 5 రైళ్లలో బొగ్గును తీసుకెళ్లవచ్చని స్పష్టం చేసింది. మహానది గనులలో ఉత్పత్తి అవుతున్న జి-11 రకం బొగ్గు ధర టన్నుకు రూ.2300 ఖర్చు అవుతోంది. అదనంగా కిరాయి, రైలు రవాణా, ఇతర ఖర్చులు కలిపి మొత్తం ఖర్చు రూ.4,300 అవుతుందని జెన్కో అంచనా వేస్తోంది. సింగరేణి గనుల నుంచి వచ్చే బొగ్గుకు టన్నుకు రూ.4,941 చొప్పున వసూలు చేస్తున్నారని జెన్కో వర్గాలు వెల్లడించాయి. కాకినాడ పోర్టు ద్వారా బొగ్గు రవాణా చేయడానికి జెన్‌కో సంస్థ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఒడిశాలోని పారదీప్ పోర్టు నుంచి కాకినాడకు సముద్రమార్గంలో బొగ్గు తీసుకురావాలని, అక్కడి నుంచి కొత్తగూడెంకు లేదా దామెరచర్లకు రవాణా చేయాలని ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. కాగా స్థానిక సింగరేణికి చెందిన ఒడిశాలోని నైనీ గని నుంచి బొగ్గుతో నిండిన తొలి రైల్వే వ్యాగన్ ఇటీవల తెలంగాణకు చేరుకుంది. ఈ రైలులో మొత్తం 59 వ్యాగన్ల ద్వారా సుమారు 4 వేల టన్నుల జీ10 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (ఎస్‌టీపీపీ)కు రవాణా చేశారు.

# రాష్ట్రమంతా విజయవంతంగా మండలస్థాయి ప్రజావాణి

## 565 మండల ప్రజాపరిషత్ కార్యాలయాల్లో 5,410 వినతుల స్వీకరణ

## ప్రజావాణి రాష్ట్ర ఇన్‌చార్జ్ జి.చిన్నారెడ్డి, నోడల్ అధికారి విద్యాసాగర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు17:** రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం విజయవంతమైంది. ప్రజల సమస్యలను వారి మండల స్థాయిలోనే నేరుగా స్వీకరించి, వాటికి పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో రాష్ట్రంలోని అన్ని మండలాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. రాష్ట్రంలోని మొత్తం 565 మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో మండల స్థాయి ప్రజావాణి నిర్వహించగా, సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో కూడా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 566 మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించినట్లయిందని ప్రజావాణి రాష్ట్ర ఇంచార్జ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ తెలిపారు..మండల స్థాయి ప్రజావాణికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి మొత్తం 5,410 వినతులు (పిటిషన్లు) అందాయి. ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి నేరుగా తీసుకువచ్చి, వాటి పరిష్కారం కోసం వినతులను సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని అధికారులు స్వీకరించి, సమస్య స్వభావాన్ని పరిశీలించి, సంబంధిత శాఖల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకునే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రజావాణి కోసం అధికారులు శాఖ వారిగా డెస్కులు, హెల్ప్ డెస్కును, మంచినీటి సౌకర్యాలు కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక జిల్లాకు సగటున 164 వినతులు అందాయి.జిల్లాల వారీగా అత్యధికంగా వినతులు అందిన జిల్లాగా కరీంనగర్ జిల్లా నిలిచింది. కరీంనగర్ జిల్లాలో మొత్తం 704 వినతులు స్వీకరించారు. ఒక మండలానికి సగటున అత్యధిక వినతులు అందిన జిల్లాగా కూడా కరీంనగర్ జిల్లా ముందంజలో ఉంది. కరీంనగర్ జిల్లాలో ఒక్కో మండలానికి సగటున 47 వినతులు అందాయి.

## విడాకులివ్వకుండా రెండోపెళ్లి చేసుకుంటే

# 20 శాతం జీతంలో కోత

## అసోం సిఎం హిమంతబిశ్వశర్మ వెల్లడి



**గువాహతి, ఆగస్టు 17:** బహుభార్యత్వాన్ని నిర్మూలించే దిశగా కీలక చర్యలు చేపడుతున్న అస్సాం సర్కారు అందుకోసం తాజాగా మరో నిర్ణయం తీసుకుంది. మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకున్న ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో కోత పెట్టనున్నట్లు తెలిపింది. ఈ మేరకు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సోమవారం కీలక ప్రకటన చేశారు. ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా చట్టబద్ధంగా తన భార్య నుంచి విడాకులు తీసుకోకుండా ఆమెను వదిలేసి మరో మహిళతో వివాహ బంధం ఏర్పరుచుకుంటే సదరు వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని సీఎం తన ప్రకటనలో హెచ్చరించారు. ఆ ఉద్యోగి జీతం నుంచి 20 శాతం కోత విధించి, ఆ మొత్తాన్ని మొదటి భార్య బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేస్తామని తెలిపారు. అయితే ఆ ఉద్యోగి మొదటి భార్య దీని గురించి ప్రభుత్వం వద్ద దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని సీఎం చెప్పారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగుల్లో కొంతమంది విడాకుల ప్రక్రియ పూర్తి కాకుం డానే మరో మహిళతో కలిసి ఉంటున్న కేసులు వెలుగుచూసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు హిమంత తెలిపారు. విడాకుల అంశం కోర్టు వద్ద పెండింగ్‌లో ఉన్నా కూడా జీతంలో కోత కొనసాగు తుందని స్పష్టం చేశారు. న్యాయపరమైన ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎదురు చూడకుండా మొదటి భార్యకు ఆర్థిక సహకారం అందించాలనేదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. ఇక తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల వేతనంలో 10 శాతం కోత విధించనున్నట్లు హిమంత తెలిపారు.

# నాగ్‌పూర్ నుంచి ఆటో స్పీకర్‌బాక్స్‌లో గంజాయి స్మగ్లింగ్

## ఈగల్ పోలీసులకు చిక్కిన స్మగ్లర్లు

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త :** గంజాయి స్మగ్లర్లు తెలివిమీరారు. ఇప్పటి వరకు ఏపి, ఒడిషా నుంచి తెలంగాణ సహా దేశంలోని ఇతర ప్రాంతాలకు గంజాయి స్మగ్లింగ్ చేస్తుండగా దీనికి భిన్నంగా మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు ఆటోలో గంజాయి తరలిస్తూ ఐదుగురు స్మగ్లర్లు పట్టుబడ్డారు. వీరిని ఈగల్‌తో పాటు పేట్ బషీరాబాద్ పోలీసులు సోమవారం ఉదయం పట్టుకున్నారు. ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా దీనికి సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. నాంపల్లిలోని సుబాన్‌పూరాకు చెందిన మహమ్మద్ హామీద్ (30) ఓ ఆ టో డ్రైవర్. ఇటీవలే అతను నాగ్‌పూర్‌లోని ఓ దర్గాకు వెళ్లగా అక్కడ గంజాయి స్మగ్లర్ షేక్ సాదిక్‌తో పరిచయం ఏర్పడింది. అనంతరం సాదిక్ సలహా మేరకు కిలో గంజాయి 18 వేల రూపాయలకు కొన్న హామీద్ దానిని తన ఆటోలో ఎవరికి అనుమానం రాకుండా స్పీకర్ బాక్స్‌లలో వుంచి హైదరాబాద్‌కు తరలించి అమ్మసాగాడు. ఇలా కొంతకాలంగా ఇతను దండిగానే సంపాదించాడు. ఈ క్రమంలో హామీద్‌కు నాంపల్లికే చెం దిన తన మిత్రులు మహమ్మద్ అబ్బాస్ (30), మహమ్మద్ ముస్తఫా (25), సయ్యద్ అఫ్రోజ్ (23), లంగర్‌హౌస్‌కు చెందిన ఇర్ఫాన్ ఖాన్ (29 )లను కూడా ఈ దందాలో దించాడు. ఇలా ఐదుగురు కలిసి ఈ నెల 15వ తేదీన నాగ్‌పూర్‌కు ఆటో (నంబర్ టిజి 13టి 2464)లో బయలుదేరి 16వ తేదీన వెళ్లారు. అక్కడ సాదిక్‌కు లక్ష రూపాయలు ఇచ్చి ఆరు కిలోల గంజాయి కొని



దానిని చిన్నపాటి ప్యాకెట్లుగా మార్చి వెరికి అనుమానం రాకుండా ఆటోకు వున్న స్పీకర్ బాక్స్‌లలో భద్రపరిచారు. అనంతరం ఆదివారం అక్కడి నుంచి బయలుదేరి సోమవారం ఉదయం హై దరాబాద్‌కు రాసాగారు. అయితే వీరి గురించి పక్కా సమాచారం వున్న ఈగల్ పోలీసులు స్థానిక పోలీసులతో కలిసి పేట్ బషీరాబాద్‌లోని ఓ మాల్ వద్ద ఆటోను ఆపారు. అనంతరం తనిఖీ చేయగా స్పీకర్ బాక్స్‌లో దాచి వుంచిన ఆరు కిలోల గంజాయిని జప్తు చేశారు. అనంతరం ఐ దుగురిని అరెస్టు చేసి ఆరు కిలోల గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్లను జప్తు చేశారు. ఈ కేసులో పరారీలో వున్న సాదిక్ కోసం గాలిస్తున్నా న్నరు. కాగా హామీద్ వద్ద నుంచి నాంపల్లికి చెందిన 25 మంది యువకులు క్రమం తప్పకుండా గంజాయి కొంటున్నట్లు తేలింది. వీరి కోసం గా లిస్తున్నారు.

# ట్రైనీ ఐపిఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డికి 2 రోజుల పోలీసు కస్టడీ

## నేటి నుంచి విచారణ

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** సహచర మహిళా ట్రైనీ ఐపిఎస్ అధికారిని లైంగికంగా వేధించడంతో పాటు ఆమె ప్రైవేటు వీడియోలు. ఫోటోలను భర్తకు పంపిన కేసులో అరెస్టయి చంచల్‌గూడ జైల్లో రిమాండులో వున్న ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిని మరోదఫా రెం డు రోజుల పాటు కస్టడీ ఇస్తూ ఉప్పర్‌పల్లి కోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల ఆరు, ఏడవ తేదీల్లో ఒకదఫా ఇతన్ని కస్టడీలోకి తీసుకుని పోలీసులు విచారించడం తెలిసిందే. అయితే మొదటి దఫా విచారణలో ఉదయ్ కృష్ణారెడ్డి పెద్దగా నోరు మెదక పోవడంతో మరోసారి కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టును కోరారు. దీనిపై విచారించిన న్యాయమూర్తి ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో చంచల్‌గూడ జైల్లో వు న్న ఉదయ్ కృష్ణారెడ్డిని అత్తాపూర్ పోలీసులు మంగళవారం ఉదయం తమ కస్టడీలోకి తీసుకోనున్నారు. బుధవారం సాయంత్రి తిరిగి జైలుకు తరలించనున్నారు. జాతీయ పోలీసు అకాడమిలో శిక్షణలో వున్న తోటి మహిళా ట్రైనీ ఐపిఎస్ అధికారిపై లైంగిక వేధింపుల ఘటనపై జులై 18న ఉదయ్‌కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో బిఎన్ఎస్ 74,75,77, 315(2) సెక్షన్లతో పాటు ఐటి చట్టంలోని 66 సెక్షన్ కింద కేసు నమోద వడం తెలిసిందే. అదేరోజున ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసు అకాడమి నుంచి తాత్కాలికంగా సస్పెండ్ చేయడం విదితమే. దీని తరువాత అతను అజ్ఞాతంలో వెళ్లి హైకోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానంలో నిందితుడికి ఊరట లభించలేదు. అనంతరం గత నెల 28వ తేదీన ఉదయ్ కృష్ణారెడ్డి చేయగా మరుసటి రోజు రిమాండుకు తరలించారు. దీని తరు వాత ఒకసారి కస్టడీలోకి తీసుకుని నిందితుడిని విచారించిన పోలీసులు కొంతమేర సమాచారం రాబట్టారు. అయితే కీలకంగా వున్న సెల్‌ఫోన్ ఇంకా లభ్యం కాకపోవడంతో దీనికోసం రెండోదఫా కస్టడీలో అతన్ని విచారించనున్నారు.

# చేప పిల్లల టెండర్ల గడువు పెంచే యోచన

## కాంట్రాక్టర్ల నుండి స్పందన అంతంతే

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని మత్స్యకారుల ఉపాధి, చెరువుల్లో చేపల ఉత్పత్తి పెంపే లక్ష్యంగా నిర్వహించే ఉచిత చేపపిల్లల పంపిణీకి సంబంధించి టెండర్ల గడువును పెంచేందుకు మత్స్య శాఖ అధికారులు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. చేప పిల్లల పంపణీ చేసేందుకు ఇప్పటికే అధికారులు టెండర్లను పిలిచారు. టెండర్లు దాఖలు చేసేందుకు సోమవారం సాయంత్రంతో చివరి తేదీ ముగిసింది. అయితే టెండర్లు దాఖలు చేసేందుకు కాంట్రాక్టర్లు పెద్దగా ఆసక్తి చూపలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే టెండర్ల గడువు పెంచేందుకు సిద్ధమవుతు న్నారు. ఈ యేడాది రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, జలాశయాల్లో నాణ్యమైన చేప పిల్లలను విడుదల చేసేందుకు మత్స్య శాఖ రూ.116 కోట్లతో సన్నాహాలు పూర్తి చేసింది. కాగా గతంలో చేప పిల్లలను సరఫరా చేసిన ప్రైవేటు కాంట్రాక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం నుండి దాదాపు రూ.120 కోట్ల మేర బిల్లులు పెండింగ్ ఉన్నట్లు సమాచారం. ఏళ్లతరబడి ఈ బకాయిలను చెల్లించకపోవడంతో ఆర్థికంగా నష్టపోయిన కాంట్రాక్టర్లు ఈసారి టెండర్లు వేసేందుకు వెనుకడుగు వేసినట్లు ప్రచారం జరుగుతోంది. పాతబకాయిలు బిల్లులు చెల్లిస్తేనే టెండర్లలో పాల్గొంటామని పలువురు కాంట్రాక్టర్లు స్పష్టం చేసినా వాటిని అధికారులు విడుదల చేయకపోవడతోనే టెండర్లలో ఎక్కువమంది పాల్గొనలేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే చేప పిల్లల సరఫరా నిమిత్తం మరోసారి టెండర్ల గడువును పొడిగించి, బకాయిలపై అవసరమైన చర్యలు తీసుకోవాలని మత్స్య శాఖ అధికారులు భావిస్తున్నట్లు తెలియవచ్చింది.

# వాట్సాప్‌ల ద్వారా పాన్, ఆధార్‌కార్డులు పంపొద్దు

## ఐడెంటిటి థెఫ్ట్‌కు అవకాశం.. సురక్షిత మార్గం అనుసరించాలంటున్న సైబర్ నిపుణులు

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** పాన్‌కార్డు, ఆధార్‌కార్డులు ఇప్పుడు అందరికి ఎంతో ముఖ్యమైనదిగా మారడం తెలిసిందే. వీటిని అందరు తమ జేబుల్లో వుంచుకుంటూ అవసరం అయినపుడు వాడుకుంటుండడం విదితమే. ఇంకొన్నిసార్లు ఎవరికైనా పంపాల్సిన తరుణంలో వా టిని వాట్సాప్ ద్వారా పంపుతున్నారు. అయితే ఇలా పంపడం సరికాదరి సైబర్ నిపుణులు చెబుతున్నారు. డిజిటల్ ట్రస్ట్ ప్లాట్‌ఫాం డిజియో నిపుణులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. వాట్సాప్ ద్వారా చాలా వరకు పత్రాలను అనేక మంది పంపుతుండడం తెలిసిందే. ఒకప్పుడు జిరాక్స్‌ను ఇస్తుండగా ఇప్పుడంతా వాట్సాప్ యుగం కావడంతో ప్రతీదానికి వాట్సాప్‌ను వాడుతూ ఎదుటి వ్యక్తికి పంపాల్సిన పత్రా లను దీని ద్వారానే పంపుతున్నారు. అయితే దీనివల్ల అనేక సమస్యలు తలెత్తే ప్రమాదం వుందని సైబర్ నిపుణులు చెబుతున్నారు. ఇలా చేయ దం వల్ల ఆర్థిక మోసాలకు గురయ్యే ప్రమాదం వుందని వారు హెచ్చరిస్తున్నారు. వాట్సాప్‌లో పంపుతున్న డాక్యుమెంట్ల వల్ల అవి అవతలి వ్య క్తికి చేరుతుండడం నిజమే అయినా దాని తరువాత అవి వెరొకరికి చేరితే ముప్పువాటిల్లే అవకాశం వుందని నిపుణులు చెబుతున్నారు. అవతలి వ్యక్తులు తమ ఫోన్ లేదా లాప్ టాప్‌లను అనుకోకుండా ఎవరికైనా ఇస్తే, ఇలా తీసుకున్న వ్యక్తికి చెందిన సెల్‌ఫోన్ లేదా కంప్యూటర్‌కు చెందిన డివైజ్ ఒకవేళ హ్యాకింగ్‌కు గురైతే, లేదా సదరు వ్యక్తి పాస్ వర్డ్ చోరీ అయితే మొదట వాట్సాప్‌ను వాడిన వ్యక్తి డాక్యుమెంట్లు నేరగాళ్ల చేతికి చిక్కే వీలుందని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీని తరువాత వాట్సాప్‌లో వున్న సమాచారంపై నియంత్రణ పూర్తిగా కోల్పోవాల్సి వుంటు ందని వారంటున్నారు. దీంతో మొదట వాట్సాప్ వాడిన వ్యక్తి డేటా కూడా చోరీ అయ్యే ప్రమాదం వుందని నిపుణులు చెబుతున్నారు. ఆర్థిక ర ంగంలో పనిచేసే డైరెక్ట్ సెల్లింగ్ ఏజెంట్లు (డిఎస్ఏలు) కస్టమర్ల నుంచి కెవైసి పత్రాల ను తమ వ్యక్తిగత ఫోన్ నంబర్ల ద్వారా సేకరిస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరమని నిపుణులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల వాట్సాప్ వాడి పాన్ కార్డు, ఆధార్ కార్డు సహా ఇతర డాక్యుమెంట్ల ను పంపిన మొదటి వ్యక్తికి సంబంధించిన సమాచారం సైబర్ భద్రతా వ్యవస్థల పరిధిని దాటి బయటకు వెళ్లిపోయి నేరగాళ్ల పాలవుతుందని నిపుణులు అంటున్నారు. దీనివల్ల పాన్ కార్డు, ఆధార్ కార్డుతో పాటు బ్యాంకుకు సంబంధించిన వివరాలు అపరిచితుల చేతికి చిక్కే ప్రమాదం వుందని వారంటున్నారు. కొన్నిసార్లు ఇది ఐటెంటిటి థెఫ్ట్‌కు దారితీయడంతో పాటు భారీ ఆర్థిక మోసాలకూ దారి తీస్తుందని నిపుణులు చెబుతు న్నారు. 2024..25 వార్షిక నివేదిక ప్రకారం దేశంలో ఆ ఏడాది 36,014 కోట్ల విలెవూన 23,953 బ్యాంకింగ్ మోసాలు జరిగాయని దీనికి ఐటెంటిటి థెఫ్ట్ కారణమని నిపుణులు తెలిపారు. అయితే వాట్సాప్ ద్వారా కాకుండా సురక్షితమైన ప్లాట్ ఫాంలతో పాటు అప్‌లోడ్ పోర్టల్స్ ద్వారా డాక్యుమెంట్లను పంపవచ్చని వారంటున్నారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ అనుసారం వ్యక్తిగత సమాచార సేకరణ, వినియో గంపై స్పష్టమైన మార్గదర్శకాలు వున్న విషయాన్ని నిపుణులు ఉదహరిస్తున్నారు. అనేక దేశాల్లో వాట్సాప్ ద్వారా డాక్యుమెంట్లను పంపడంపై నిషే ధం వుందని, దీనికి బదులు సురక్షితమైన పద్ధతు లను వాడుతున్నారని నిపుణులు తెలిపారు.

# ఆటోడ్రైవర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

## డిమాండ్ల సాధనకై 23 నుంచి ఆటో, స్కూల్ వ్యాన్‌ల నిరవధిక బంద్

## మహాధర్నాలో బిఎంఎస్ ప్రతినిధులు




ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న రవిశంకర్ అల్లూరి

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 17, ప్రభాతవార్త:** ఆటోడ్రైవర్ల న్యాయమైన డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ అఖిల భారత అధ్యక్షుడు సుంకరి మల్లేశం, భారతీయ ప్రైవేట్ ట్రాన్స్ పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ అఖిలభారత ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి, ఆటో, ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చింతల నందకిషోర్, రాష్ట్ర ప్రధాన కార్య దర్శి బి.పెంటయ్యగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో బిఎంఎస్ అనుబంధ సంఘం రాష్ట్ర ఆటో, ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. ఈ ధర్నానుద్దేశించి వారు మాట్లాడుతూ ఆర్టీసీలో ఈవీ ఆటోల ప్రతిపాదన విరమించుకోవాలని, ఆటో, ప్రైవేట్ రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని, ఆటో డ్రైవర్లకు యేటా ఇస్తామన్న రూ. 12వేలు బకాయిలుసహా చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో రాష్ట్రవ్యాప్త పర్మిట్లు మంజూరు చేయాలని, ఆటో త్రీవీలర్ లైసెన్స్ పునరుద్ధరించాలని, ఆర్టీఏ కార్యాలయాల్లో కార్పొరేట్ రేడియం దందాను నిలిపి వేయాలని, కేంద్ర ప్రభుత్వం జారీచేసిన గిగ్ వర్కర్స్ అగ్రిగేటర్ పాలసీను రాష్ట్రంలో యధావిధిగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభు త్వం స్పందించి, న్యాయం చేయాలని, లేదా ఈనెల 23 అర్ధరాత్రి నుంచి ఆటో, స్కూల్ వ్యాన్, క్యాబ్‌డ్రైవర్లతో కలసి నిరవధిక బంద్ చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.శ్రీధర్‌రెడ్డి, కార్యధ్యక్షులు సమ్మయ్య యాదవ్, బాబురాజ్, జేబిఎస్ శ్రీనివాస్, జహంగీర్, అశ్విన్‌రాజు, ఈశ్వర్, పరశురాం, వజ్రలింగం, కపిల్, ఆర్.మహేష్, సంతోష్, బుచ్చయ్య గిరి తదితరులు పాల్గొన్నారు.ధర్నా తర్వాత రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తికి, జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ వెంకటరమణకు వినతిపత్రం అందచేశారు.

**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY**
Thulluru Mandal, Guntur District - 522237, Andhra Pradesh
NIT No. 21/MAU61-ADMN0STG(OTH)/12/2026/2nd call Dt: 14/08/2026
**E-PROCUREMENT TENDER NOTICE**
Name of Work: APCRDA - "Request for Proposal (RFP) for Selection of Consultant to Provide Comprehensive Multi-layered Third-Party Quality Assurance & Quality Control Services for infrastructure and construction works of development in Amaravati Capital City, Andhra Pradesh, India". The bid can be downloaded on AP e-procurement portal from 19.08.2026 to 03.09.2026 up to 14.00 Hrs. Due date for submission of Bid is 03.09.2026 up to 15.00 Hrs, Technical bid opening 03.09.2026 @ 16.00 Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.
Sd/- Commissioner, APCRDA, Amaravati

దేవాదాయ ధర్మాదాయ శాఖ
**శ్రీ మైసమ్మ దేవత శివాలయ రామాలయ దేవస్థానం**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
RC.No.33/SMDSRD/2026, తేది: 17.08.2026.
శ్రీ మైసమ్మ దేవత శివాలయ రామాలయ దేవస్థానం, మైసిగండి వారికి ఒక (1) సంవత్సరం 01.11.2026 నుండి 31.10.2027కు ఆహార దినుసులు యొక్క సరఫరా నిమిత్తం ఇ-ప్రొక్యూర్‌మెంట్ పై టెండర్లు కోరబడుతున్నవి. వివరాలకు క్రింది వెబ్‌సైట్: http://tender.telangana.gov.in (లేదా) 9441059524, 9640001777, 9441088909 సంప్రదించండి.
సం/- ఎగ్జిక్యూటివ్ అధికారి, శ్రీ మైసమ్మ దేవత, శివాలయ, రామాలయ దేవస్థానం, మైసిగండి (గ్రా), కడ్తాల్ (మం), రంగారెడ్డి (జిల్లా) 509358
DIPR.No.8056-PP/CL/Advt/1/2026-27, తేది: 17.08.2026

hmda
**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
4వ అంతస్తు, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట, హైదరాబాద్
HMDA చట్టం 2008 యొక్క 15(3) సెక్షన్ క్రింద బహిరంగ ప్రకటన
(ప్రభుత్వ మెమొ నం. 3754253/Plg.I(1)/2025 తేది: 02.07.2026.
G.O.Ms.No. 33, MA & UD, తేది 24.01.2013 ప్రకారం, ప్రభుత్వంచే అనుమతించబడి, ప్రకటించబడిన మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ ప్లాన్-2031లో ఉద్దేశించబడిన భూమి వినియోగానికి (2008 యొక్క చట్టం నం.8) 2008 HMDA చట్టం యొక్క సెక్షన్ 15 యొక్క సబ్-సెక్షన్ (1) ద్వారా సంక్రమించబడిన అధికారాలను వినియోగిస్తూ ఈ క్రింది ముసాయిదా మార్పు చేయడానికి ప్రతిపాదించడమైనది.
రంగారెడ్డి (జిల్లా), శంకర్‌పల్లి (మం), మోకిల (గ్రా) వద్ద సర్వే నం.149/A1/1లో ఉన్న ఎక.06-35 గుంటలు విస్తీర్ణ స్థలం ఏదైతే G.O.Ms.No. 33 MA & UD, తేది: 24.01.2013 ప్రకారం ప్రభుత్వంచే అనుమతి పొంది ప్రకటించబడిన MDP-2031 ప్రకారం పెరి అర్బన్ వినియోగ జోన్‌గా ప్రస్తుతం అధికారయుతంగా నిర్దేశించబడిందో అది ఇప్పుడు నివాసిత వినియోగ జోన్‌గా అధికారయుతంగా నిర్దేశించటానికి ప్రతిపాదించబడింది.
పై సంబంధిత వివరాలు వెబ్‌సైట్స్ http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// లో అందుబాటులో ఉన్నాయి.
సదరు ప్రతిపాదనలకు ఏ వ్యక్తి లేదా సంస్థ నుండైనా అభ్యంతరాలు/సూచనలు పరిగణింపబడతాయి. వారు అభ్యంతరాలు/సూచనలను లిఖితపూర్వకంగా ఈ ప్రకటన ప్రచురింపబడిన తేదీ నుండి పదిహేను (15) రోజులలోపుగా HMDA, MCకు గానీ లేదా ప్రిన్సిపల్ సెక్రటరీ, MA & UD విభాగం, తెలంగాణ సెక్రటేరియట్, హైదరాబాద్ వారికి గానీ దాఖలు చేయవలెను.
సం/- చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, (PR), HMDA
DIPR.No.8101-PP/CL/Advt/1/2026-27, తేది: 17.08.2026

आईआरईएल (इंडिया) लिमिटेड IREL (ఇండియా) లిమిటెడ్
పూర్వపు ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్
(भारत सरकार का उपक्रम)
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
CIN : U15100MH1950GOI008187 Website : www.irel.co.in
ISO 9001: 2015, ISO 14001: 2015 & ISO 45001 : 2015 Company
आज़ादी का अमृत महोत्सव

Ref: ADVT.NO.26-27/11 టెండర్ నోటీస్ తేది: 12.08.2026
IREL (ఇండియా) లిమిటెడ్, చవారా ఈ క్రింది ఐటమ్‌లు/పని వివరణలకు బిడ్ కోరుతోంది

| ఈవెంట్ నం. (GeM) | పని / ఐటమ్ వివరణ |
|---|---|
| GEM/2026/ B/7904442 | 120000 టన్ కొరకు: నీన్దకార గ్రామం యొక్క తజెతురుతు గని త్రవ్వక స్థలం నుండి HUP ఖనిజ ఇసుక యార్డ్ జీరో తడి వుండే ప్రాతిపదికపై ఇసుక ఖనిజం తవ్వకం, సేకరణ, గుట్ట వేయడం, లోడింగ్ మరియు రవాణా, 20000 టన్ కొరకు: నీన్దకార గ్రామం యొక్క తజెతురుతు గని త్రవ్వక స్థలం వద్ద HUP / MSP టైల్స్ యార్డ్ నుండి తవ్వకం పిట్‌కు టైల్స్ ఇసుక యొక్క యాంత్రిక లోడింగ్, రవాణా మరియు లెవెలింగ్. |
| GEM/2026/ B/7906759 | జీరో తడి వుండే అదే ప్రాతిపదికపై VT వద్ద స్పైరల్ ప్లాంట్‌కు వెల్లన తురుతు మరియు పండరతురుతు ఏరియా మధ్య కామన్ సరిహద్దు మరియు వెల్లన తురుతు ఏరియా (యోగీశ్వరన్) నుండి ఇసుక ఖనిజం యొక్క తవ్వకం, గుట్ట వేయడం, రాశిగా స్టాకింగ్ లోడింగ్ మరియు రవాణా. |

బిడ్డర్ http://irel.co.in లేదా http://gem.gov.in వెబ్‌సైట్ నుండి టెండర్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. ఏదైనా పై టెండర్లకు సవరణ / పొడిగింపు పై వెబ్‌సైట్స్‌లలో మాత్రమే ఉంచబడును.
CBC 48139/11/0012/2627 సం/- హెడ్, చవారా


వార్త

మనుషుల వెనుక చెప్పే మాటలను వారి ముఖాల మీదనే చెబితే సమాజం నిలబడటం కష్టం.

- బాల్జాక్


# కలల వై'భోగం'

కాలాతీతమైనా తూర్పున నవోదయానికి నాంది జరిగింది. సరైన సమయంలో సరైన సందర్భంలో సరైన దిశానిర్దేశం జరిగి భోగాపురానికి ఆకాశయాన వైభోగం దక్కింది. ఇది ఉత్తరాంధ్రకే కాదు తూర్పు తీరానికే ఉషోదయం. వర్తక వాణిజ్యాలకు పెట్టింది పేరయిన ఆ ప్రాంతానికి నిరంతర విమానయాన సౌకర్యాన్నిపొందడం విశేషం. నవ్యాంధ్రప్రదేశ్‌కు ఉత్తరాన విశాఖపట్నం, మధ్యమాన విజయవాడ, దక్షిణా పథాన తిరుపతి ముఖ్యమైన కూడళ్లు. కోస్తాతీర ప్రాంతమంటేనే ప్రాచీన కాలం నుండి వర్తక రాజధానిగా విలసిల్లింది. కాకినాడ, మచిలీపట్నం, విశాఖపట్నంలో మంచిరేవు పట్టణాలైన కనెక్టివిటీ విషయంలో ఎక్కడో కొంత అసంతృప్తి ఉండేది. ప్రధానంగా విశాఖపట్నం రేవు ద్వారానే ఇతర దేశాలకు వాణిజ్యపరంగా ప్రాధాన్యత ఉండేది. గమనాగమనాలన్నీ ఆ రేవు ద్వారానే కానీ ఆకాశయానం అంశానికొస్తే ప్రస్తుతమున్న విశాఖ ఎయిర్‌పోర్ట్ మాత్రం కలిసిరాలేదు. దాని స్థల మహత్యం అలాంటిది. తీర ప్రాంతం తుఫానుల వంటి ప్రకృతి బీభత్సాలను తట్టుకోవాల్సి వచ్చినప్పుడు విశాఖ విమానాశ్రయం కూడా మోకాలిలోతు నీటిలో మునిగిపోవడం చేత అక్కడ్నించి ఎక్కడికి వెళ్లాలన్నా విమానాశ్రయం అందుబాటులో ఉండేది కాదు. దాదాపు నాలుగున్నర దశాబ్దాల నాడు నిర్మితమైన విశాఖపట్నం విమానాశ్రయం సంవత్సరానికి కొన్ని రోజులే ప్రయాణీకులకు అందుబాటులోకి వస్తుండేది. వాణిజ్యానికి నౌకాయన మార్గం ఉన్నా కాని వాటి స్థితిగతులను పర్యవేక్షించే పారిశ్రామిక యాజమాన్యానికి ప్రయాణ సౌకర్యం తక్కువగా ఉండేది. ఇలాంటి పరిస్థితులు విశాఖపట్నానికి మరో ప్రత్యామ్నాయ ఏర్పాటు అవసరమైంది. ఇప్పుడు ఉత్తరాంధ్ర వాసుల కలలు ఫలించాయి. విశాఖపట్నం విమానాశ్రయానికి స్వస్తి వాచకం చెప్పి పట్టణానికి 45 మైళ్ల కిలోమీటర్ల దూరంలో ఉండే భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి అడుగులు పడ్డాయి. ప్రధానంగా విశాఖపట్నం తమ వాహన వై'భోగా'న్ని సోమవారం నుంచి అందుకున్నారు. నాలుగు రోజుల నాడు ప్రధాని నరేంద్రమోడీ ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించారు. భోగాపురం విమానాశ్రయానికి మన్యవీరుడు అల్లూరి సీతారామ రాజు పేరు పెట్టడంతో ఉత్తరాంధ్రలో గిరివాసులు సైతం ఆ విమానాశ్రయం తమది, తమకోసమే నిర్మించారని చెప్పుకుంటూ ఉత్తేజితులయ్యారు. తొలి విమానం ఇక్కడ్నించి సింగపూర్‌కు బయలుదేరింది. మొదటిగా హైదరాబాద్ నుంచే ఇండిగో విమానం చేరుకుంది. ఈ సందర్భంలో విశాఖవాసులు ఎంతో ఆనందోత్సవాల మధ్య కరతాళధ్వనులతో గగనయానానికి అంకురార్పణ చేశారు. శ్రీకాకుళం నివాసి, సీనియర్ రాజకీయ వేత్త, కేంద్ర మంత్రి ఎర్రంనాయుడు కుమారుడు కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర విమానయాన శాఖా మంత్రిగా ఉండడంతో భోగాపురం విమానాశ్రయ నిర్మాణం వాయువేగంతో పూర్తయిపోయింది. ప్రధాని హస్తవాసి కలిసొచ్చింది. ఎలాంటి అవాంతరాలు లేకుండా తొలి విమానం 'టేకాఫ్' అయ్యింది. ఉత్తరాంధ్ర ప్రజలు సంభ్రమాశ్చర్యాలతో మునిగిపోయారు. ఇన్నాళ్లా వెలితిగా ఉన్న గగనయాన సౌకర్యం నేడు అందుబాటులోకి వచ్చింది. ఈ విమానాశ్రయం ఇప్పుడు 'గేట్ వేఆఫ్ ది ఈస్ట్' భోగాపురం విమానాశ్రయం ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్టు కోడ్ 'విటిజడ్'తో కార్యకలాపాలు మొదలయ్యాయి. విశాఖ నుంచి ఎయిర్‌పోర్ట్‌కుప్రతిరోజూ 20 ఎలక్ట్రిక్ బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంచారు. ఎయిర్‌పోర్ట్ భద్రత, బాధ్యతలు సిఐఎస్ఎఫ్‌కు దఖలు పడ్డాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక వసతుల కలబోతగా భోగాపురం ఎయిర్‌పోర్టు ఆవిష్కరణ జరిగింది. ప్రస్తుత విశాఖ పట్టణం ఎయిర్‌పోర్టు నావికాదళం చేతిలో ఉంది. 'రన్ వే'ను పొడిగించేందుకు అదనపు స్థలమేదీ లేదు. రోజుకి అయితే విశాఖపట్టణం ఎయిర్‌పోర్టు మూసివేసినందున ఒక్కసారిగా బావురుమంది. స్థానికంగా ఉపాధి పొందిన స్కిల్డ్ వర్కర్స్ విషణ్ణ వదనాలతో వీడ్కోలు చెప్పారు. 50కిపైగా విమానాల రాకపోకలు సాగిస్తుంటే రద్దీగా ఉన్నప్పుడు 20 లక్షల మంది ప్రయాణికుల ప్రయాణావసరాలను తీరుస్తోంది. అనకాపల్లి విశాఖ భోగాపురం కారిడార్‌లో గణనీయంగా పారిశ్రామికాభివృద్ధి జరుగుతున్న ప్రస్తుత తరుణంలో 'లాజిస్టిక్ హబ్'ను తీర్చిదిద్దే పనిలో పాలకులు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మించగలగడం ప్రశంసనీయం. విశాఖ పోర్ట్ నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ వరకు తీర్చిదిద్దిన లాజిస్టిక్ సౌకర్యాల కారణంగా సముద్ర ఉత్పత్తులు, అరటి, మామిడి ఉత్పత్తులు విదేశాలకు సత్వరమే చేరుకోవచ్చును. కార్గో, హోటళ్లు, ట్యాక్సీలు తదితర ఎన్నో రంగాలకు సంబంధించిన సంస్థల్లో స్కిల్డ్ ఉద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయి. ప్రధానంగా ఉత్తరాంధ్ర యువతకు జీవనోపాధికి మార్గం సుగమమవుతుంది. గత వందేళ్లుగా వెనుకబడిన ప్రాంతంగా ఉండి, కేవలం ఇతర ప్రాంతాలకు వలసలకు వెళ్లి జీవనోపాధి సాధించుకుంటున్న ఉత్త రాంధ్ర ప్రజానీకానికి ఈ గ్రీన్‌ఫీల్డ్ కొత్తదారి చూపెడుతోం ది. ఈ ఎయిర్ పోర్ట్‌కు సమీపంలో అరకు వ్యాలీ, బొర్ర గుహలు, లంబసింగి, పాడేరు వంటి పర్యాటక ఆకర్షణీయ ప్రాంతాలున్నందున ఈప్రాంత టూరిజం అభివృద్ధికి దోహదపడుతుంది. ఇప్పటికే విశాఖపోర్టు నుంచి 2025- 06 ఆర్థిక సంవత్సరంలో 5.12 లక్షల మెట్రిక్ టన్నుల సముద్ర ఆహార ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయని 'ఎంపెడా' గణాంకాలు చెబుతున్నాయి. వాటి విలువ రూ. 20,218 కోట్లు ఉంటుంది. తాజాగా పోర్టుకు సకల హంగులూ ఉన్న భోగాపురం ఎయిర్ పోర్టు జతకలవడంలో వాణిజ్య ఎగుమతి దిగుమతులకు అడ్డే ఉండదు. ఇబ్బడిముబ్బడిగా పరిశ్రమలు, స్థానికులకు జీవనోపాధిని ఆశించవచ్చు.



ధర్మాత్ముడైన మనిషి మంచి గంధపు చెట్టు వంటివాడు. తనను నరికే గొడ్డలికి కూడా అది సువాసన ఇస్తుంది.

తులసీదాస్



మానవుడు పక్షిలా ఆకాశంలో ఎగరడం, చేపలా నీటిలో ఈదడం నేర్చుకున్నాడు. కానీ మనిషిగా భూమ్మీద బతకడం నేర్చుకోలేడు.

బెర్ట్రాండ్ రస్సెల్

## ప్రజావాక్కు



### ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్సుల్లో ఉచితం అవసరం లేదు

మన రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉచిత బస్ ప్రయాణం ఆర్డినరీ, పల్లె వెలుగు బస్సులకి వర్తింప జేసింది. ధనిక మహిళలకు కూడా ఎక్స్‌ప్రెసుల్లో ఉచిత సౌకర్యం వర్తింప జేస్తుంటే, బస్సులు క్రిక్కిరుస్తున్నాయి. బస్‌డిపోల్లో సీట్లు నిండిపోయి అత్యవసర పనులమీద తర్వాత్‌స్టేజీల్లోటికెట్ కొని ఎక్స్‌ప్రెస్సులు ఎక్కినవారుఎంతోసేపు నిల్చొని గమ్యం చేరే దుస్థితి వచ్చింది. పెరుగుతున్న రద్దీ తట్టుకోటానికి అవసరమైన ట్రిప్పులు సంస్థ పెంచకపోవటంతో డబ్బులిచ్చి దెబ్బలుతిన్నట్లుగా వుందివారి పరిస్థితి. కనుక ఈ ఉచిత ప్రయాణాన్ని గతంలో వలె ఆర్డినరీ, పల్లె వెలుగు బస్సులకే కల్పిస్తే, ఆర్టీసీ నష్టాలు కొంత మేరకు తగ్గుతాయి. లేకపోతే పురుష ప్రయాణీకులపై మళ్ళీ చార్జీల బాదుడు తప్పదు. ఇక నాన్ స్టాప్ బస్సుల్లో కండక్టర్ లేకుండా డ్రైవర్ ఒక్కడినే పంపించటం క్షేమం కాదు. జీతాలభారం ఎక్కువనిభావిస్తే తాత్కాలిక పద్ధతిపై కండక్టర్లని నియమిస్తే కొందరు పేద నిరుద్యోగులకు జీవనభృతి లభిస్తుంది, డ్రైవర్లకు అదనపుభారం తప్పుతుంది.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### ఎవరికోసం ఈ స్వాతంత్ర్య వేడుకలు?

80 సంవత్సరాల స్వతంత్ర భారత్‌లో ఒక జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుని పట్ల అంటరానితనమా సిగ్గుచేటు. ఇదేకదా సనాతనంలక్ష్యం? ఉత్తరాఖండ్‌లో నాలుగు రోజులక్రితం జరిగిన ఒక సభలో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే మాట్లాడి వెళ్లిన తరువాత, శ్రీరామ సేన బ్యాచ్ ఆప్రాంతాన్ని శుద్ధి చేశారట. ఈ విషయాన్ని ఆయన స్వయంగా రాజ్యసభలో ప్రకటించారు. ఈరోజు మనం 80వ స్వతంత్ర సభలు జరుపుకున్నాం. ప్రధాని సమాధానం చెప్పాలి. ఈ సనాతనం బ్యాచ్‌ని అరెస్ట్ చెయ్యాలి.

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### అందుబాటులో ప్రభుత్వ ఆసుపత్రి

హైదరాబాద్ నగరంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన టిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రి నేటి నుండి అందుబాటులోకి ప్రజలకు సౌకర్యాలు కల్పించనుంది. రాష్ట్రంలో మధ్య తరగతి ప్రజలు నిరుపేదలు, బడుగు బలహీన వర్గాల అనారోగ్యాల బారిన పడితే ఎలాంటి సంబంధిత వ్యాధులకు అయినా పూర్తి ఉచిత వైద్యం కల్పించనున్నారు. కావున ఈ అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### నిజమైన స్వాతంత్ర్యం, గణతంత్రం ఎప్పుడు?

భారతదేశానికి స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15), గణతంత్ర దినోత్సవం (జనవరి26) అనేవి రెండు కళ్లు లాంటివి. బ్రిటీష్ వారి బానిస సంకెళ్లను తెంచి, దేశ ప్రజలకు స్వేచ్ఛను అందించడం కోసం ఎందరో మహనీయులు తమ జీవితాలను త్యాగం చేశారు. వారు అందించిన ఫలాలనే నేడు మనం అనుభవిస్తున్నాం. స్వాతంత్ర్యం అంటే పరాయి పాలన నుండి విముక్తి. గణతంత్రం అంటే ప్రజలే ప్రభువులుగా రాజ్యాంగబద్ధంగా పరిపాలించుకోవడం. కానీ నేటి పరిస్థితులు చూస్తుంటే ఆ మహనీయుల ఆశయాలు నెరవేరుతున్నాయా? అనే ప్రశ్న తలెత్తుతోంది. నేడు ఎన్నికల్లో ఓట్లను డబ్బులు, ఇతర ప్రలోభాలతో కొనుగోలు చేసి కొందరు ప్రజాప్రతినిధులు చట్టసభల్లోకి అడుగుపెడుతున్నారు. ప్రజలు కూడా ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, నిజాయితీ గల నాయకులను ఎన్నుకున్నప్పుడే చట్టసభలకు గౌరవం దక్కుతుంది.

- అలవారి వెంకటేష్, నెల్లూరు

### అత్యున్నత ప్రజా వేదిక

ప్రజాస్వామ్యంలో పార్లమెంట్ కేవలం చట్టాలను ఆమోదించే వేదిక కాదు. దేశాన్ని ప్రభావితం చేసే కీలక అంశాలపై సమగ్ర చర్చ జరిగే అత్యున్నత ప్రజా వేదిక. అయితే ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలు ఆశించిన స్థాయిలో ఫలప్రదంగా సాగకపోవడం ఆందోళన కలిగించే పరిణామం. రికార్డు కోసం 12 బిల్లులు ఆమోదమైనప్పటికీ, వాటిపై తగిన స్థాయిలో చర్చజరగకపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుగుణం కాదు. ఒక్కో బిల్లుకు సగటున పదిహేనునిమిషాల సమయం మాత్రమే కేటాయించడం చట్టాల నాణ్యతపై సహజంగానే ప్రశ్నలు రేకెత్తిస్తుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కాంట్రాక్టు ఉద్యోగుల వయోపరిమితి పెంచాలి

ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు పబ్లిక్ సెక్టార్, సొసైటీస్, ప్రభుత్వ పరిధిలోనున్న ఉద్యోగులందరికీ ఉద్యోగ విరమణ వయో పరిమితి 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచియున్నారు. కాని మోనటరీ బెనిఫిట్స్, పెన్షన్ సదుపాయాలు లేక ఈవయసులో కుటుంబ పోషణకు ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్న ఉన్నత విద్యావంతులు, అనుభవజ్ఞులైనకాంట్రాక్టుఉద్యోగుల వయోపరిమితి విషయంలో మాత్రం ఎన్ని వినతి పత్రాలిచ్చినా! చెవిటి వాని ముందు శంఖం ఊదినట్టు అధికారులుగాని, పాలకులు గాని చలించడం లేదు.

-డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# ప్రజాస్వామ్యానికి వన్నె తెచ్చే 'ఓటు' వేయాలి

*చదువులు పెరిగాయి, సాంకేతికత పెరిగింది! అన్ని రకాల అభివృద్ధి పొందుతున్నాం! న్యాయంగా, నీతిగా ఉండాలనే జ్ఞానాన్ని చదువుల ద్వారా పొందిన, పొందుతున్న పౌరులు ప్రజాస్వామ్య పరిధిలో వ్యవహరించాల్సిన వారు, ఎందుకు నైతికతను కోల్పోతున్నారు? వారి ప్రతినిధులను ఎన్నుకోవటంలో ఎందుకు ప్రలోభాలకు లొంగి స్వలాభం చూసుకుంటున్నారు? ఓటర్లకూ బాధ్యత వుంది! ఆ బాధ్యత సక్రమంగా నిర్వహించాల్సిందే! ఆ నిజాన్ని కప్పిపెట్టలేరు! ప్రతి యుగంలోనూ ప్రజలు తమ లక్ష్యం గుర్తించినప్పుడే బాధ్యతతో వ్యవహరిస్తారు! లక్ష్యాన్ని నిర్లక్ష్యం చేస్తే తమను తామే మోసగించుకొని కష్టాల పాలవుతారు! దారి కోల్పోయి నియంతలకు దారి చూపించిన వారవుతారు! మన దేశానికి చివరి నిముషంలోనైనా సరియైన దారిలో పంపిన చరిత్ర ఉంది! ఆ నిజాన్ని ఈనాటి వారు నిజం చేయాలి!*



రావులపాటి సీతారాంరావు

ఎనభైవ సంవత్సర స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా దేశమంతటా జరుపుకున్ననేపథ్యంలో కొన్ని నిజాలు, పరిణామాలు విశ్లేషించుకోవాల్సిన అవసరం ఏర్పడింది! 80వ సంవత్సరం నిండిన ఈ స్వతంత్ర భారత దేశం సాంకేతికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, ప్రజాస్వామ్య దేశంగా ఈ గ్లోబల్ వ్యవస్థలో నిలదొక్కుకున్న మాట నిజం! అయితే కొన్ని లోటుపాట్లు, ఒడిదుడుకులూ, చిన్నపాటి యుద్ధాలు పాకిస్థాన్తో ముగియని వైరం చైనాతో చిటపటలు ఇంకా సాగుతునే వున్నాయి! ఇతర దేశాలతో ముఖ్యంగా మన ఇరుగు పొరుగు దేశాలతో పోల్చుకుంటే మన దేశం ఎంతో మెరుగైన స్థాయిలో వున్న నిజాన్ని ఎవరూ కాదనలేరు! యూరప్ దేశాలతో, దక్షిణ పశ్చిమ ఆసియా దేశాలతో పెద్దగా విభేదాలను ఎదుర్కొన్న పరిస్థితులు లేవు! అక్కడో ఇక్కడో పొరపొచ్చాలు కొన్ని తొంగి చూసినా, పాలకుల సర్దుబాటు చర్యలతో సమసిపోయాయి! బంగ్లాదేశ్ ఒకప్పటి అధినేత షేక్ హసీనా, అల జడులతో తన దేశం వదిలి మన దేశంలో వుండటం, అలనాటి దలైలామా పరిస్థితిని జ్ఞప్తికి తెస్తున్నది! భారత్ కున్న విశాలత్వం ఆశ్రయం కోరిన వారిని అక్కున చేర్చుకొనేతత్వం చాలా తక్కువస్థాయిలో ఇతర దేశాలలో వున్నమాట నిజం! ఆర్థికంగా భారత్ కొత్త పుంతలలో పయనించేందుకు సిద్ధంగా వుంది! అయితే ఈమధ్య జరిగిన ఇరాన్ ఇజ్రాయిల్, అమెరికా, రష్యా, ఉక్రెయిన్ సంఘర్షణల వల్ల చమురును నిల్వలుగా వుంచుకోవటం భారమైంది. దిగుమతి చేసుకోటానికి ధరలు కొండెక్కాయి. జలసంధి వివాదంతో ఆయిల్ రవాణా చేసే షిప్పుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది! ఆర్థికంగా క్రమేపీ గడ్డు పరిస్థితి అంచనాలకు అందకుండా వుంది! జనాభా పెరుగుదల వల్ల మన దేశం చైనానుసంఖ్యలో అధిగమించింది. కానీ జనాభా పెరుగుదల కూడా ఆర్థికంగా ఉన్నత దశలో దేశం లేనప్పుడు అదీ సమస్యగానే మారుతుంది! నిరుద్యోగ సమస్య నిన్నా, మొన్నా జరిగిన జెన్‌జి ఉద్యమంతో ప్రాథమిక సమస్యగా మారి విద్యా విధానంలో కూడా మార్పు తేవాలనే ఆలోచనను ముందుకు తెచ్చింది! తెలుగు రాష్ట్రాల్లో ఈమధ్య ఉద్యోగాలకు సంబంధించిన అంశం ప్రాముఖ్యతను సంతరించుకున్న నేపథ్యంలో మంచీ చెడుల ప్రసక్తి తేక తప్పదు! రాజకీయానికే ప్రాముఖ్యతను ఇచ్చే పార్టీల హడావిడి, కొన్ని వేలమంది ఉద్యోగస్థులుగా మారిన తరుణంలో ప్రజలు ఏవిధంగాఅర్థం చేసుకుంటారో చూడాలి! ఇలాంటి వాటివల్ల అన్ని రాష్ట్రాలలోకి నిరుద్యోగ సమస్యను ప్రభుత్వాలు చొరవచూపి పరిష్కరించటంలో వెనుకంజ వేసే ప్రమాదం గూడా వుంది! రాజకీయం కాదు ముఖ్యం అనుకొని ప్రజలు, మేధావులు గూడా చొరవచూపి తప్పును తప్పుగా, ఒప్పును ఒప్పుగా చూపించకపోతే నిరుద్యోగ సమస్య మరింత జటిలమవుతుంది! ఇవన్నీ ఒక ఎత్తు. ప్రజాస్వామ్య పరిధులలో పాల



కులు వ్యవహరించాలన్నది మరొక ఎత్తు! పాలక వర్గంలోనివారు ప్రతిపక్ష వర్గంలోని వారు శత్రువులేం కారు! ఎన్నికలలో పోటీ చేసేంతవరకే ప్రత్యర్థులు! ఎన్నికల తర్వాత సమస్యల్లో న్యాయం జరగకపోతే పోరాడాల్సింది ప్రతిపక్ష నాయకులు! పరిష్కరించాల్సింది పాలకులు! అంత వరకే! అంతేగాని, ఫ్యాక్షనిస్టుల మాదిరి మాటల తూటాలు పేల్చుకుంటూ, ఆగర్భ శత్రువుల్లా వ్యవహరించటం ప్రజాస్వామ్యం ఒప్పుకోదు! ఎవరికి ఎక్కువ సంఖ్యలో ఓట్లుపడితే న్యాయబద్ధంగా వారు పాలన సాగించాలి! అంతేగాని అర్థం పర్థం లేకుండా ఓడిన వారు గెలిచిన వారిని 'దిగిపో' అంటే చట్టం ఒప్పుకోదు! ఆ మాత్రం ఇంగిత జ్ఞానంతో అన్ని పక్షాలూ ప్రజాస్వామ్య పాలనలో వ్యవహరించాలి! ఆ నిజాన్ని అందరూ ఒప్పుకోక తప్పదు! అధికారం ఉంది కదా అని ప్రతిపక్షం సహేతుకంగా వ్యవహరిస్తున్నా వారి గొంతు బయట వినపడనీయకుండా చేసినా, చట్టం చూసీచూడనట్లు ఉండొచ్చు కానీ చట్ట సభలల్లో ఆ ప్రవర్తనను ప్రదర్శిస్తే అది ఎవరు చేసినా తీవ్రంగా పరిగణించక తప్పదు! పోతే చట్ట సభలలో శాంతిగా వ్యవహరించటం భద్రతా పరంగా ప్రవర్తన అదుపులో ఉంచుకోక వారు చట్ట సభలల్లో పాల్గొనటానికి అనర్హులు! ఆ నిజం ఒప్పుకోక తప్పదు! సరియైన చర్యలు అవశ్యం తప్పదు! కేవలం చట్ట సభల ప్రతినిధులే కాదు ఈ నిజాన్ని జ్యుడిషియరీ పాలనా యంత్రాంగంకూడా కాదనలేదు! ఈమధ్య కాలంలో న్యాయ వ్యవస్థలు విమర్శలకు తావిస్తున్నాయని విజ్ఞులు భావిస్తున్నారు. న్యాయం చెప్పాల్సిన వారే న్యాయ పరిధులలో ఉండకపోతే కంచే చేను మేసినట్లు భావించక తప్పదు! ఆ నిజాన్ని సంబంధించిన వారు ఒప్పుకోవాల్సిందే! న్యాయ సమ్మతంగా వుండాలి! న్యాయ పరిధిలో వ్యవహరించాల్సిన బాధ్యత వారిమీదే ఉందని గుర్తించాలి. కేవలం ప్రభుత్వ అంగాలనే ప్రతి విషయంలోనూ తప్పు పట్టటం కూడా సరికాదు! ప్రజలు గూడా ఈ ప్రజాస్వామ్య పాలనలో బాధ్యులే! రాజకీయ నైతికత ఈమధ్య కాలంలో ప్రజలు క్రమ క్రమంగా కోల్పోతున్నారు. చదువులేనివారు గ్రామాల్లో వుండే ప్రజలు ఓట్ల విషయంలో ఎన్నికల విషయంలో ఇంతకు మునుపు ఎంతో నీతిమంతులుగా వుండేవారు! ప్రలోభాలకు లొంగి పోకుండా ఓటును పవిత్రంగా చూడటమే కాదు దానిని సక్రమంగా నచ్చిన రీతిలో వాడుకొని ప్రజాస్వామ్యానికి వన్నె తేవటమే కాదు మెరుగులు దిద్దేవారు! ఇప్పుడు ఆ విజ్ఞత ఎందుకు కోల్పోతున్నారు!? చదువులు పెరిగాయి సాంకేతికత పెరిగింది! అన్ని రకాల అభివృద్ధి పొందుతున్నాం! న్యాయంగా, నీతిగా ఉండాలనే జ్ఞానాన్ని చదువుల ద్వారా పొందిన, పొందుతున్న పౌరులు ప్రజాస్వామ్య పరిధిలో వ్యవహరించాల్సిన వారు, ఎందుకు నైతికతను కోల్పోతున్నారు? వారి ప్రతినిధులను ఎన్నుకోవటంలో ఎందుకు ప్రలోభాలకు లొంగి స్వలాభం చూసుకుంటున్నారు? ఓటర్లకూ బాధ్యత వుంది! ఆ బాధ్యత సక్రమంగా నిర్వహించాల్సిందే! ఆ నిజాన్ని కప్పిపెట్టలేరు! ప్రతి యుగంలోనూ ప్రజలు తమ లక్ష్యం గుర్తించినప్పుడే బాధ్యతతో వ్యవహరిస్తారు! లక్ష్యాన్ని నిర్లక్ష్యం చేస్తే తమను తామే మోసగించుకొని కష్టాల పాలవుతారు!దారి కోల్పోయి నియంతలకు దారి చూపించిన వారవుతారు! మన దేశానికి చివరి నిముషంలో నైనా సరియైన దారిలో పంపిన చరిత్ర ఉంది! ఆ నిజాన్ని ఈనాటి వారు నిజం చేయాలి!. ●

# సామాజిక న్యాయానికి స్ఫూర్తి సర్దార్ సర్వాయి పాపన్న

డా. బండి సాయన్న గౌడ్

నేటి తరానికి రాజ్యాధికార చైతన్యం' ఆగస్టు 18,2026 మంగళవారం హైదరాబాద్ ట్యాంక్‌బండ్పై ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కానుంది. సుమారు 376 సంవత్సరాల క్రితం, 1650 ఆగస్టు 18న తెలంగాణ గడ్డపైఒక మహోన్నత వ్యక్తిత్వం ఆవిర్భవించింది. ఆయనే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. సామాన్య కుటుంబంలోజన్మించి, తన కాలంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను ప్రశ్నిస్తూ, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరుడిగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. పాపన్న కేవలం ఒక యుద్ధ వీరుడు కాదు. కోటలను జయించిన సైనిక నాయకుడిగా మాత్రమే ఆయనను చూడటం ఆయన చారిత్రక ప్రాధాన్యతను పరిమితం చేయడమే అవుతుంది. గోల్కొండ కోటను ఏలిన బహుజన చక్రవర్తిగా వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలను సమీకరించి, అప్పటి ఆధిపత్య వ్యవస్థలను సవాలు చేసిన ప్రజా నాయకుడిగా ఆయన తెలంగాణ ప్రజల జ్ఞాపకాల్లో చిరస్థాయిగా నిలిచారు. ఆయన గాథలో ఆత్మగౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా భాగస్వామ్యం, అధికారంలో భాగస్వామ్యం వంటి విలువలు అంతర్లీనంగా కనిపిస్తాయి. 17వ శతాబ్దంలోనే సామాజికంగా వెనుకబడిన, అణగారిన వర్గాల ప్రజలను ఏకం చేసి తన పోరాటానికి పునాది వేసిన పాపన్న, అధికారం కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమై ఉండాల్సిన అవసరం లేదని తన కార్యాచరణద్వారా చాటిచెప్పిన ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందారు. మనిషికి గౌరవం ఉండాలి. అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడాలి. అణగారిన వర్గాలకు అవకాశాలు కల్పించాలి. అధికారంలో అందరికీ భాగస్వామ్యం ఉండాలన్నారు. అందుకే నేటికీ బహుజన సమాజానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఒక చారిత్రక వీరుడు మాత్రమే కాదు, ఆత్మ గౌరవానికి ప్రతీక, సామాజిక న్యాయానికి స్ఫూర్తి, సమానత్వానికి చిహ్నం. గోల్కొండతో సహా అనేక కోటలపై తన ప్రభావాన్ని స్థాపించిన పాపన్న సైనిక ప్రతిభతో పాటుతన కాలంలోని రాజకీయ వ్యవస్థ లను సవాలు చేసిన నాయకుడిగా చరిత్రలో నిలిచారు. ఆయనతో అను



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్


బంధం ఉన్న ఖిలాషాపూర్ కోటను చారిత్రక వారసత్వ కట్టడంగా అభివృద్ధి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టడం కూడా ఆయన చారిత్రకప్రాధాన్యతకు నిదర్శనం. నేడు దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలో సామాజిక న్యాయం గురించి విస్తృతమైన చర్చ జరుగుతోంది. రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు, ప్రజా సంఘాలు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, ప్రాతినిధ్యం, వెనుకబడిన వర్గాల అభివృద్ధి వంటి అంశాలను ప్రస్తావి స్తున్నాయి. అయితే సామాజిక న్యాయం కేవలం ఎన్నికల నినాదంగా మిగిలిపోకూడదు. సామాజిక న్యాయం అంటే ప్రతికులానికి సమాన గౌరవం, అవకాశాల్లో సమానత్వం, అధికారంలో తగినప్రాతినిధ్యం, వనరులపై న్యాయమైన వాటా, అణగారిన వారికి ఆత్మ గౌరవంతో జీవించే హక్కు. ఈ విలువలు విధానాల్లో, పరిపాలనలో, బడ్జెట్ కేటాయింపుల్లో, విద్యా-ఉద్యోగ అవకాశాల్లో, రాజకీయ ప్రాతినిధ్యంలో ప్రతిబింబించినప్పుడే సామాజిక న్యాయానికి నిజమైన అర్థంవస్తుంది. బహుజన సమాజం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితం నేటి తరానికి ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది. నిబద్ధత ఉంటే సాధించలేనిది లేదు. పట్టుదలఉంటే మార్పు సాధ్యమే. ఐక్యత ఉంటే చరిత్రను మార్చగలం. ఆత్మగౌరవంఉంటే అన్యాయాన్ని ప్రశ్నించగలం. పాపన్నలో ఉన్న నిబద్ధత, పట్టుదల, పోరాటస్ఫూర్తి, ఆత్మగౌరవం, అధికార భాగస్వామ్య ఆకాంక్షలను నేటితరం అర్థంచేసుకోవాలి. ఇది ఎవరినీ వ్యతిరేకిం చడానికి పిలుపు కాదు. ఇది ఎవరిపైనా ద్వేషాన్ని పెంచడా నికి పిలుపు కాదు. ఇది ప్రజాస్వామ్య పద్ధతుల్లో సమాన హక్కులు, సమానావకాశాలు, సమాన ప్రాతినిధ్యం సాధిం చేందుకు చైతన్యమయ్యే పిలుపు. ఈ ప్రశ్నను ప్రతి బహు జన కుటుంబం, ప్రతి యువకుడు, ప్రతి విద్యార్థి, ప్రతి సామాజిక కార్యకర్త, ప్రతి ప్రజా ప్రతినిధి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. నేటి ప్రజాస్వామ్యంలో 'రాజ్యాధికారం' అంటే కేవలం అధికార కుర్చీని పొందడం కాదు. ప్రజల సమస్యలను అర్థం చేసుకోవడం, ప్రజల కోసం విధానాలు రూపొందించడం, పరిపాలనలో భాగస్వామ్యం కావడం, విద్య, ఉద్యోగం, వ్యాపారం, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలను సాధించడం ఇవన్నీ ప్రజాస్వామ్య రాజ్యాధికారంలో భాగమే. అందువల్ల బహుజన సమాజం విద్యలో, ఉద్యోగాల్లో, వ్యాపారంలో, రాజకీయాల్లో, పరిపాలనలో, ఆర్థిక రంగంలో తన భాగస్వామ్యాన్ని పెంచుకోవాలి. రాబోయే తరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నేటి తరం నిర్ణయాత్మకంగా ముందుకుసాగాలి. రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ, ప్రజాస్వామ్య మార్గంలో చైతన్యంతో, సంఘటితంగా తమ హక్కులను సాధించుకోవాలి. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌ను స్మరించుకోవడం అంటే కేవలం జయంతి వేడుకలు నిర్వహించడం కాదు. ఆయన ఆశయాలను అర్థం చేసుకోవాలి. ఆయన ఆత్మగౌరవాన్ని ఆచరణలో పెట్టాలి. ●

# స్మార్ట్ రేషన్ కార్డు సరే! మరి పౌర సరఫరాలు?



శ్రీశైలం దూడం

పేదవాడి చేతిలోకి వస్తున్న కొత్త స్మార్ట్ ఫుడ్ సెక్యూరిటీ కార్డుకేవలం ప్లాస్టిక్ ముక్క కాదు. అదిఆహార హక్కుకు, ఆత్మగౌరవానికి గుర్తు. ఆగస్టు 15 నుంచి కొత్త స్మార్ట్ కార్డుల పంపిణీ ప్రారంభమైంది. క్యూఆర్ కోడ్, వాటర్‌ప్రూఫ్ పీవీసీ, భద్రతా లక్షణాలతో కార్డును ఆధునీకీకరించడం స్వాగతించాల్సిందే. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పినట్టుగా పేదవాడు ఎవరి ముందు చేయి చాచకుండా ఆకలి తీర్చుకునే హక్కుకు ఈ కార్డు ప్రతీక కావాలి. ముఖ్యమంత్రి మరో విషయాన్ని చెప్పారు. గతంలో దొడ్డు బియ్యాన్ని కొందరు లబ్ధిదారులు వినియోగించకుండా ఇతర అవసరాలకు మళ్లించేవారని, ఇప్పుడు 48 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. నాణ్యమైన బియ్యం పేదల ఇంటి అవసరానికి చేరడం నిజంగా మార్పే అయితే స్వాగతించాలి. కానీ ఆ మార్పు ప్రతి అర్హత కుటుంబం గడప వరకు చేరుతోందా? అన్నదే అసలుపరీక్ష. కార్డుపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలు ఉండి ప్రధాని ఫొటో లేకపోవడంపై బీజేపీ ప్రశ్నిస్తోంది. కేంద్రం ఐదుకిలోల ఉచిత ఆహార ధాన్యం అందిస్తోందని, రాష్ట్రం అదనంగా సన్నబియ్యం ఇస్తోందని చెబుతున్నప్పుడు ప్రజలకు కావాల్సింది బొమ్మల గొడవ కాదు. కేంద్రం ఎంత? రాష్ట్రం ఎంత? అన్న స్పష్టమైన లెక్క. భాగస్వామ్యాన్ని ప్రతిబింబించేలా కార్డుపై పునరాలోచిస్తే వివాదానికి తెరపడుతుంది. డీలర్ కమిషన్ విషయంలోనూ ప్రభుత్వం తాజా లెక్కలు బయటపెట్టాలి. 2023లో టన్నుకు రూ.1,400కమిషన్ నిర్ణయించినప్పుడు కేంద్రం రూ.450, రాష్ట్రం రూ.950 భరించే విధానం ఉంది. ఇప్పుడు 2026 ప్రస్తుతం డీలర్‌కు ఎంత? కేంద్రం వాటా ఎంత? రాష్ట్రం వాటా ఎంత? బకాయిలెంత? అన్నది పౌరసరఫరాల శాఖ స్పష్టం చేయాలి. ఇతర రాష్ట్రాల్లో డీలర్లకు చెల్లిస్తున్న కమిషన్‌తో పోల్చి తెలంగాణ పరిస్థితినీ ప్రజల ముందుంచాలి. అసలు కనువిప్పు కలిగించాల్సిన సమస్య రేషన్ దుకాణం దగ్గరే ఉంది. వృద్ధుల వేలిముద్రలు పడక గంటల తరబడి మళ్లీ మళ్లీ ప్రయత్నించాల్సి వస్తోంది. వినియోగదారుడికీ, డీలర్‌కీ ఇబ్బందే. స్మార్ట్ కార్డు ఇచ్చి స్మార్ట్ సమస్యలుసృష్టించడం ఎందుకు? వేలిముద్ర విఫలమైతే ప్రతి రేషన్ దుకాణంలో ఐరిస్ స్కానింగ్ సౌకర్యం తప్పనిసరి చేయాలి. సాంకేతిక వైఫల్యం కారణంగా అర్హుడి రేషన్ ఆగకూడదు. ఇంకో మానవీయ ప్రశ్న ఉంది. ఇంటి నుంచి బయటకు వెళ్లలేని వృద్ధ దంపతులు, మంచానికే పరిమితమైన వికలాంగులు, కుటుంబ సభ్యులు అందుబాటులో లేని ఒంటరి వృద్ధులు రేషన్ దుకాణానికి ఎలా వస్తారు? పింఛన్ గడప వద్దకు అందించే విధానం ఉన్నప్పుడు, అత్యవసర పరిస్థితుల్లో రేషన్‌ను కూడా వారి గడప వద్దకే చేర్చే ప్రత్యేక వ్యవస్థ




ఎందుకు ఉండకూడదు? అధీకృత ప్రతినిధి లేదా ప్రత్యేక మొబైల్ పంపిణీ ద్వారా సరఫరా చేయాలి. కుటుంబ సభ్యులు ఎవరూ అందుబాటులో లేకపోతే ప్రభుత్వం లేదా గ్రామస్థాయి యంత్రాంగం బాధ్యత తీసుకోవాలి. సంక్షేమాన్ని ప్రకటించడం ప్రభుత్వ విజయం కాదు. అది అర్హుడైన చివరి లబ్ధిదారుడి గడప దాటి చేరినప్పుడే ప్రభుత్వపనితీరు కొలవాలి. పౌరసరఫరాల శాఖ దగ్గర మరో లెక్క కూడా స్పష్టంగా ఉండాలి. రాష్ట్రంలో పాత కార్డులు ఎన్ని, కొత్తగా మంజూరైనవి ఎన్ని, తొలగించినవి ఎన్ని, పెండింగ్ దరఖాస్తులు ఎన్ని, కొత్త కార్డుల ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలు ఎన్ని? అనే గణాంకాలను జిల్లాల వారీగా విడుదల చేయాలి. కార్డు ఇచ్చామని ప్రకటించడం ఒకటైతే, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి కార్డు చేరడం మరొటి. సన్న బియ్యం పంపిణీపైనా ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించాలి. 48 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం ఇస్తున్నప్పుడు నెలకు ఎంత ధాన్యం అవసరం? కొనుగోలు, మిల్లింగ్, రవాణా, నిల్వ, పంపిణీతో కలిపి ప్రభుత్వంపై పడే భారం ఎంత? కేంద్రం అందించే ఐదు కిలోల ధాన్యంతో రాష్ట్రం అందించే అదనపు కిలో ఎలా కలుస్తోంది? ఈ లెక్కలు బయటపెడితే పథకం విలువ మరింత స్పష్టమవుతుంది. రేషన్ వ్యవస్థలో మార్పు అంటే కార్డు రూపం మార్చడం మాత్రమే కాదు. అర్హత గుర్తింపు నుంచి ధాన్యం కొనుగోలు వరకు, గోదాము నుంచి డీలర్ దుకాణం వరకు, అక్కడి నుంచి లబ్ధిదారుడి గడప వరకు ప్రతి దశను పౌరసరఫరాల శాఖ పర్యవేక్షించాలి. నెలవారీగా జిల్లాల వారీగా పంపిణీ, మిగులు, తిరస్కరణలు, బయోమెట్రిక్ విఫలతలు, ఫిర్యాదుల పరిష్కారంపై ప్రజలకు డ్యాష్‌బోర్డు తరహాలో వివరాలు అందుబాటులో ఉంచాలి. అప్పుడు బొమ్మలపై జరిగే రాజకీయ వివాదాలకంటే సేవలపై ప్రజల తీర్పే ముఖ్యమవుతుంది. రేషన్ దుకాణంలో వృద్ధులకు ప్రత్యేక క్యూలు, వికలాంగులకు ప్రాధాన్యత, యంత్రం పనిచేయని రోజుల్లో ప్రత్యామ్నాయ ధృవీకరణ వంటి ఏర్పాట్లుకూడా తప్పనిసరి కావాలి. డీలర్‌ను కూడా సమస్యల మధ్య ఒంటరిగా వదిలేయకూడదు. వేలిముద్రలు పడకపోయినా, నెట్‌వర్క్ పనిచేయకపోయినా, యంత్రం మొరాయించినా వినియోగదారుడి ఆగ్రహాన్ని డీలరే ఎదుర్కొంటాడు. అందుకే న్యాయమైన కమిషన్‌తో పాటు పరికరాల నిర్వహణ, ఇంటర్నెట్, విద్యుత్‌వంటి సాంకేతిక సమస్యలకు ప్రభుత్వం ప్రత్యేక బాధ్యత తీసుకోవాలి. ప్రజల హక్కు పొందడానికి మధ్యవర్తి అవసరం లేని వ్యవస్థను నిర్మించాలి. ఫిర్యాదు చేస్తే సమయపరిమితిలో పరిష్కారం చూపాలి. తప్పిదం జరిగితే బాధ్యులపై చర్య ఉండాలి. పేదవాడి చేతిలోని కార్డు ఆకలి ముందు పనిచేస్తుందా? అన్నదే ప్రభుత్వానికి అసలు పరీక్ష. కేంద్రం తన వాటా చెప్పాలి. రాష్ట్రం తనవాటా చెప్పాలి. డీలర్ కమిషన్ చెప్పాలి. సన్నబియ్యం వ్యయం చెప్పాలి. కార్డు తయారీ ఖర్చు చెప్పాలి. అప్పుడు ప్రజలే ఎవరి పాత్ర ఎంతన్నది నిర్ణయిస్తారు. వేలిముద్ర విఫలమైతే ఐరిస్ రావాలి. గడప దాటలేని వృద్ధుడి గడపకే రేషన్ చేరాలి. అప్పుడే స్మార్ట్ కార్డు నిజమైన ఆత్మగౌరవ పత్రం అవుతుంది. లేకపోతే కార్డు కొత్తదే.. పేదవాడి కష్టం మాత్రం పాతదే!. ●

# ప్రజాప్రతినిధులపై 4,192 కేసులు

**326 మంది ఎంపిలు, 14 మంది సిఎంలపై క్రిమినల్ కేసులు**

**తెలంగాణ సిఎం రేవంత్‌పై 89, బెంగాల్ సిఎంపై 29, కర్ణాటక సిఎంపై 19**

**సుప్రీంకోర్టుకు అమికస్ క్యూరీ నివేదికలో వెల్లడి**

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** రాజకీయాల్లో నేరపూరిత ధోరణులపై సుప్రీంకోర్టుకు సమర్పించిన ఒక నివేదిక ప్రకారం, లోక్‌సభలోని 543 మంది సభ్యులలో 251 మందిపై, రాజ్యసభలోని 233 మంది సభ్యులలో 75 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఎంపిలు, ఎమ్మెల్యేలపై ఉన్న క్రిమినల్ కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో 'అమికస్ క్యూరీ'గా నియమితులైన సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా సుప్రీంకోర్టులో సమర్పించిన అఫిడవిట్‌లో ఈ వివరాలు వెల్లడించారు. పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులపై మొత్తం 4,000కు పైగా క్రిమినల్ కేసులు ఉన్నాయని అందులో పేర్కొన్నారు. దేశంలోని 28 రాష్ట్రాలకు గాను 14 రాష్ట్రాల ముఖ్యమంత్రులు తమపై తీవ్రమైన నేరాలతో సహా క్రిమినల్ కేసులు ఉన్నట్టు ప్రకటించారని ఆ అఫిడవిట్ తెలిపింది.

ఆ గణాంకాల ప్రకారం, తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డిపై 89 కేసులు ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి (29 కేసులు), కర్నాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ (19 కేసులు) ఉన్నారు. కేసుల విచారణ వేగంగా జరిగేలా సుప్రీంకోర్టు, హైకోర్టులు పర్యవేక్షిస్తున్నప్పటికీ, 2018 నుండి ఎంపిలు, ఎమ్మెల్యేలపై పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల సంఖ్య దాదాపు ఒకే స్థాయిలో కొనసాగుతోందని హన్సారియా కోర్టుకు నివేదించారు. వివిధ హైకోర్టుల నుండి సమాచారాన్ని సేకరించిన అమికస్, 2025లో 1,243 క్రిమినల్ కేసుల పరిష్కారం జరిగిందని, అదే సమయంలో 1,050 కొత్త కేసులు నమోదయ్యాయని సుప్రీంకోర్టుకు తెలిపారు.

మాజీ, ప్రస్తుత ఎంపిలు/ఎమ్మెల్యేలపై మొత్తం 4,192 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన కోర్టుకు వివరించారు. "అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) నివేదికను ప్రస్తావిస్తూ సమర్పించిన అఫిడవిట్ ప్రకారం, లోక్‌సభలోని 543 మంది సభ్యులలో 251 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. వీరిలో 170 మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులు (ఐదేళ్ల లేదా అంతకంటే ఎక్కువ జైలు శిక్ష పడే అవకాశం ఉన్నవి) నమోదయ్యాయి.

అలాగే, రాజ్యసభలోని 233 మంది సభ్యులలో 75 మంది (33 శాతం) పై క్రిమినల్ కేసులు ఉన్నాయి. వీరిలో 40 మంది (18 శాతం)పై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయి. అలహాబాద్ హైకోర్టు నుండి నివేదిక అందకపోవడంతో ఉత్తరప్రదేశ్ మినహా, వివిధ హైకోర్టులు సమర్పించిన నివేదికల విశ్లేషణను కూడా ఆ సీనియర్ న్యాయవాది దాఖలు చేశారు. న్యాయవాది స్నేహ కలిత ద్వారా దాఖలు చేసిన అఫిడవిట్ ప్రకారం, కేరళకు చెందిన 20 మంది ఎంపిలలో 19 మంది (95 శాతం) క్రిమినల్ ఆరోపణలను ఎదుర్కొంటున్నారు, వీరిలో 11 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయి.

తెలంగాణకు చెందిన 17 మంది ఎంపీలలో 14 మంది (82 శాతం) పై క్రిమినల్ ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఒడిశాలో 76 శాతం (21 మందిలో 16 మంది), జార్ఖండ్‌లో 71 శాతం (14 మందిలో 10 మంది), తమిళనాడులో 67 శాతం (39 మందిలో 26 మంది) ఎంపిలపై కేసులు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, బీహార్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ వంటి ఇతర ప్రధాన రాష్ట్రాల్లో దాదాపు 50శాతం మంది ఎంపిలపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. హర్యానా (10 మంది ఎంపిలు), ఛత్తీస్‌గఢ్ (11 మంది ఎంపిలు) రాష్ట్రాల్లో ఒక్కొక్క ఎంపిపై మాత్రమే క్రిమినల్ ఆరోపణలు ఉన్నాయి. పంజాబ్‌లో 13 మందిలో ఇద్దరు, అసోంలో 14 మందిలో ముగ్గురు, ఢిల్లీలో ఏడుగురిలో ముగ్గురు, రాజస్థాన్‌లో 25 మందిలో నలుగురు, గుజరాత్‌లో 25 మందిలో ఐదుగురు, మధ్యప్రదేశ్‌లో 29 మందిలో తొమ్మిది మంది ఎంపిలపై క్రిమినల్ ఆరోపణలు ఉన్నాయి.

ఎంపిలు/ఎమ్మెల్యేలపై ఉన్న క్రిమినల్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు అత్యున్నత న్యాయస్థానం పర్యవేక్షణ అవసరమని 'అమికస్ క్యూరీ' పేర్కొన్నారు. ఎంపిలు/ఎమ్మెల్యేల కేసుల విచారణను ప్రత్యేక కోర్టులు మాత్రమే చేపట్టాలని, ఆ కేసుల విచారణ పూర్తయిన తర్వాతే ఇతర కేసులను చేపట్టాలని ఆయన కోరారు. అన్ని జిల్లాల ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జీలు, ప్రత్యేక కోర్టులకు సాధారణ కోర్టు విధులను కేవలం విచారణ.

సుమోటో రిట్ పిటిషన్లలో, హైకోర్టులు న్యాయపరంగా నెలవారీగా విచారణ పురోగతిని పర్యవేక్షించాలి. అలాగే, అభియోగాలు నమోదు చేసిన తేదీ నుండి ఏడాదిలోపే పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులను వేగంగా ముగించేలా చూడాలి అని అమికస్ న్యాయవాది తెలిపారు. మూడేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న కేసులను హైకోర్టులు సూమోటాగా పర్యవేక్షించి, ప్రతి కేసులోనూ సమర్థవంతమైన ఉత్తర్వులు జారీ చేయాలని కూడా ఆ సీనియర్ న్యాయవాది అభ్యర్థించారు.



ఉక్రయిన్‌పై రష్యా క్షిపణి దాడి

# లక్ష్మీమిట్టల్ స్టీల్ ప్లాంట్ ధ్వంసం

## ఇద్దరి మృతి, పలువురికి తీవ్రగాయాలు

**కీవ్, ఆగస్టు 17:** భారత సంతతి బిలియనీర్ లక్ష్మీ మిట్టల్‌కు చెందిన స్టీల్ ఫ్యాక్టరీపై క్షిపణి దాడి జరిగింది. ఉక్రెయిన్‌లోని క్రివి రిహ్‌నగరంలో ఆర్సెలార్ మిట్టల్ మైనింగ్ అండ్ మెటలర్జికల్ కాంప్లెక్స్‌పైకి రష్యా నుంచి క్షిపణి దూసుకొచ్చింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, 14 మంది కార్మికులు గాయపడ్డారు. ఈ దాడి కారణంగా కోర్ ఎనర్జీ, బ్లాస్ట్ ఫర్నేస్ కార్యకలాపాలు దెబ్బతినడంతో ఉత్పత్తి పాక్షికంగా నిలిచిపోయింది. రష్యా-ఉక్రెయాన్ యుద్ధం ప్రారంభమై నాలుగేళ్లు దాటింది. మధ్య మధ్యలో దాడులు కాస్త తగ్గినా ఇటీవల తీవ్రరూపం దాల్చాయి. రష్యాలోని సైనిక పరిశ్రమలు, ఇంధన సదుపాయాలను కీవ్ లక్ష్యంగా చేసుకుంటోంది. దీంతో పుతిన్ ప్రభుత్వం ఇంధన కొరతతో సతమతమవుతోంది. ఇదిలా ఉండగా ఆదివారం రష్యా వ్యాప్తంగా వందల డ్రోన్లతో ఉక్రెయిన్ విరుచుకుపడింది. ఈ దాడుల్లో ఆరుగురు మృతి చెందారు. యుద్ధం ప్రారంభం నుంచి ఉక్రెయిన్ నిర్వహించిన అతిపెద్ద గగనతల దాడుల్లో ఇదీ ఒకటి. రాత్రికి రాత్రే దాదాపు 822 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చేశామని మాస్కో అధికారులు వెల్లడించారు. రష్యా సంపన్న మహిళ తత్యానా కిమ్‌కు చెందిన వైల్డ్ బెర్రీస్ సంస్థపై ఈ దాడుల ప్రభావం తీవ్రంగా ఉంది. ఇదొక ఆన్‌లైన్ రిటైలర్ సంస్థ. ఉక్రెయిన్ వరుసదాడులలో ఈ కంపెనీ వేర్‌హౌస్‌లు మంటల్లో చిక్కుకున్నాయి. దీనికి ప్రతిగా ఉక్రెయిన్‌పై రష్యా విరుచుకుపడింది. ఈ క్రమంలో జరిగిన క్షిపణి దాడిలో లక్ష్మీ మిట్టల్ ఫ్యాక్టరీ మంటల్లో చిక్కుకుంది. ఈ దాడిని కంపెనీ ధ్రువీకరించింది. లక్ష్మీ మిట్టల్ సంస్థ ఉక్రెయిన్‌లోనే అతిపెద్ద స్టీల్ ఉత్పత్తిదారుగా ఉంది. మరోవైపు, రష్యా దాడుల ప్రభావం రాజధాని కీవ్‌లో కూడా కనిపించింది. నగరంలోని అతిపెద్ద బుక్ మార్కెట్‌లో మంటలు చెలరేగాయి. పుతిన్ సేనల దాడులపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆగ్రహం వ్యక్తంచేశారు. పౌర సదుపాయాలపై రష్యా దాడులు చేస్తోందని ఆరోపించారు.

# ఒమన్ జోక్యం చేసుకుంటే బాంబులతో ధ్వంసం చేస్తాం

## యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్,ఆగస్టు 17:** ఇరాన్ నౌకలపై అమెరికా విధించిన దిగ్బంధనానికి ఒమన్ అడ్డుపడితే ఆ దేశంపై బాంబులతో దాడి చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్‌పై ఒత్తిడి పెంచేందుకే హర్ముజ్ జలసంధిలో నౌకలపై దిగ్బంధనం విధించినట్లు ఆయన తెలిపారు. ఒమన్ మా చర్యలకు అడ్డుగా వస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇరాన్‌పై విధించిన దిగ్బంధనం ఆ దేశంపై ఒత్తిడి పెంచుతోందని చెప్పారు. అయితే ఇరాన్‌తో వివాదానికి ముగింపు పలికేందుకు తన వద్ద ఎలాంటి కాలపరిమితి లేదని, తాను తొందరపడటం లేదని స్పష్టం చేశారు. ఇరాన్ లొంగిపోతున్నట్లు తెల్ల జెండా ఎగురవేయాలి అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ (ఐఆర్‌జీసీ) అధికారులతో అమెరికా చర్చలు జరుపుతున్న విషయాన్ని కూడా ఆయన ధ్రువీకరించారు. వారు మంచి పోకర్ ఆటగాళ్లు కానీ వారు చనిపోతున్నారని ట్రంప్ వ్యాఖ్యానించారు. నాకు ఎలాంటి కాలపరిమితి లేదు. నేను తొందరపడటం లేదు. అమెరికా మధ్యంతర ఎన్నికలకు నా ఆలోచనలకు ఎలాంటి సంబంధం లేదని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్‌కు అణ్వాయుధం ఉండకూడదు ఇరాన్ అణ్వాయుధాన్ని సమకూర్చుకోవడాన్ని తాను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోనని ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఇరాన్‌కు ఏ విధంగానూ, ఏ రూపంలోనూ అణ్వాయుధం ఉండకూడదు. ఇదే మొదటి లక్ష్యం ఎప్పటికీ ఇదే మొదటి లక్ష్యంగా ఉంటుందని తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, హర్ముజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలకు సంబంధించిన మార్గ పటంపై ఒమన్‌తో అవగాహనకు వచ్చినట్లు ఇరాన్ ప్రకటించింది. దీనికి సంబంధించిన వివరాలను ఖరారు చేసి, సంయుక్త ప్రకటన విడుదల చేసేందుకు ఇరు దేశాలు కసరత్తు చేస్తున్నాయి. నౌకల రవాణా



మార్గానికి సంబంధించిన మ్యాప్‌పై అవగాహన కుదిరింది. మ్యాప్‌తో పాటు సంయుక్త ప్రకటనను కలిపి ఒక ప్యాకేజీగా ఖరారు చేయాలని మేము ముందుగానే నిర్ణయించుకున్నాం. ఆ ప్రక్రియ కొనసాగుతోందని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి తెలిపారు. హర్ముజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలను ఎలా నిర్వహించాలన్న అంశంపై ఇరాన్, ఒమన్ దేశాలు చర్చలు జరుపుతున్నాయి. ఈ ఒప్పందం అమల్లోకి వస్తే నౌకలు ఇరాన్‌కు సమీపంలోని మార్గం ద్వారా హోర్ముజ్‌లోకి ప్రవేశించి, ఒమన్‌కు సమీపంలోని మార్గం ద్వారా బయటకు వెళ్లే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## బిజెపి సోషల్ మీడియా విభాగం కన్వీనర్‌గా దీపక్ మాస్కే



**న్యూఢిల్లీ,ఆగస్టు 17:** రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీజేపీ తన జాతీయ బృందంలో కీలక మార్పులు చేసింది. ఇందులో భాగంగా దీపక్ మాస్కేను పార్టీ సోషల్ మీడియా విభాగం కన్వీనర్‌గా నియమించింది. ఆయనకు సహాయకులుగా ప్రీతి గాంధీ, శివానంద ద్వివేది, అలోక్ భట్, అరుణ్ యాదవ్‌లను సోషల్ మీడియా కోకన్వీనర్లుగా నియమించింది. బీజేపీ ఐటీ విభాగం ఇన్‌చార్జ్‌గా చాలాకాలంగా పనిచేసిన అమిత్ మాలవీయ కొత్త బృందాన్ని అభినందించారు. సోషల్ మీడియా విభాగం అధిపతిగా తన స్థానంలో దీపక్ మాస్కే బాధ్యతలు స్వీకరించనున్నారని ఆయన తెలిపారు. దీపక్ మాస్కే జీతో పాటు కోకన్వీనర్లుగా నియమితులైన ప్రీతి గాంధీ, శివానంద ద్వివేది, అలోక్ భట్, అరుణ్ యాదవ్‌లకు ప్రత్యేకంగా అభినందనలు. గత దశాబ్ద కాలంగా వీరందరితో కలిసి పనిచేసే అవకాశం నాకు లభించింది. వారి నాయకత్వంలో బీజేపీ డిజిటల్ కమ్యూనికేషన్ మరిన్ని మైలురాళ్లను చేరుకుంటుందని, ప్రజా చర్చను మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దుతుందని నమ్ముతున్నాను" అని మాలవీయ పేర్కొన్నారు.

# జార్ఖండ్‌లో నిరసనకారులతో చర్చించండి

## సీఎం హేమంత్ సోరెన్‌కు రాహుల్‌గాంధీ లేఖ



**రాంచి, ఆగస్టు 17:** జార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ విద్యార్థులు చేపట్టిన ఆందోళనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పందించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను కలిసి వారి సమస్యలను వినాలని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను కోరారు. ఈ మేరకు ఆగస్టు 14న సోరెన్‌కు రాహుల్ గాంధీ లేఖ రాశారు.

# రాహుల్‌గాంధీకి సుప్రీంలో ఊరట

## ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో హైకోర్టు తీర్పుపై సుప్రీంస్టే



**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** రాహుల్ గాంధీకి ఇది ఒక పెద్ద ఊరట. ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న ఆరోపణలపై అలహాబాద్ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. హైకోర్టు ఉత్తర్వును సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ పూర్తయ్యే వరకు, కాంగ్రెస్ నాయకుడిపై ఉన్న ఆదాయానికి మించిన ఆస్తుల కేసును ముందుకు తీసుకెళ్లవద్దని అలహాబాద్ హైకోర్టును సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడికి సంబంధించిన ఈ కేసులో, తన ఆదేశాల మేరకు హైకోర్టుకు ఎలాంటి నివేదిక దాఖలు చేయవద్దని సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లను కూడా సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జయమాల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం, గాంధీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలను పరిగణనలోకి తీసుకుని, హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన కర్ణాటక నివాసి ఎస్. విఘ్నేష్ శిశిర్‌తో పాటు సిబిఐ, ఇడిలకు నోటీసులు జారీ చేసింది. సుప్రీంకోర్టులో తదుపరి విచారణ జరిగే తేదీ వరకు ఈ కేసు తదుపరి విచారణను వాయిదా వేయాలని ధర్మాసనం అలహాబాద్ హైకోర్టును ఆదేశించింది. ఈ కేసులోని ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని, ఇది ఆదాయానికి మించిన ఆస్తుల కిందకు వస్తుందని కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తీవ్రంగా స్పందించిన ధర్మాసనం, 'ఆరోపణలు అంత తీవ్రమైనవే అయితే, దర్యాప్తు సంస్థలు ఇన్నాళ్లు ఎందుకు ఊరుకున్నాయి? దర్యాప్తు లేదా విచారణ ప్రారంభించడానికి కోర్టుల నుంచి ఒత్తిడి లేదా ఆదేశాలు వచ్చే వరకు ఎందుకు వేచిచూశాయి? చట్టప్రకారం మీకున్న స్వయంప్రతిపత్తి అధికారాలతో సొంతంగా ఎందుకు చర్యలు తీసుకోలేదంటూ సిబిఐ, ఇడి, కేంద్రంపై సుప్రీంకోర్టు ప్రశ్నించింది. తదుపరి విచారణ వాయిదా వేసింది.

# తమిళనాడుకు కావేరి జలాలు విడుదల చేయాల్సిందే: సుప్రీం


**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** కావేరి నదీ జలాలను తమిళనాడుకు విడుదల చేసే అంశంలో కావేరి నీటి నిర్వహణ ప్రాధికార సంస్థ (సిడబ్ల్యుఎంఎ) జారీ చేసిన ఆదేశాలను కచ్చితంగా పాటించాలని కర్ణాటక ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. తమకు కేటాయించిన నీటిని కర్ణాటక విడుదల చేయడం లేదని పేర్కొంటూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా తాము ఇప్పటికే నీటిని విడుదలు చేస్తున్నామని, సోమవారం ఉదయం నాటికి 12 వేల క్యూసెక్కులకుపైగా నీటిని విడుదలు చేస్తున్నట్లు కర్ణాటక ప్రభుత్వం ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చింది. ఇరుపక్షాల వాదనల అనంతరం సిడబ్ల్యుఎంఎఆదేశాలనుఖచ్చితంగా అనుసరించాలని కర్ణాటకను ఆదేశించింది. అలాగే నీటి సరఫరాకు సంబంధించిన పరిస్థితులను తాము నిశితంగా పర్యవేక్షిస్తామని, నీటి విడుదలకు సంబంధించిన తాజా నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 24కి వాయిదా వేసింది.

# అయోధ్య విరాళాల దుర్వినియోగం కేసు సిట్ నివేదిక బహిర్గతం చేసేందుకు సుప్రీం నిరాకరణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** అయోధ్యరామమందిర విరాళాల దుర్వినియోగం, చోరీ ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి తన మునుపటి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన 'సిట్' (ప్రత్యేక దర్యాప్తు బృందం) నివేదికను బహిర్గతం చేయాలని ఆదేశించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. "ప్రస్తుతానికి నివేదికను బహిర్గతం చేయాలని ఆదేశించలేము.. దీనిపై తర్వాత పరిశీలిస్తాము.. ప్రస్తుతం మా దృష్టి కేవలం సిట్ దర్యాప్తుపైనే ఉంది.. అది తార్కిక ముగింపునకు చేరాల్సి" అని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. "సిట్‌ని తామే ఏర్పాటు చేశాము. అది మాకు జవాబుదారీగా ఉంటుంది. అది మాకు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఫోరెన్సిక్ ఆడిటర్‌ను కూడా కలిగి ఉన్న ఈ సిట్, తన స్థితిగతుల నివేదికను (స్టేటస్ రిపోర్ట్) సీల్డ్ కవర్‌లో సుప్రీంకోర్టుకు సమర్పిస్తుంది. అయితే, ఆ నివేదికను ముందుగా తాము పరిశీలిస్తాము. దానిని అన్ని పక్షాలకు విడుదల చేయాలా వద్దా అని నిర్ణయిస్తాము" అని ధర్మాసనం పేర్కొంది. సిట్ నివేదికను 3 వారాల్లోగా సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది.

## సంక్షిప్త వార్తలు

### ఇరాన్‌పై అణుదాడికి అమెరికా సిద్ధం!



**వాషింగ్టన్, ఆగస్టు 17:** అమెరికా కాంగ్రెస్ మాజీ సభ్యురాలు, రిపబ్లికన్ పార్టీ నాయకురాలు మర్జోరీ టేలర్ గ్రీన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అణ్వాయుధాలను నియంత్రించడమే తమ లక్ష్యమని అగ్ర రాజ్య అధ్యక్షుడు ట్రంప్ బయటకు చెప్తున్నప్పటికీ ఇరాన్‌పై అణుదాడులు ప్రారంభించడానికి రహస్యంగా సన్నద్ధమవుతున్నారని పేర్కొన్నారు. త్వరలో ఈ అణుదాడులు చేయడానికి ట్రంప్ యంత్రాంగం ప్రణాళికలు రచిస్తోందన్నారు. ఇందుకోసం ప్రభుత్వ ఉన్నతస్థాయి అధికారులు వ్యూహాత్మక సమావేశాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ అణుదాడుల వల్ల ప్రపంచం మొత్తం సంఘర్షణలోకి, ఆర్థిక మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

### 1.6 లక్షల మంది ఫాలోయ్యర్లు.. ఆ వెంటనే అదృశ్యం



**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** దిమాగీ నక్సల్ పార్టీ పేరుతో ఉన్న ఓ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ఒక్కసారిగా తెరపైకి వచ్చి, కేవలం ఒక్కరోజులోనే 1.6లక్షలకు పైగా ఫాలోవర్లను సంపాదించింది. అయితే ఎంతవేగంగా వెలుగులోకి వచ్చిందో అంతే వేగంగా అదృశ్యమైంది. ఈ ఖాతాలో మొత్తం 62 పోస్టులు ఉండగా, సుమారు 35 మందిని ఫాలో అవుతున్నట్లు ఇన్‌స్టాగ్రామ్‌లో సమాచారం కనిపించింది. ఖాతా ఈ నెలలోనే ప్రారంభమైనట్లు వివరాలు వెల్లడించాయి. ఖాతా యూజర్‌నేమ్‌ను ఒకసారి మార్చినట్లు కూడా లాగ్‌లో నమోదైంది. అయితే ఈ ఖాతాను ఎవరు నిర్వహించారనే వివరాలు మాత్రం వెల్లడికాలేదు.

### ఉజ్జయిని దేవాలయంలో తొక్కిసలాట: పలువురికి గాయాలు

**ఉజ్జయిని, ఆగస్టు 17:** మధ్యప్రదేశ్‌లోని ఉజ్జెయినిలో ఉన్న దేవాలయంలో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. దైవ దర్శనానికి భక్తులు పోటెత్తడంతో ఈ ఘటన జరిగింది. పోలీసులు స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మధ్యప్రదేశ్, ఉజ్జైన్‌లో ప్రసిద్ధ మహాకాళేశ్వర ఆలయ ప్రాంగణంలోనే శ్రీహరసిద్ధి మాతా శక్తిపీఠ్ టెంపుల్, శ్రీబడా గణేష్ మందిర్ పరిధిలో సోమవారం ఉదయం ఈ ఘటన జరిగింది. ఇక్కడే నాగచంద్రేశ్వర ఆలయం కూడా ఉంది. శ్రావణ సోమవారం కావడంతో నాగచంద్రేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. అక్కడ ఏదో విద్యుత్ షాక్ తగిలింది అనే ప్రచారం జరగడంతో ఒకరినొకరు తోసుకున్నారు. దీంతో ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది.

### బీర్‌భుమ్ హోటల్‌లో అగ్నిప్రమాదం: ఐదుగురు సజీవదహనం



**కోల్‌కత్తా, ఆగస్టు 17:** పశ్చిమ బెంగాల్‌లో ఒక హోటల్‌లో జరిగిన ఈ ప్రమాదంలో ఐదుగురు సజీవ దహనమయ్యారు. మరికొందరు గాయపడ్డారు. ఈ ఘటన బీర్భూమ్ జిల్లా, తారాపీట్ లోని ఒక హోటల్‌లో సోమవారం వేకువజామున జరిగింది. కస్టమర్లు, సిబ్బంది గాఢనిద్రలో ఉండగా, ఉదయం 4.00 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. తారాపీట్ ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక కేంద్రం. ఇక్కడి దేవాలయానికి భక్తులు భారీగా వస్తుంటారు. ఈ రోజు చివరి శ్రావణ సోమవారం కావడంతో భక్తులు భారీగా వచ్చారు.

### ఎల్పీజీ ఇకేవైసి గడువు 23వరకూ పొడిగింపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** ఎల్పీజీ కనెక్షన్ వినియోగదారులకు ప్రభుత్వం ఊరటనిచ్చే వార్త అందించింది. ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయడానికి నిర్దేశించిన గడువును ఈనెల 16 నుంచి ఆగస్టు 23 వరకు పొడిగించారు. సర్వర్ సమస్యల వల్ల లేదా సమయం లేక ఇప్పటివరకు ధృవీకరణ పూర్తి చేసుకోని వారికి ఇది నిజంగా శుభవార్త. అయితే ఈ గడువు పెంపు కొంత వెసులుబాటును ఇచ్చినప్పటికీ, క్షేత్రస్థాయి సాంకేతిక అవస్థల వల్ల పౌరుల ఇబ్బందులు పూర్తిస్థాయిలో తొలిగిపోలేదు. గడువు పొడిగించినప్పటికీ సర్వర్ సమస్యలు వినియోగదారులను తీవ్రంగా వేధిస్తున్నాయి.

### ప్రశ్నపత్రాల లీకేజిలపై 50 మందికిపైగా సిబ్బంది తొలగింపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** ప్రశ్నాపత్రాల లీకేజీ, పరీక్షల్లో అవకతవకల పై కొద్ది రోజులుగా పెద్ద ఎత్తున విమర్శలు వస్తుండడంతో జాతీయ పరీక్షల ఏజెన్సీ ఎన్టీయే కీలక చర్యలు చేపట్టింది. పరీక్షా విధానాన్ని సమూలంగా ప్రక్షాళన చేసే చర్యల్లో భాగంగా 50 మందికిపైగా సిబ్బందిని తొలగించింది. సంస్థలోని కీలక స్థానాల్లో నిపుణులను నియమిస్తున్నది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ ప్రకటన వెలువరించింది.

# డైరెక్టర్ సుధా కొంగరకు ఊరట

**చెన్నై, ఆగస్టు 17:** ప్రముఖ సినీ దర్శకురాలు సుధా కొంగరకు మద్రాస్ హైకోర్టులో భారీ ఊరట లభించింది. బాకీ ఉన్న రూ.8.39 కోట్లు నాలుగు వారాల వ్యవధిలో సుధా కొంగరకు ఇవ్వాలని 'డాన్ పిక్చర్స్' సంస్థను ఆదేశించింది. నిర్ణీత గడువులోగా చెల్లించకపోతే, ఆ నిర్మాణ సంస్థ భవిష్యత్తులో నిర్మించే చిత్రాల ద్వారా వచ్చే లాభాల నుంచి ముందుగా సుధా కొంగర బాకీని తీర్చాల్సి ఉంటుందని పేర్కొంది. మద్రాస్ హైకోర్టు తీర్పుతో సుధా కొంగర ఊపిరి పీల్చుకున్నారు. శివకార్తికేయన్, శ్రీలీల జంటగా ఆమె దర్శకత్వంలో తెరకెక్కిన 'పరాశక్తి' చిత్రం పొంగల్ కానుకగా విడుదలై బాక్సాఫీస్ వద్ద పరాజయం పాలైన సంగతి తెలిసిందే. సినిమా పరాజయం కావడంతో, నిర్మాణ సంస్థ 'డాన్ పిక్చర్స్' సుధా కొంగరకు ఇవ్వాల్సిన రూ.8.39కోట్ల పారితోషికాన్ని ఎగ్గొట్టడంతో ఆమె న్యాయం కోసం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

# దిమాగి నక్సల్స్ అంటే వీళ్లే..

## ప్రధాని వ్యాఖ్యలకు కేంద్ర మంత్రి రిజిజు వివరణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** ప్రధాని నరేంద్ర మోడీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో చేసిన దిమాగీ నక్సల్స్ వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. అసలు దిమాగీ నక్సల్ అంటే ఎవరనే ప్రశ్నలు ప్రతిపక్షాల నుంచి వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. ఆ పదంతో ఎవరిని ఉద్దేశిస్తున్నారో మూడు అంశాల ద్వారా వివరించారు. మావోయిస్టులకు మద్దతు ఇస్తూ రాజ్యాంగాన్ని తిరస్కరించేవారిని 'దిమాగీ నక్సల్స్'గా పరిగణించవచ్చని రిజిజు చెప్పారు. ఇక, వేర్పాటువాదులకు మద్దతు ఇచ్చేవారు,




ఆర్టికల్ 370కి అనుకూలంగా నిలిచేవారు రెండో వర్గంలోకి వస్తారని పేర్కొన్నారు. దేశ సమైక్యతకు ముప్పు కలిగించే ఆలోచనలను ఆయన ఈ అంశాలతో ముడిపెట్టారు. ఈశాన్య రాష్ట్రాలను దేశంలోని మిగతా ప్రాంతాల నుంచి వేరు చేయాలని కోరుకునేవారు మూడో వర్గమని రిజిజు అన్నారు. సిలిగురి కారిడార్‌ను చికెన్ నెక్‌గా పిలుస్తారు. పశ్చిమ బెంగాల్‌లోని ఈ ఇరుకైన మార్గమే ఈశాన్య ప్రాంతాలకు దేశంలోని మిగతా ప్రాంతాలతో ప్రధాన అనుసంధానం. దీన్ని విడదీయాలని కోరుకునే వారి గురించి రిజిజు ప్రస్తావించారు. ఆగస్టు 15న ఎర్రకోట నుంచి ప్రసంగించిన మోడీ అడవుల్లో సాయుధ నక్సలిజాన్ని అణచివేశామని చెప్పారు. అయితే మావోయిస్టు భావజాలం మరో రూపంలో కొనసాగుతోందని హెచ్చరించారు. అధికార వ్యవస్థలోకి చొరబడిన అలాంటి భావజాలాన్ని గుర్తించి ఒంటరి చేయాలని పిలుపునిచ్చారు. మోడీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత పి. చిదంబరం స్పందిస్తూ తాను దిమాగీ నక్సల్‌గా గర్విస్తున్నానని అన్నారు.

## షెహజాద్‌భట్టి ఉగ్రనెట్‌వర్క్ భగ్నం: అమిత్‌షా

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు ఐఎస్ఐ మద్దతుతో పనిచేస్తున్న షెహజాద్ భట్టి నెట్‌వర్క్‌పై భద్రతా బలగాలు భారీ దాడులు నిర్వహించాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం తెలిపారు. దేశవ్యాప్తంగా 14రాష్ట్రాల్లో సమన్వయంతో చేపట్టిన ఆపరేషన్లలో 200 మందికి పైగా నెట్‌వర్క్ కార్య కర్తలను అరెస్టుచేసి, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విధ్వంసక చర్యలకు ఉగ్రవాద సంస్థ చేసిన కుట్రలను భగ్నంచేసినట్లు ఆయన వెల్లడించారు.

# ఎగ్జామ్ స్కాంలను సరిదిద్దండి..లేదంటే నిరసనకు దిగుతా

## మోడీ ప్రభుత్వానికి బాబా రాందేవ్ హెచ్చరిక



**హరిద్వార్, ఆగస్టు 17:** భారతీయ జనతా పార్టీకి వీర విధేయుడుగాభావించే యోగా గురు బాబా రామ్‌దేవ్ తాజా వ్యాఖ్యలు నెట్టింటసంచలనంగా మారాయి. విద్య, నియామక పరీక్షల అవకతవకలకు వ్యతిరేకంగా విద్యార్థులు చేస్తున్న ఆందోళనలకు రామ్‌దేవ్ మద్దతుగా నిలవడమేకాదు, ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర సర్కార్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేయడం విశేషం. కేంద్రం త్వరగా ఈ 'ఘప్లా'(స్కామ్‌లను) ను సరిదిద్దకపోతే, ఈ ఆందోళన మరింత తీవ్ర రూపం దాల్చవచ్చని, ప్రభుత్వం ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని హితవు పలికారు. లేకపోతే తాను కూడా నిరసన చేపట్టాల్సి రావచ్చునని వ్యాఖ్యానించారు. 80వస్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హరిద్వార్‌లోని పతంజలి యోగపీఠ్ వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి కీలక హెచ్చరికలు చేశారు. పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, నీరు, విద్యుత్ వంటి ప్రాథమిక సౌకర్యాల కొరతపై విద్యార్థులు నిరసన గురించి ప్రస్తావించారు. ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక ప్రక్రియపై అవినీతి, ధనబలం ప్రభావం చూపుతున్నాయని కూడా ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగ ఇంటర్వ్యూలలో అవినీతి 99 శాతం వరకు ఉందని రామ్‌దేవ్ మండిపడ్డారు. రాజకీయ కారణాలతో లేదా కులం పేరుతో ఒకరిపై ఒకరు ద్వేషం, కక్ష పెంచుకునే వారిని ఖండిస్తున్నా అని అన్నారు. పరస్పర శత్రుభావంతో నిలబడటం ఎంత దారుణమని బాబా రామ్‌దేవ్ ఆవేదన వ్యక్తం చేశారు.

## సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం : మంత్రి పొన్నం

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సామాజిక సమానత్వం కోసం పోరాడిన ధీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 376వ జయంతి సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఘన నివాళులర్పించారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ నాటి సామాజిక, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి అణగారినవర్గాల్లో ఆత్మగౌరవం, ధైర్యం, సమానత్వ భావనను పెంపొందించిన మహనీయుడని మంత్రి కొనియాడారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తాటికొండ, వరంగల్, భువనగిరి, కొలనుపాక తదితర ప్రాంతాల్లో తన ఆధిపత్యాన్ని విస్తరించి, గోల్కొండపై సైతం దండయాత్ర చేసి అప్పటి మొఘల్ పాలకులకు సవాల్ విసిరిన బహుజన వీరుడని కొనియాడారు. సామాన్య ప్రజల కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను ప్రజలకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందని, ఆయన వీరత్వాన్ని, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటాన్ని భవిష్యత్ తరాలకు తెలియజేయడం మనందరి బాధ్యత అన్నారు. ఆయన జయంతి సందర్భంగా 18న హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించనుండటం గర్వించదగ్గ విషయమన్నారు.

## ఇకపై మీ-సేవ ద్వారా టెట్ మెమోల జారీ

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:**రాష్ట్రంలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పరీక్షల్లో అర్హత సాధించిన వారికి ముద్రిత మెమోలను జారీచేయనున్నారు. ఇప్పటికే మీ-సేవల నుంచి కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ, రెసిడెన్షియల్ సర్టిఫికెట్స్ ఎలాగైతే జారీ చేస్తారో అలాగే టెట్ మెమోలనను కూడా మీ-సేవా కేంద్రాల ద్వారా జారీచేస్తారు. సర్టిఫికెట్‌పై ప్రత్యేకంగా ఒక బార్‌కోడ్, సర్టిఫికెట్‌కు సంబంధించిన నంబర్ సైతం ఉంటాయి. 2011 నుంచి ఇప్పటి వరకు టెట్ పరీక్ష పాసైన వారందరికి ముద్రిత మెమోలను జారీచేస్తామని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. టెట్ మెమోను మీ-సేవా ద్వారా పొందడానికి కొంత రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. మెమోపై అభ్యర్థి పేరు, ఫొటో, వేలిముద్ర/ సంతకం, అభ్యర్థి పొందిన మార్కుల వివరాలుంటాయి. గతంలో టెట్ పరీక్ష పాసైన వారికి రెండు సార్లు ముద్రిత మోమోలు జారీచేశారు. ఆ తర్వాత ఆన్‌లైన్ మెమోలను మాత్రమే జారీచేస్తున్నారు. దీంతో కొందరు నకిలీ మెమోలను తయారుచేస్తున్నట్లు విద్యాశాఖ గుర్తించింది. ఈ నేపథ్యంలోనే క్వాలిఫై అయిన వారందరికి ఇకపై మీ-సేవా ద్వారా ముద్రిత మెమోలను జారీచేయాలని నిర్ణయించారు. వారం పది రోజుల్లో మెమోలు అందుబాటులోకి వస్తాయని నవీన్‌నికోలస్ తెలిపారు.

## సిపిఎస్‌ను రద్దు చేయాలి

### పిఆర్సీ, పెండింగ్ డిఎలను విడుదల చేయాలి

### తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం డిమాండ్

**హైదరాబాద్,ఆగస్టు 17, ప్రభాతవార్త:** సీపీఎస్‌ను రద్దు చేయాలని, పీఆర్‌సీతోపాటు పెండింగ్ డిఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం(టిఎన్‌జివో) రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. టిఎన్‌జివో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం నాంపల్లిలోని టిఎన్‌జివో భవన్‌లో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం హుస్సేన్ ముజీబ్ అసోసియేట్ అధ్యక్షులు ముత్యాల సత్యనారాయణ గౌడ్, కస్తూరి వెంకట్, కోశాదికారి ఎస్. ఉమాదేవి పాల్గొన్నారు. సమావేశంలో ప్రధానంగా పీఆర్సీ, సీపీఎస్ రద్దు, పెండింగ్ డిఏలు విడుదల తదితర పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానాలు చేశారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబందించిన పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, ఉద్యోగుల హక్కులను పరిరక్షించే విదంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. ఉద్యోగులకు సంబంధించిన వివిధ శాఖల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా ప్రజలకు అందించడంలో ఉద్యోగులు చేస్తున్న కృషిని సమావేశం అభినందించింది. సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంను పాటిస్తూ అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు జరపాలని తీర్మానించారు. హెల్త్ కార్డ్స్ అమలులో లోపాలను సవరించి పకడ్బందిగా అమలయ్యేట్లు చూడాలన్నారు.

## మరో 1,000 బడుల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్

**హైదరాబాద్,ఆగస్టు 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మరో 1000 సర్కారు బడుల్లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. ప్రస్తుతం 1000 పాఠశాలల్లో ఈ యూనిట్లు కొనసాగుతుండగా.. 2026-27 విద్యాసంవత్సరం మరో 1000 గవర్నమెంట్ స్కూల్స్‌లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను నెలకొల్పనున్నట్లు తెలిపారు. కొంపల్లిలోని శిక్షణకేంద్రంలో అదునాతన వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. స్పోర్ట్ ట్రాక్ సహా మరికొన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. పనులు పూర్తైన తర్వాత విద్యార్థులకు శిక్షణను అందిస్తామన్నారు. అత్యుత్తమ సేవలందించిన వారిని త్వరలోనే సన్మానించబోతున్నట్టు తెలిపారు.

## ఆల్వాల్‌లో విద్యార్థి ఆత్మహత్య

**హైదరాబాద్ (ఆల్వాల్), ఆగస్టు 17, ప్రభాతవార్త:** మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న 12వ తరగతి చదువుతున్న విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆల్వాల్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారం ఎఆర్‌కె హోమ్స్ సమీపంలోని దావర్‌వటి రెసిడెన్సీలో ఆధిత్యనాథ్‌జా భార్య కల్పన జా, కొడుకు ఆరుష్‌జా(16), కూతురు అభిలాషజాలతో కలిసి నివాసం ఉంటు న్నారు. ఆధిత్యనాథ్‌జా కుమారుడు ఆరుష్‌జా డిఆర్‌ఎస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో 12వ తరగతి చదువుతున్నాడు. ఆరుష్‌జాకు చదువంటే అయిష్టంగా ఉండడంతోపాటుగా పాఠశాలకు సక్రమంగా వెళ్లేవాడు కాదు. మానసిక వైద్యనిపుణులను సంప్రదించినా ఫలితం లేకుండాపోయింది. సోమవారం ఉదయం 11 గంటలు సమయంలో కొడుకు ఇంటిలో కనిపించక పోయేసరికి తల్లి స్థానికంగా ఉన్న బంధువులు, స్నేహితులు వద్ద వెతికినా అతని జాడలేదు. తల్లి కుమారుడిని వెతకడానికి భవనం టెర్రస్ పైకివెళ్లిన కొద్ది నిమిషాలకు ముందు ఆరుష్ అక్కడి నుంచి కిందకు దూకేశాడు. నేల పైన పడి ఉన్న కుమారుడిని చూసిన ఆమె కేకలు వేసుకుంటూ అతని వద్దకు వెళ్లింది. బాలుడు అప్పటికి శ్వాస తీసుకోవడం కనిపించింది. అంబు లెన్స్‌లో కండ్లకోయలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలిచంగా వైద్యులు పరిశీలించి మరణిం చినట్లు ధ్రువీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## టిజి సేఫ్ కమిషనర్‌గా అవినాష్ మొహంతి బాధ్యతలు స్వీకారం




టిజి సేఫ్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అవినాష్ మొహంతి

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయిన తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టి జి సేఫ్) కమిషనర్‌గా సీనియర్ ఐపిఎస్ అధికారి అవినాష్ మొహంతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం డ్రగ్స్ కంట్రోల్ బోర్డు డైరెక్టర్‌గా వున్న అవినాష్ మొహంతి ఈ విభాగంతోపాటు వైద్య శాఖ పరిధిలోని ఫుడ్ సేఫ్టీ విభాగాన్ని కలిపి కొత్తగా టిజి సేఫ్‌కు నూత న బాస్‌గా వ్యవహరి స్తారు. టిజి సేఫ్ ఏర్పాటుపై ఆదివారం సర్కారు ఆదేశాలు జారీ చేయడం విదితమే. రాష్ట్రంలో కల్తీ ఆహార వస్తువులు, నకి లీ ఔషధాల భరతం పట్టేందుకు సర్కారు టిజి సేఫ్‌ను ఏర్పాటు చేయగా కొత్త విభాగం వెంగళరావునగర్‌లో గల డ్రగ్స్ కంట్రోల్ బోర్డు కార్యా లయం నుంచి పనిచేయనుంది. కాగా టిజి సేఫ్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అవినాష్ మొహంతిని ఆ విభాగం అధికారులు అభినందించారు.

# పెద్ద రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శం

### ఒకే పంట కాలంలో 2 లక్షలలోపు రుణమాఫీ

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** తెలంగాణ, పెద్ద రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలిచే విధంగా సాహసోపేతమైన నిర్ణయాలను తీసుకుంటోందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వం రైతుల పక్షపాతిగా నిలుస్తోందన్నారు. ఈ మేరకు సోమవారం మంత్రి కార్యాలయ ప్రకటనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నంగా ఉన్నప్పటికి, ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు మొదటి పంటకాలంలోనే రూ.2 లక్షలలోపు పంట రుణాలన్నింటిని మాఫీ చేశామన్నారు. గత ప్రభుత్వం 2014 లో లక్ష వరకు రుణమాఫీ ఒకేసారి చేయలేక వాయిదాల పద్ధతిలో 4 ఏళ్ల చేయడంతో రైతులకు అసలు కాకపోగా రూ.2,630 కోట్ల వడ్డీ భారం పడిందన్నారు. 2018లో రూ.లక్ష వరకు పంట రుణమాఫీ చేస్తామని చెప్పి, దాన్ని ఆఖరిదాకా నగదు సగం అమలు చేయడం వల్ల రైతులపై రూ.8,515 కోట్ల వడ్డీ భారంతో పాటు, 8379 కోట్లు పూర్తిగా ఎగ్గొట్టారని ఆరోపించారు. అంతేకాక రూ.1,419 కోట్లు ఖాతాలు సరిగ్గా లేనందున వెనక్కి వెళ్లిపోయాయని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం రూ.20,616.89 కోట్ల పంట రుణమాఫీని ఏకకాలంలో చేశామని, దాంతో 25,35,964 మంది రైతులు లబ్ధిపొందారని చెప్పారు. బ్యాంకులు అందించిన రైతుల డేటా ఆధారంగా రుణమాఫీని అమలు చేసినట్లు తెలిపారు. 40 బ్యాంకులు సమర్పించిన మొత్తం ఖాతాలు 42.30 లక్షలు కాగా కుటుంబాలు 31.07 లక్షలని, అందులో 2 లక్షలలోపు (అసలు మరియు వడ్డీ కలిపి) ఉన్న పంట రుణఖాతాలు 25,35,964 అని, వారికి సంబంధించిన రుణాల మొత్తం చెల్లించడం జరిగిందని వివరించారు. కొన్ని ఖాతాల్లో లోపాలు ఉన్నప్పటికీ, వాటిని సరిచేయడానికి అధికారులు గ్రామాల వారీగా, రెండు నెలల పాటు ఇంటింటికి వెళ్లి ఆధార్ లింక్ చేసి, ఇలా మిగిలిపోయిన అర్హులైన ప్రతి రైతుకూ నాలుగో విడతలో రుణమాఫీ ప్రయోజనం అందేలా కృషి చేశారని తెలిపారు. ఇది మా ప్రభుత్వానికి ఉన్న కట్టుబాటును, నిబద్ధతను స్పష్టంగా చూపిస్తోందన్నారు.

# వచ్చే నెల నుండి పత్తి కొనుగోళ్లు

### రాష్ట్రంలో 131 కొనుగోలు కేంద్రాలు

### ఈ సీజన్‌లో 47.72 లక్షల ఎకరాల్లో సాగు

### 26 లక్షల టన్నులకుపైగా దిగుబడి అంచనా

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** తెలంగాణలో 2026-27 పత్తి కొనుగోలు సీజన్‌ను ఈసారి సెప్టెంబరు నుంచే ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సీజన్‌లో 47.72 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, సుమారు 26 లక్షల టన్నులకు పైగా దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఈ దిగుబడిని దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను అధికారులు ముందస్తు ప్రణాళికను రూపొందింప చేశారు. పంట చేతికొచ్చే సమయానికి కొనుగోలు కేంద్రాలు సిద్ధంగా ఉండేలా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. రైతుల అనుకూలత కోసం 131 కొనుగోలు కేంద్రాలు, 356 జిన్నింగ్ మిల్లులను సిద్ధం చేస్తున్నారు. జిన్నింగ్ మిల్లులు లేని ప్రాంతాలను సమీపంలోని నోటిఫైడ్ మిల్లులకు అనుసంధానించనున్నారు. కొనుగోళ్లు ప్రారంభించిన 15 నుంచి 30 రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని కేంద్రాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్‌ను సరళతరం చేయడంతో పాటు, సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ, వాట్సప్ చాట్‌బాట్ సేవలను అందుబాటులోకి తేనున్నారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకతను పెంచేందుకు, లోపాలను నివారించేందుకు కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీలను వేస్తున్నారు. వీటిలో రైతు ప్రతినిధులకు కూడా భాగస్వామ్యం కల్పిస్తున్నారు. రైతులు విక్రయాల కోసం ఉపయోగించే కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ విధానాన్ని సాంకేతిక పరిజ్ఞానం లేని ప్రతీ రైతుకూ సులభంగా అర్థమయ్యేలా మార్చనున్నారు. మిల్లులలో తేమ శాతం, నాణ్యతను పరీక్షి ంచే పరికరాలు సక్రమంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

అంతేకాకుండా రైతుల సమస్యల తక్షణ పరిష్కారానికి ప్రత్యేకంగా 1800 599 5779 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్, 88972 81111 వాట్సప్ చాట్‌బాట్ సేవలను ప్రారంభించనున్నారు. గత సీజన్లలో విజిలెన్స్ విభాగాలు గుర్తించిన తూకం, రసీదులు, చెల్లింపుల లోపాలు ఈసారి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోనున్నారు. అవసరమైతే సాయంత్రం 6 గంటల తర్వాత కూడా కొనుగోలు సమయాన్ని పొడిగించే యోచన కూడా చేస్తున్నట్ల అధికారవర్గాలు చెబుతున్నాయి.

## తెలంగాణ హ్యూమన్ రైట్స్ కమిషన్ సిఫారసు

# ఇంజినీరింగ్ కేటగిరీ-బి ప్రవేశాల్లో మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలి

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళా శాలల్లో కేటగిరీ-బీ (మేనేజ్‌మెంట్/ఎన్‌ఆర్‌ఐ) సీట్ల ప్రవేశాలకు సంబంధిం చిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేసి, అర్హులైన విద్యార్థులకు పారదర్శకత, నిష్పక్షపాతత్వం, సమాన అవకాశాలను కల్పించాలని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టిజిహెచ్‌ఆర్‌సీ) సిఫార్సు చేసింది. కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని కమిషన్ జులై 31న హెచ్‌ఆర్‌సీ నంబర్ 4961 ఆఫ్ 2021 కేసులో ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన పాలడుగు శ్రీనివాస్, జేఏసీ దాఖలు చేసిన ఫిర్యాదులో, 2021-22 విద్యా సంవత్సరానికి ధూలపల్లి సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాల, శంషాబాద్ వర్ధమాన్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీల్లో కేటగిరీ-బీ ప్రవేశాల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. నోటిఫికేషన్లు జారీ చేసినప్పటికీ, అర్హులైన విద్యా ర్థులకు దరఖాస్తులు సమర్పించేందుకు సముచిత అవకాశం కల్పించ లేదని, నిర్దేశిత ప్రవేశవిధానాన్ని సక్రమంగా పాటించలేదని ఫిర్యాదుదారు ఆరోపించారన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టిజీసీహెచ్‌ఈ) కార్యదర్శి సమర్పించిన నివేదిక ప్రకారం, రెండు కళాశాలలు 2021 సెప్టెంబరు 18న మూడు పత్రికల్లో నోటిఫికేషన్లు జారీ చేసి, నిర్దేశిత మార్గదర్శకాలు, షెడ్యూల్ ప్రకారం ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేశాయని తెలిపింది. కానీ ఫిర్యాదుదారు ఈ నివేదికను వ్యతిరేకిస్తూ తన ఆరోపణలకు మద్దతుగా పలు పత్రాలను సమర్పించారని వెల్లడించారు.

ఆరోపణలు నిజమైతే, ప్రకటించిన ప్రవేశ విధానానికి, వాస్తవ అమలుకు మధ్య వ్యత్యాసం ఏర్పడి, అర్హత కలిగిన ప్రతిభా వంతులైన విద్యార్థుల విద్యా అవకాశాలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని కమిషన్ పేర్కొంది. అందువల్ల మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993లోని సెక్షన్ 18 ప్రకారం, కేటగిరీ-బీ ప్రవేశాలకు సంబంధించిన మార్గదర్శకాలను కచ్చి తంగా అమలు చేయాలని, ఎలాంటి ఏకపక్ష, అనధికారిక విధానాలను అనుసరించకుండా, పారదర్శకత, నిష్పక్షపాతత్వం, అర్హులైన అభ్య ర్థులందరికీ సమాన అవకాశాలను నిర్ధారించాలని ఉన్నత విద్యామండలికి కమిషన్ సిఫార్సు చేసింది. ఈ సిఫార్సుతో కేసులో తదుపరి చర్యలను కమిషన్ ముగించినట్టు ప్రకటించింది. ఉత్తర్వుల ప్రతితో పాటు ఫిర్యాదు ప్రతిని అవసరమైన చర్యల కోసం ఉన్నత విద్యామండలి కార్యదర్శికి పంపిం చాలని కమిషన్ ఆదేశించింది.

## ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్

# ఎన్‌టిఎను రద్దు చేయడానికి బిజెపికి భయమెందుకు?

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** పేపర్ లీక్‌లకు, తప్పుడు ప్రశ్న పత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ)ను రద్దు చేయాలని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్(ఏఐఎస్‌ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ డిమాండ్ చేసింది. ఎన్‌టిఏ సంస్థను రద్దు చేయడానికి బీజేపీకి భయ మెందుకని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ప్రశ్నించారు. జూన్‌లో జరిగిన యుజిసి నెట్ ప్రవేశ పరీక్షలో తప్పులు, లోపాలు జరిగి ఇంగ్లీష్, సోషియాలజీ, కామర్స్ పరీక్షలను రద్దు చేస్తున్నట్లు ఎన్‌టిఏ ప్రకటించిందన్నారు. నీట్ పేపర్ లీకేజీ పరీక్షల్లో అవకతవకలు మొదలుకొని నేటి యుజిసి నెట్ ప్రశ్న పత్రాల తప్పులు, లోపాల వరకు ఎన్‌టిఏ వరుస వైఫల్యాలతో ఎన్‌టిఏలో జరుగుతున్న అక్రమాలపై జ్యుడీషియల్ ఎంక్వైరీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. వరుస తప్పిదాలతో విద్యార్థుల జీవితాలతో ఎన్‌టిఏ ఆడుకుంటోందని, దీంతో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. ఎన్‌టిఏ అధికారులు చేస్తున్న తప్పులకు విద్యార్థులు బలి అవుతున్నారని, ఆ సంస్థ పరీక్షల నిర్వహణలో తప్పులు చేస్తూ అవకతవకలు, అక్రమాలు చేస్తూన్నా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఎన్‌టిఏను రద్దు చేయడానికి చర్యలు తీసుకోవడానికి ఎందుకు భయ పడుతుందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వానికి ఎన్‌టిఏ సంస్థ ముఖ్యమా లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తు ముఖ్యమో ఆలోచించాలన్నారు.

# అత్యధికులు భూమిలేని ఎస్సీ రైతులే

### రాష్ట్రంలో కొద్దిమందికే బీమా

### 11.34 శాతం మందే ఫోన్లలో వ్యవసాయ సేవలు

### ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ సర్వేలో వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** తెలంగాణలో 61 శాతానికి పైగా షెడ్యూల్ కులాల (ఎస్సీ) కుటుంబాలకు సొంత భూమి లేదు. అంతేకాకుండా వారిలో 1 శాతం కంటే తక్కువ (0.68 శాతం) మందికి మాత్రమే పంటల బీమా ఉంది ఒక అధ్యయనం వెల్లడించింది. తెలంగాణలోని షెడ్యూల్ కులాలు (ఎస్సీ) ల వ్యవసాయ జీవనోపాధులపై అనుభావిక పరిశోధన అనే అధ్యయనం కోసం, సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) సంస్థ రాష్ట్రంలోని 33 జిల్లాల్లోని 300 గ్రామాలు, 100 పట్టణ వార్డులను కవర్ చేస్తూ 10,213 ఎస్సీ కుటుంబాలను సర్వే చేసింది. ఈ సర్వేలో వెల్లడించిన వివరాలు ప్రకారం రాష్ట్రంలో సుమారు 31.35 శాతం సన్నకారు రైతులు, 61.22 శాతం చిన్న రైతులు ఉన్నారని వెల్లడించింది. ఈ గణాంకాలు గ్రామీణ, పట్టణ కుటుంబాలను రెండింటినీ కవర్ చేస్తాయి. వివిధ ప్రాంతాలలో విడిగా నిర్వహించిన గృహ మ్యాపింగ్ అధ్యయనంలో 62.5 శాతం కుటుంబాలు భూమిలేనివని తేలింది. భూ యాజమాన్యం లేకపోవడం వల్ల వారు రైతు భరోసా, రైతు భీమా వంటి వ్యవసాయ సంక్షేమ పథకాలను పొందలేకపోతున్నారని ఈ అధ్యయనంలో వెల్లడైంది. అలాగే పంటల భీమా కవరేజీలో ఒక పెద్ద అంతరం ఉన్నట్లు కూడా ఈ అధ్యయనం కనుగొంది. సర్వే చేయబడిన దక్షిణ తెలంగాణ రైతులలో కేవలం 0.68 శాతం మంది మాత్రమే ప్రైవేట్ భీమా కంపెనీల ద్వారా పంటల భీమా కలిగి ఉన్నారు. మరోపక్క గ్రామీణ తెలంగాణలోని ఎస్సీ కుటుంబాలలో 70.9 శాతం మందికి బోర్‌వెల్స్ ప్రధాన సాగునీటి వనరుగా ఉన్నాయని తేలింది. ఆ తర్వాత 30.4 శాతం కుటుంబాలు కాలువ నీటిపారుదల సౌకర్యాన్ని వినియోగించుకోగా, 27.7 శాతం మంది బహిరంగ బావులపై, 19.6 శాతం మంది చెరువులపై ఆధారపడ్డారు. దక్షిణ తెలంగాణలోని చాలామంది రైతులకు కాలువలు, చెరువులు, ఇతర ఉపరితల నీటి వనరులకు దూరంగా భూములు ఉన్నాయని, ఇది వారికి నీటిపారుదల సౌకర్యాన్ని పరిమితం చేస్తోందని అధ్యయనం పేర్కొంది. ఫలితంగా, వారు ప్రైవేట్ నీటిపారుదల మౌలిక సదుపాయాలపై ఎక్కువగా ఆధారపడుతున్నారని తెలిపింది.కాగా ఎస్సీ రైతుల్లో కేవలం 11.34శాతం మంది మాత్రమే మొబైల్ ఫోన్ల ద్వారా వ్యవసాయ సేవలను పొందామన్నారు.

## సనత్‌నగర్ టిమ్స్ అందుబాటులోకి రావడం హర్షణీయం

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు17:** పేదవారికి కూడా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందించాలన్న సమున్నత ఆశయంతో కేసీఆర్ నిర్మించిన సనత్ నగర్ టిమ్స్ ఆసుపత్రి ఎట్టకేలకు ప్రజలకు అందుబాటులోకి రావడం హర్షనీయమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎయిమ్స్ తరహాలో హైదరాబాద్ నలుదిశలా టిమ్స్ ఆసుపత్రులు ఉండాలన్న ఉదాత్తమైన ఆలోచనతో కేసీఆర్ వీటికి శంకుస్థాపనలు చేయడమే కాకుండా, బీఆర్ఎస్ హయాంలోనే శరవేగంగా నిర్మాణ పనులను చేపట్టారని పేర్కొన్నారు. ఒక్క సనత్ నగర్ టిమ్స్ లోనే 1,000 పడకలు, 300 ఐసీయూ బెడ్లు, 16 ఆపరేషన్ థియేటర్లు, అవయవ మార్పిడి విభాగం, ఎంఆర్ఐ, సిటీస్కాన్, ఎక్స్ రే, క్యాథలాబ్స్, రేడియాలజీ, డయాలసిస్ సెంటర్ వంటి అన్నిరకాల విభాగాలు ఒకచోట ఉండటం రోగులకు వెలకట్టలేని వరమన్నారు. కేవలం హైదరాబాద్ వాసులకే కాకుండా జిల్లాల నుంచి ప్రాణాపాయ స్థితిలో రాజధానికి వచ్చే రోగులకు కూడా ఈ సనత్ నగర్ టిమ్స్ ఆసుపత్రి ఒక సంజీవనిగా సేవలందించనుందన్నారు. 22 ఎకరాల సువిశాల ప్రాంగణంలో చేపట్టిన ఈ ఆసుపత్రి నిర్మాణంలో భాగస్వాములైన ఇంజనీర్లకు, ఆసుపత్రిలో సేవలందించే వైద్యులు, నర్సింగ్ స్టాఫ్, ఇతర సిబ్బందికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



బీఆర్ఎస్ హయాంలో ప్రాథమిక వైద్యం కోసం రూపకల్పన చేసిన 350 బస్తీ దవాఖానాలతోపాటు, కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించేందుకు 4000 పడకలు, ఆక్సిజన్ వసతి కలిగిన 1200 ఎమర్జెన్సీ బెడ్లు.. పేద రోగులకు కొండంత భరోసా ఇవ్వనున్నాయన్నారు. రెండు వేల పడకలతో తెలంగాణలోనే అతిపెద్దదైన వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని, హైదరాబాద్ లోని నిమ్స్ విస్తరణ పనులను కూడా సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని ప్రజల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

# వివిధ జిల్లాల్లో సబ్‌స్టేషన్లు ముట్టడిస్తున్న రైతులు

### నాణ్యమైన విద్యుత్తు 24 గంటలు ఇవ్వాలని డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** ప్రస్తుత ఖరీఫ్ పంటల సాగుకు సంబంధించి రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు క్రమంగా తీవ్రతరమవుతున్నాయి. మరోపక్క విద్యుత్ సరఫరా సమస్యలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో నాణ్యత లేని, సరిపోని విద్యుత్ సరఫరా కారణంగా పంటల సాగులో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సీజన్‌లో అనేక ప్రాంతాల్లో వర్షపాతం తక్కువగా ఉండటంతో, రైతులు వరి, ఇతర పంటలు పండించడానికి బోర్‌వెల్స్‌పై ఆధారపడవలసి వస్తోంది. అయితే, విద్యుత్ సరఫరా కొరత వారి సమస్యలను మరింత తీవ్రతరం చేస్తోంది, కరెంటు సక్రమంగా లేక వ్యవసాయ పంపుసెట్లను నడపలేక, తమ పొలాల్లోని పంటలకు నీటిని అందించలేకపోతున్నారు. నీటి కొరత కారణంగా వ్యవసాయ కూలీల ఖర్చు పెరగడంతో పాటు, భూమిని సిద్ధం చేయడం, నాట్లు వేయడం కూడా ఆలస్యమవుతోందని చెబుతున్నారు. దీంతో పంటలకు సాగు నీటి నిమిత్తం నాణ్యమైన, 24 గంటల కరెంటు ఇవ్వాలని రైతులు రోడెక్కుతున్నారు. ఈ విధంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గత నాలుగు రోజులుగా సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళనలు, నిరసనలు తీవ్రతరం అవుతున్నాయి.

విద్యుత్ కోతలు, సరఫరా కొరత సమస్య ఒక నిర్దిష్ట ప్రాంతానికో లేదా జిల్లాకో పరిమితం కాలేదు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో రైతులు ఇలాంటి ఫిర్యాదులే చేస్తున్నారు. ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించకపోతే, తమ నిరసనలను మరింత తీవ్రతరం చేస్తామని చాలా చోట్ల వారు హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని నాగర్‌కర్నూల్ జిల్లా పోల్కంపల్లిలో విద్యుత్ సరఫరా సరిపోవడం లేదని నిరసనగా రైతులు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. అధికారులు చెబుతున్నట్లుగా తమకు 24 గంటల విద్యుత్ సరఫరా అందడం లేదని రైతులు ఆరోపించారు.

రోజుకు కేవలం 9 నుంచి 10 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా అవుతోందని వారు తెలిపారు. విద్యుత్ కొరత కారణంగా తమ వ్యవసాయ బోర్‌వెల్‌లు పనిచేయడం ఆగిపోయాయని రైతులు వాపోతున్నారు. విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడం వల్ల నీటి కొరత ఏర్పడి తమ పంటలు ఎండిపోవచ్చని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా కల్వకుర్తి మండలంలోని మార్చెర్ల గ్రామంలో విద్యుత్ సరఫరా సరిపోవడం లేదని రైతులు ఆందోళన చేపట్టారు. జనగాంలో, మంచుపవ్వుల చెన్నూరు గ్రామానికి చెందిన రైతులు పేలవమైన విద్యుత్ సరఫరాకు నిరసనగా రోడ్డుపై బైఠాయించారు. అదేవిధంగా, సూర్యాపేట, మిర్యాలగూడ, ఉమ్మడి నల్గొండలోని ఇతర ప్రాంతాల రైతులు నాణ్యమైన విద్యుత్ సరఫరాను డిమాండ్ చేస్తూ విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద నిరసనలు చేస్తున్నారు. తక్షణమే ఈసమస్యలను పరిష్కరించి, 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీలతోపాటు ఒబిసి, ఎస్ఇబిసి వర్గాన్ని ప్రత్యేకంగా చేర్చాలి

### రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియాకు తెలంగాణ బిసి కమిషన్ ఛైర్మన్ నిరంజన్ లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా, సెన్సెస్ కమిషనర్ మృతుంజయ్ కుమార్ నారాయన్‌కి తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్ సోమవారం లేఖ రాశారు. ఈ నెల 14న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లోని అంశాలను వారి దృష్టికి తీసుకువస్తూ అందులోని కొన్ని అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు.14న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో 2027 జనగణనకు సంబంధించిన గృహ పట్టికలోని అంశం 10లో షెడ్యూల్డ్ కాస్ట్ (ఎస్సీ), షెడ్యూల్డ్ ట్రైబ్ (ఎస్టీ), కులం అని పేర్కొనబడిందని ప్రస్తుత పదజాలంలో కేవలం ఎస్సీ, ఎస్టీలను మాత్రమే ప్రత్యేకంగా పేర్కొని, ఇతర సమాజాల కులాలను ఓపెన్ ఎండెడ్ ఎంట్రీ ద్వారా నమోదు చేసే విధంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఓబీసీ,ఎస్‌ఈబీసీ హోదాను స్పష్టంగా, ప్రత్యేకంగా నమోదు చేస్తారా అనే విషయంపై బీసీ కమిషన్ స్పష్టత కోరుతోందన్నారు. భారత ప్రభుత్వం ఇప్పటికే హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ ప్రక్రియను ప్రారంభించిందని తెలంగాణ రాష్ట్రంలో ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందన్నారు. దేశ వ్యాప్తంగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం 2026 సెప్టెంబర్ చివరి నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని ఈ సందర్భంగా దేశంలో నివసిస్తున్న ప్రతి వ్యక్తికి సంబంధించిన కులాల వారీ వివరాలను, ఇతర వెనుకబడిన తరగతుల(ఎస్‌ఈబీసీ) వివరాలను సేకరించేలా 2027 జనగణనను నిర్వహించనున్నట్లు కేంద్రప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని తమరి దృష్టికి తీసుకువస్తున్నామన్నారు. భారత ప్రభుత్వం దేశంలో నివసిస్తున్న మొత్తం జనాభాకి సంబంధించిన కుల వివరాలను నమోదు చేయడానికి కట్టుబడి ఉందని స్పష్టంగా పేర్కొంటూ నోటిఫికేషన్‌కు ఒక సవరణ జారీ చేయడం అవసరమని తాము సూచిస్తున్నామని లేఖలో నిరంజన్ పేర్కొన్నారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కులాల వారీ వివరాల గణనను పూర్తి చేస్తామని అందులో స్పష్టంగా పేర్కొనాలన్నారు. ఇది రాష్ట్రంలోని ఇతర వెనుకబడిన తరగతులు, ఎస్‌ఈబీసీ వర్గాల్లో ఏర్పడిన ఆందోళనకు తక్షణమే సంజీవనిగా పనిచేస్తుందన్నారు. ఎస్ఈసీసీ 2011 అనుభవం ఈ విషయంలో ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని.. ఓపెన్ ఎండెడ్ కుల నమోదు విధానం కారణంగా అక్షర దోషాలు, స్థానిక పేర్లు, పర్యాయపదాలు, ఉపకులాల పేర్లలోని తేడాల వల్ల అనేక రకాల విభజనలు ఏర్పడి తరువాత వాటిని ధృవీకరించడం, సమీకరించడం చాలా కష్టమైందన్నారు. కాబట్టి సాధారణ కులం అనే అంశానికి బదులుగా ఎస్సీ, ఎస్టీలతోపాటు ఓబీసీ, ఎస్‌ఈబీసీ వర్గాన్ని స్పష్టంగా ప్రత్యేకంగా పేర్కొనాలన్నారు. ఈ జాబితాలు రాష్ట్రాల వారీగా మారుతూ ఉంటాయి కాబట్టి సంబంధిత రాష్ట్ర ఓబీసీ, ఎస్‌ఈబీసీ జాబితాను కేంద్ర ఓబీసీ జాబితా నుండి వేరు చేస్తూ, రాష్ట్రాల వారీగా ఒక మాస్టర్ కులాల డైరెక్టరీని రూపొందించాలన్నారు. గుర్తింపు పొందిన ప్రతి కులానికి ప్రత్యేక డిజిటల్ కోడ్‌ను కేటాయించి, ఒకే కులం పేరులో ఏర్పడే నకిలీ, అసమాన నమోదులను నివారించాలన్నారు. జాబితాలో లేని లేదా వివాదాస్పదమైన కుల పేర్లను నమోదు చేసి, వాటిని ధృవీకరించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు.

## కోఆర్డినేటర్లు, ఎఎస్‌సిల నియామకానికి దరఖాస్తు స్వీకరణ గడువు 24వరకు పెంపు

### పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్‌నికోలస్

**హైదరాబాద్,ఆగస్టు 17, ప్రభాతవార్త:** సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట ఆఫీస్‌లో కోఆర్డినేటర్స్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ కోఆర్డినేటర్స్‌గా పనిచేయడానికి పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హత కలిగిన గెజిటెడ్ హెడ్మాస్టర్స్, స్కూల్ అసిస్టెంట్స్(ఎస్‌ఏ) నుంచి దరఖాస్తులను స్వీకరించడానికి గడువును పొడిగించారు. దరఖాస్తులను ఈ నెల 24 వరకు స్వీకరించనున్నట్టు పాఠ శాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. అర్హతలున్న వారిని ఫారన్ సర్వీస్‌లో డిప్యూటేషన్ పద్ధతిలో నియామకం చేపట్టడం కోసం నెల 17 వరకు ఉన్న దరఖాస్తు గడువును 24 వరకు పొడిగించినట్టు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్ష స్టేట్ ఆఫీస్‌లో, జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో) ఆఫీస్‌లో అసిస్టెంట్ కోఆర్డినేటర్స్‌గా ఓడీ పద్ధతిలో పనిచేయడానికి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. డీఈవో ఆఫీసుల్లో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్స్‌గా ఓడీ పద్ధతిలో పనిచేయడానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు.

# ప్రియుడే యముడు!

### బీహార్ యువతి దారుణహత్య

### గోనె సంచిలో కుక్కి మృతదేహాన్ని తరలించే యత్నం

### నిందితునికి సహకరించిన తల్లి

### బాలాపూర్ పిఎస్ పరిధిలో ఘోరం



హతురాలు రెహానా (ఫైల్)



నిందితుడు అహ్మద్‌సలాం(ఫైల్)

**హైదరాబాద్ (సరూర్‌నగర్), ఆగస్టు 17, ప్రభాతవార్త:** పరస్పరం ప్రేమించుకొని పెళ్ళి చేసుకోకుండానే సహ జీవనం చేస్తున్న యువ జంటలో ప్రియురాలు దారుణ హత్యకు గురైంది. కిరాతకంగా కత్తితో పొడిచి కడతేర్చిన ప్రియుడు మృతదేహాన్ని గోనె సంచిలో కుక్కి తరలించడానికి విఫలయత్నం చేశాడు. ఎట్టకేలకు ఈ దారుణం వెలుగు చూడడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి సంఘటనా స్థలం నుండి యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. తీవ్ర కలకలం రేకెత్తించిన ఈ హత్యోదంతం హైదరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని శివారు బాలాపూర్ పోలీస్ స్టేషన్ ఏరియాలో జరిగింది. హతురాలు, హంతకుడు బీహార్ రాష్ట్రం నుండి ఉపాధి కోసం హైదరాబాద్‌కు వలస వచ్చిన కార్మికులే కావడం గమనార్హం. ఈ దారుణ హత్యకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రానికి చెందిన అహ్మద్ సలాం అలియాస్ టోటా (21) బాలాపూర్ పిఎస్ పరిధిలోని బిస్మిల్లా కాలనీలో నివసిస్తూ ఓ ఫంక్షన్ హాల్‌లో లేబర్‌గా పని చేస్తున్నాడు. అదే విధంగా బీహార్ ప్రాంతానికే చెందిన రెహానా (21) సైతం అదే ఫంక్షన్ హాల్‌లో కార్మికురాలిగా పని చేస్తున్నది. కొంత కాలంగా వీరిరువురూ ప్రేమించుకుంటూ పెళ్ళి చేసుకోకుండానే గత బక్రీద్ పండుగ నుండి సహ జీవనం చేస్తున్నారు. బిస్మిల్లా కాలనీలో నివాసం ఉంటూ సహ జీవనం చేస్తున్న వీరిద్దరి మధ్య గొడవలు తలెత్తాయి. వివాహం చేసుకోవాలని రెహానా ఒత్తిడి చేయడంతో ఇష్టం లేని అహ్మద్ సలాం కత్తితో దాడికి పాల్పడి నిర్దాక్షిణ్యంగా హత్య చేశాడు. హత్య చేసిన తర్వాత శవాన్ని తరలించడానికి గోనె సంచిలో కుక్కాడు. ఇందుకు అహ్మద్ సలాం తల్లి అయేషా బేగం సహకరించింది. సోమవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో శవాన్ని తరలించడానికి విఫలయత్నం చేశారు. ఇంతలో 100 డయల్‌కు హత్యోదంతం సమాచారం అందడంతో బాలాపూర్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. అదే విధంగా బాలాపూర్ పిఎస్ పరిధిలో నైట్ డ్యూటీలో ఉన్న రాజేంద్రనగర్ డిసిపి శ్రీనివాస్ కూడా సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆదిభట్ల ఎసిపి ప్రదీప్‌కుమార్, బాలాపూర్ ఇన్స్‌పెక్టర్ సుధాకర్‌లు బిస్మిల్లా కాలనీకి చేరుకొని విచారణ జరిపారు. పోలీసులు మృతదేహానికి పంచనామా జరిపి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. హత్యకు దారి తీసిన కారణాలపై పోలీసులు అన్ని కోణాల నుండి దర్యాప్తు జరుపుతున్నారు.

## వందేమాతరం ఆలాపన వేళ కాంగ్రెస్ అగ్రనేతల బాధ్యతారాహిత్యం

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు17:** చారిత్రాత్మక జాతీయ గేయం వందేమాతరం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా దానిని సంపూర్ణంగా ఆలపించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తే, కాంగ్రెస్ అగ్రనేతలు వ్యవహరించిన తీరు అత్యంత గర్హనీయమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతికి కాంగ్రెస్ బహిరంగ క్షమాపణ చెప్పాలి..వందేమాతర ఆలాపన జరుగుతున్న సమయంలో సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ వంటి కాంగ్రెస్ అగ్ర నాయకులు తీవ్ర అసహనం, నిరక్ష్య వైఖరిని ప్రదర్శించారని మండిపడ్డారు.

స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరిపోసిన పవిత్ర గేయాన్ని అవమానించడం దేశానికి వ్యతిరేకంగా చేసిన క్షమించరాని పాపమని పేర్కొన్నారు. ఈ బాధ్యతారాహిత్య వైఖరికి కాంగ్రెస్ నాయకత్వం బేషరతుగా యావత్ భారత జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ దేశంలో కుహనా లౌకికవాదం, మేధావుల ముసుగులో కొందరు విద్యార్థుల్లో దేశ వ్యతిరేక భావజాలాన్ని నూరిపోస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ ఉక్కుపాదంతో అడవుల్లో నక్సలైట్లు తుపాకులు వదిలి లొంగిపోతుంటే, నగరాల్లో తిష్టవేసిన "అర్బన్ నక్సల్స్" విశ్వవిద్యాలయాల్లో తుక్డే తుక్డే ముఠాలను తయారుచేస్తూ దేశ భద్రతకు ముప్పుగా మారుతున్నారని హెచ్చరించారు. విద్యార్థి లోకానికి పిలుపు..మేధావుల రూపంలో తిరుగుతూ యువత ఆలోచనలను విషతుల్యం చేస్తున్న అర్బన్ నక్సల్స్ కుట్రలను విద్యార్థులు ఎక్కడికక్కడ అప్రమత్తమై తరిమికొట్టాలని ఎన్. రాంచందర్ రావు పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు యువతరం ముందుండాలని కోరారు.

## రూ.1.5 కోట్ల హాషిష్ ఆయిల్ పట్టివేత

### అంతర్రాష్ట్ర ముఠా ఆరుగురు అరెస్ట్

### వారిలో ఇద్దరు మైనర్లు

**హైదరాబాద్ (మన్సూరాబాద్), ఆగస్టు 17, ప్రభాతవార్త :** పోలీసుల కళ్లుగప్పి హాషీష్ ఆయిల్‌ను శరీరానికి కట్టుకుని బస్సులో తరలిస్తున్న అంతర్రాష్ట్ర డ్రగ్ ముఠాను ఎస్‌ఓటీ ఎల్‌బీనగర్, వనస్థలిపురం పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. చింతల్‌కుంట వద్ద నిర్వహించిన ఆపరేషన్‌లో ఆరుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు మైనర్లు ఉన్నారు. నిందితుల నుంచి 12 కిలోల హాషీష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని మార్కెట్ విలువ సుమారు రూ.1.5 కోట్లు ఉంటుందని మల్కాజిగిరి సీపీ బి.సుమతి తెలిపారు. ఎల్బీ నగర్ లోని సీపీ క్యాంపు ఆఫీస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆమె నిందితుల వివరాలను వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని

# కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ఆగవు

## డివిజన్ బెంచ్‌కి అప్పీలు చేస్తాం : మంత్రులు పొన్నం, వాకిటి



**హైదరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పేదలకు అమలు చేస్తున్న కళ్యాణ లక్షి, షాది ముబారక్ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తెలిపారు. హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పుపై డివిజన్ బెంచ్ అప్పీల్‌కి వెళ్తామని.. ఎట్టి పరిస్థితుల్లోనూ పథకాలను నిలుపుదల చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కోర్టు తీర్పు నేపథ్యంలో బీఆర్ఎస్ మొసలి కన్నీరు కారుస్తూ నిరసనలు తెలుపుతోందని మంత్రులు విమర్శించారు. కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాలపై హైకోర్టు స్టే నేపథ్యంలో సోమవారం సచివాలయంలో మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాలకు గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నామన్నారు. కళ్యాణ లక్ష్మి పథకం కోర్టు కేసు నంబర్ డబ్ల్యూపీ 21732/2026 కళ్యాణ్ లక్ష్మీ పథకంపై ఇప్పటివరకు జారీ చేసిన 8 జీవోలను ఒక పిటిషన్ హైకోర్టులో వేయబడిందని అందులో భాగంగా ఈ పథకాన్ని ఆపాలని హైకోర్టు మధ్యంతర ఆదేశాలు ఇచ్చిందన్నారు. దీనిపై డివిజనల్ బెంచ్‌కు అప్పీల్‌కై వెళుతున్నామని సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నామని మంత్రులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ పథంలోని లొసుగులు ఏదైనా ఉంటే అది గత ప్రభుత్వం 2014లో చేసిన పొరపాటు వల్ల తలెత్తిందని, అప్పుడు సరైన రీతులో ఉత్తర్వులు ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. గత ప్రభుత్వం చేసిన అన్ని తప్పిదాలను తమ ప్రభుత్వం సరిచేసి ఈ పథకం కొనసాగేలా చేస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం హయాంలో పథకం లోప భూయిష్టమైన జీవోలు ఇవ్వడం వల్లే ఈ పథకం ఇలా అయిందని, కౌంటర్ ఫైల్ చేయడానికి అధికారుల లోపమా లేదంటే ప్రభుత్వంలో న్యాయపరమైన అంశాలు చూసే వారి లోపమా అని విచారణ చేస్తున్నామని మంత్రులు మీడియాకు తెలిపారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పేదింటి ఆడబిడ్డ వివాహ సమయంలో కుటుంబంపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించడమే ఈ పథకాల ప్రధాన ఉద్దేశమన్నారు. రాజకీయాలకు అతీతంగా పేదల ప్రయోజనం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాలను కొనసాగిస్తోందన్నారు. 2014లో ప్రారంభమైన ఈ పథకాలు అనంతరం బీసీ, ఈబీసీ వర్గాలకు కూడా విస్తరించామన్నారు. ఇప్పటివరకు ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖ నుంచి రూ2,734.81 కోట్లను 2,73,164 మంది లబ్ధిదారులకు ఇవ్వగా, ఎస్టీ సంక్షేమ శాఖ నుంచి రూ.1,801.48 కోట్లను 1,79,939 మందికి బీసీ సంక్షేమ శాఖ నుంచి రూ.7,803.05 కోట్లను 7,79,401 మందికి, ఈబీసీ సంక్షేమం రూ.831.70 కోట్లను 83,074 మందికి మైనారిటీ సంక్షేమ శాఖ నుంచి రూ.3,204.83 కోట్లను 3,62,769 మంది లబ్ధిదారులకు అందజేశామని మొత్తంగా రూ.16,375.87 కోట్లకు పైగా రాష్ట్రంలోని 16,78,347 మంది లబ్ధిదారులకు అందజేసినట్టు మంత్రులు తెలిపారు.

పథకాల్లో అర్హత, ఆదాయ పరిమితి, వయస్సు, ఆధార్, వివాహం అంశాలపై నిర్దిష్ట నిబంధనలు ఉన్నాయని వివాహ సమయానికి వధువు 18 సంవత్సరాలు పూర్తి చేసి ఉండటం తప్పనిసర న్నారు. ఎంఆర్‌వో, ఆర్‌డీవో స్థాయిలో లబ్ధిదారుల అర్హతను పరిశీలించే వెరిఫికేషన్ మెకానిజం ఉందని, కాబట్టి ప్రజాధనాన్ని ఎలాంటి నియంత్రణ లేకుండా ఖర్చు చేస్తున్నారనే ఆరోపణలు వాస్తవ విరుద్ధమన్నారు.

కాగ్ నివేదికలోని అభ్యంతరాలు, సూచనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయన్నారు. కోర్టు ఆదేశాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, అదే సమయంలో ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర కౌంటర్ అఫిడవిట్ ద్వారా పథకాల చట్టబద్ధత, రాజ్యాంగబద్ధత, ప్రజా ప్రయోజనాన్ని వివరించిందని తెలిపారు. ఈ నెల 12న హైకోర్టు స్టే విధించిందని వచ్చే నెల 9 వరకు అవకాశం ఉన్నప్పటికీ.. అప్పటి వరకు వెయిట్ చేయకుండా కోర్టులో స్టే తొలగించడానికి ముందుకు పోయామని, డివిజన్ బెంచ్‌కి అప్పీల్‌కి వెళ్ళి న్యాయపరంగా ముందుకు పోతున్నామని మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా కొణిదెల నాగబాబు

### కేబినెట్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

**విజయవాడ, ఆగస్టు 17, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పచ్చదనం, అటవీ విస్తీర్ణం, పర్యావరణ పరిరక్షణకు మరింత ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 'ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకలాజికల్ ఎన్‌రిచ్‌మెంట్ (ఎపి గ్రీన్) ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు కొణిదెల నాగేంద్ర రావు (నాగబాబు)ని నామినేట్ చేస్తూ రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ సోమవారం జిఒ ఆర్‌టి నం.93 జారీ చేసింది. ఈ నియామకంతో పాటు, ఎపి గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా నాగేంద్రరావుకి క్యాబినెట్ హోదా కల్పిస్తు న్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

#### 2047 నాటికి 50శాతం గ్రీన్ కవర్ లక్ష్యం

ఆంధ్రప్రదేశ్‌లో అటవీ పరిరక్షణ, పచ్చదనం పెంపు కలిపి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 50 శాతానికి పెంచడం ఎపి గ్రీన్ ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఈ లక్ష్యాన్ని 2047 నాటికి సాధించే దిశగా ఎపి గ్రీన్ పని చేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని సమర్థ వంతంగా అమలు చేయడానికి ఎపి గ్రీన్ గవర్నింగ్ బోర్డు, ఎగ్జిక్యూటివ్ కమిటీతో పాటు జిల్లాస్థాయిలో పాలక మండళ్లను ఏర్పాటు చేస్తు న్నట్లు ప్రభుత్వం పేర్కొంది.



నాగబాబు

ఎపి గ్రీన్ లక్ష్యాలు, కార్యక్రమాల అమలులో వివిధ శాఖలు, జిల్లాస్థాయి సంస్థల మధ్య సమన్వయం సాధించడం, కార్యక్రమాల అమలును వేగవంతం చేయడం, వాటి పురోగతిని పర్యవేక్షి ంచడం వంటి కీలక బాధ్యతలను ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా నాగబాబు నిర్వహించనున్నారు. ప్రత్యేకంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే పచ్చదనం పెంపు, పునర్వనీకరణ, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు జిల్లాస్థాయి వ్యవస్థలను అనుసంధానిస్తూ సమర్థవంతమైన అమలు వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ నియామకం కీలకంగా నిలవనుంది. రాష్ట్ర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ సమతుల్యతను కాపాడటం, అడవు లు, చెట్ల విస్తీర్ణాన్ని పెంచడం, పునర్వనీకరణ కార్యక్రమాలను విస్తృత స్థాయిలో చేపట్టడం వంటి అంశాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం ప్రాధాన్యత ఇస్తున్నద నడానికి ఎపి గ్రీన్ ఏర్పాటు, దాని ఎగ్జిక్యూటివ్ కమిటీకి చైర్‌పర్సన్ నియామకం నిదర్శనంగా నిలుస్తుంది. నాగబాబు నాయకత్వంలో ఎపి గ్రీన్ కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా మరింత సమర్థవంతంగా ముందుకు సాగుతాయని, 'పచ్చని ఆంధ్రప్రదేశ్ – ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్' లక్ష్య సాధనకు ఈ వ్యవస్థ దోహదపడుతుందని కూటమి భాగస్వామ్య పార్టీల నుండి ఆశాభావం వ్యక్తమవుతోంది.

## యెమెన్ సమీపంలో సౌదీ నౌకలపై క్షిపణి దాడి: హౌతీల వెల్లడి

**సనా, ఆగస్టు 17:** యెమెన్‌కు చెందిన ఇరాన్ అనుకూల హౌతీ తిరుగుబాటు గ్రూపు సోమవారం ఎర్ర సముద్రంలో యెమెన్ మొఖా తీరానికి సమీపంలో సౌదీ సైనిక నౌకతో పాటు దానికి అనుబంధంగా ఉన్న నాలుగు నౌకలపై క్షిపణి దాడి చేసినట్లు ప్రకటించింది. హౌతీ సైనిక ప్రతినిధి యాహ్యా సరీ ఈ దాడిని ప్రకటించారు. సౌదీ అధికారులు మాత్రం ఈ ఘటనపై తక్షణం ఎలాంటి ధ్రువీకరణ ఇవ్వలేదు.మొఖా వ్యూహాత్మకంగా కీలకమైన ఎర్ర సముద్ర నౌకాశ్రయం. ఇది ఎర్ర సముద్రాన్ని గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌తో అనుసంధానించే కీలకమైన బాబ్ ఎల్‌మండెబ్ జలసంధికి సమీపంలో ఉంది. అంతర్జాతీయ వాణిజ్య నౌకల రాకపోకలకు ఈ జలమార్గం అత్యంత ప్రాధాన్యమైనది.ఎర్ర సముద్రంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో హౌతీల తాజా ప్రకటన వెలువడింది. సౌదీ అరేబియాతో తమ ఘర్షణలో భాగంగా హౌతీలు గతంలోనూ ఈ ప్రాంతంలోని నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు, హెచ్చరికలు జారీ చేశారు.గత మంగళవారం కూడా బాబ్ ఎల్‌మండెబ్ జలసంధి సమీపంలో ఓ నౌకపై హౌతీలు దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనలో నలుగురు సిబ్బంది మరణించినట్లు యెమెన్ రవాణా మంత్రిత్వ శాఖ తెలిపింది.యెమెన్‌పై సౌదీ అరేబియా విధించిన దిగ్బంధానికి ప్రతిస్పందనగా జూలైలో సౌదీ అరేబియాను లక్ష్యంగా చేసుకుని నౌకా దిగ్బంధాన్ని ప్రారంభిస్తున్నట్లు హౌతీలు ప్రకటించారు. సౌదీ అరేబియా ఈ ఆరోపణలను ఖండించింది.

## నవజాత శిశువు మృతి కేసులో తల్లి సహా ముగ్గురు అరెస్ట్

### మరో నిందితుడి కోసం పోలీసుల గాలింపు: డిసిపి భాస్కర్

**నస్పూర్, ఆగస్టు 17, ప్రభాతవార్త :** మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నవజాత మగ శిశువును చెట్ల పొదల్లో వదిలివేసిన ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ తెలిపారు. వివాహేతర సంబంధం కారణంగా గర్భం దాల్చిన గోమాస సంధ్య, అబార్షన్ మాత్రలు వాడి ఈనెల 10న జన్మనిచ్చిన పసికందును రామగిరి శ్రీనివాస్ సాయంతో లక్ష్మీనగర్ సమీపంలోని చెట్ల పొదల్లో పడేసింది. స్థానికుల సమాచారంతో పోలీసులు శిశువును ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. చైల్డ్ హెల్ప్‌లైన్ సమన్వయకర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రధాన నిందితురాలు సంధ్యతో పాటు అబార్షన్ మాత్రలు సమకూర్చిన మెడికల్ షాప్ ఉద్యోగులు తంగళ్ళపల్లి మనోజ్ కుమార్, చేల్లోజు సాయి కృష్ణలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి మాత్రల స్ట్రిప్, మూడు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడు రామగిరి శ్రీనివాస్ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు డీసీపీ పేర్కొన్నారు. మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ పర్యవేక్షణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అతి తక్కువ సమయంలో కేసును ఛేదించిన దర్యాప్తు అధికారి, రూరల్ సీఐ గోపతి రవీందర్, సీసీసీ నస్పూర్ ఎస్ఐలు ఎం. ప్రశాంత్, టి. జితేందర్ సింగ్, ఏఎస్సై ఎండీ ఇజాజ్, కానిస్టేబుళ్లు వెంకటసాయి, నరేందర్, ఇతర సిబ్బందిని డీసీపీ భాస్కర్ అభినందించారు.

## బిజెపి కొత్త టీమ్‌లో తెలంగాణకు నో ప్లేస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు17:** బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కొత్త జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురికి కీలక బాధ్యతలు దక్కాయి. డి. పురందేశ్వరి, రామ్ మాధవ్‌కు జాతీయ ఉపాధ్యక్ష పదవులు వరించాయి. విష్ణువర్ధన్ రెడ్డికి జాయింట్ కోఆర్డినేటర్ బాధ్యతలు అప్పగించారు. అదే సమయంలో తెలంగాణ నుంచి ఒక్కరికి కూడా జాతీయ టీమ్‌లో చోటు దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. కొత్త కార్యవర్గంలో కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఈశాన్య రాష్ట్రాలకు చెందిన నేతలకు ప్రాధాన్యం ఇచ్చారు. రాజస్థాన్ మాజీ సీఎం వసుంధర రాజే, ఒడిశాకు చెందిన బైజయంత్ పాండా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రేఖా వర్మ, తారిఖ్ మన్సూర్ జాతీయ ఉపాధ్యక్షులుగా కొనసాగనున్నారు. ఉత్తరాఖండ్ మాజీ సీఎం తీరత్ సింగ్ రావత్, పంజాబ్‌కు చెందిన మన్‌ప్రీత్ సింగ్ బాదల్ సహా పలువురికి ఇదే బాధ్యతలు అప్పగించారు. 13 మంది జాతీయ ఉపాధ్యక్షుల్లో మహిళలకు గణనీయమైన ప్రాతినిధ్యం కల్పించారు. మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి దక్కింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆమెకు లభించిన తొలి కీలక సంస్థాగత బాధ్యత ఇదే. వినోద్ తావ్‌డే, సునీల్ బన్సల్, బిప్లవ్ కుమార్ దేవ్ సహా పలువురు ప్రధాన కార్యదర్శులుగా కొనసాగనున్నారు. వసుంధర రాజే, స్మృతి ఇరానీ మళ్లీ కీలక సంస్థాగత పదవుల్లోకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. బీఎల్ సంతోష్ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత)గా కొనసాగనున్నారు. శివప్రకాశ్, సౌదాన్ సింగ్ సంయుక్త ప్రధాన కార్యదర్శులు (సంస్థాగత)గా బాధ్యతలు చేపట్టనున్నారు. పీయూష్ గోయల్‌కు జాతీయ కోశాధికారి పదవి ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాల సమన్వయకర్తగా సంబిత్ పాత్రను నియమించారు. పార్టీ మీడియా వ్యవహారాలను అనిల్ బలూనీ చూసుకోనున్నారు. తెలంగాణకు మాత్రం ఈసారి జాతీయ కార్యవర్గంలో ప్రాతినిధ్యం దక్కలేదు. గతంలో డీకే అరుణ జాతీయ ఉపాధ్యక్షురాలిగా కొనసాగారు. ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా లక్ష్మణ్ బాధ్యతలు నిర్వహించారు. కొత్త టీమ్‌లో ఇద్దరికీ చోటు దక్కలేదు. తెలంగాణలో పార్టీని మరింత విస్తరించడమే తదుపరి లక్ష్యమని బీజేపీ చెబుతున్న సమయంలో.. జాతీయ స్థాయి పదవుల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం లేకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది.

## రచయిత్రిపై లైంగిక దాడి కేసులో ట్రంప్‌కు సుప్రీం షాక్





**వాషింగ్టన్, ఆగస్టు 17:** రచయిత్రి జీన్ కారోల్పై లైంగిక దాడికి పాల్పడి, అనంతరం ఆమెను పరువునష్టం కలిగించేలా వ్యాఖ్యానించారంటూ న్యూయార్కులోని జ్యూరీ విధించిన 5 మిలియన్ డాలర్ల పరిహారం తీర్పును కొట్టివేయాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నానికి మరోసారి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. జ్యూరీ ఇచ్చిన తీర్పుపై ట్రంప్ దాఖలు చేసిన అప్పీల్ను విచారించేందుకు నిరాకరించిన సుప్రీంకోర్టు నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని ఆయన తరఫు న్యాయవాదులు కోరారు. అయితే, ఈ పిటిషన్‌తోపాటు మరికొన్ని పిటిషన్లను కూడా సోమవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఇలాంటి పునఃపరిశీలన అభ్యర్థనలను సుప్రీంకోర్టు స్వీకరించడం చాలా అరుదు. అయితే గతంలో కొన్ని సందర్భాల్లో అలా చేసిన ఉదాహరణలు ఉన్నాయి. జూన్లో కారోల్ కేసులో తన అప్పీల్‌ను విచారించేందుకు కోర్టు నిరాకరించిన కొద్దికాలానికే ట్రంప్ ఆ తీర్పు కింద చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించారు. ఇదిలా ఉండగా, కారోల్‌కకు సంబంధించిన మరో కేసులో వచ్చిన 83 మిలియన్ డాలర్ల పరిహారం తీర్పును కూడా రద్దు చేయాలని ట్రంప్, అమె రికా న్యాయశాఖ సుప్రీం కోర్టును కోరుతు న్నాయి. 2019లో ట్రంప్ అధ్యక్షు డిగా ఉన్న సమయంలో కారోల్పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి తనపై దావా వేయలేరని, అధ్యక్షు డిగా తనకు రక్షణ ఉందని వారు వాదిస్తు న్నారు. ఈ అప్పీలుపై సుప్రీంకోర్టు ఇంకా నిర్ణయం తీసుకోలేదు. కారోల్ చాలా కాలంగా సలహా కాలమిస్టుగాను, టివి టాక్‌షో మాజీ వ్యాఖ్యాతగా పనిచేసారు. 2023లో జరిగిన విచారణసందర్భంగా ఆమె సాక్ష్యమిస్తూ 1990లలో ట్రంప్‌తో జరిగిన స్నేహపూర్వక పరిచయం మన్‌హట్టన్‌లోని డిపార్టుమెంటల్‌స్టోర్ బెర్గ్ డార్ఫ్ గుడ్‌మాన్ డ్రెస్సింగ్‌రూమ్‌లో హింసాత్మక దాడిగా మారిందని తెలిపారు. ట్రంప్ టవర్‌కు ఎదురుగా ఉన్న ఈ లగ్జరీ రిటైలర్‌లో ఈదుర్ఘటన జరిగిందని ఆమె వాంగ్మూలంలో పేర్కొన్నారు. 2022లో కారోల్ చేసిన ఆరోపణలను ట్రంప్ ఖండించడంతో, ఆమెను పరువునష్టం కలిగించేలా వ్యాఖ్యానించి నందుకు కూడా ట్రంప్ బాధ్యుడేనని జ్యూరీ తేల్చింది. అయితే ట్రంప్ తనపై వచ్చిన ఆరో పణలను, తాను ఎలాంటి తప్పు చేయలేదన్న వాదనను కొనసాగిస్తున్నారు. కారోల్ స్వయంగా బహిరంగంగా తనపై జరిగిన లైంగిక దాడి గురించి వెల్లడించినందున, మీడియా కూడా ఆమె పేరును వెల్లడించింది.

## హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ ఇకపై.. తెలుగు బ్లాక్‌హాక్స్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు17:** ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పివిఎల్) వ్యవస్థాపక ఫ్రాంచైజీలలో ఒకటైన ..హైదరాబాద్ బ్లాక్ హాక్స్, ఇకపై ....తెలుగు బ్లాక్ హాక్స్..గా కొత్త రూపంలో కొనసాగనున్నట్లు సోమవారం ప్రకటించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలను వాలీబాల్ ద్వారా మరింతగా అనుసంధానించడంతో పాటు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రవాస సమాజంతో బలమైన అనుబంధాన్ని ఏర్పరచుకోవడమే ఈ పరిణామం ప్రధాన ఉద్దేశ్యం.ప్రొఫెషనల్ వాలీబాల్ జట్టుగా పోటీ చేయడమే కాకుండా, రెండు తెలుగు రాష్ట్రాల్లో వాలీబాల్ అభివృద్ధికి తోడ్పడటం, యువ ప్రతిభకు అవకాశాలు కల్పించడం మొదటి నుంచీ బ్లాక్ హాక్స్ దృష్టిలో భాగంగా ఉంది. గత నాలుగేళ్లుగా ఈ ఫ్రాంచైజీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వాలీబాల్ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించింది. ఈ క్రమంలో ఈషా ఫౌండేషన్‌తో కలిసి రెండు రాష్ట్రాల్లో వాలీబాల్ కార్యక్రమాలు చేపట్టింది. అలాగే విజయ్ దేవరకొండ బ్లాక్ హాక్స్ ఓపెన్ ను వివిధ జిల్లాల్లో నిర్వహించడంతో పాటు, వాలీబాల్ క్లినిక్స్, ఓపెన్ ట్రయల్స్, ప్రీ సీజన్ క్యాంపులు, గ్రాస్‌రూట్స్ కార్యక్రమాలను నిర్వహించింది.

## యుఎఇలో సందీప్‌మక్తాలా బృందానికి ప్రభుత్వ స్థాయిలో పెరుగుతున్న ఆదరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు17:** భవిష్యత్ పరిశ్రమల్లో కీలకంగా మారుతున్న అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ రంగంలో యూఏఈలో కొత్త అవకాశాలను అన్వేషించే దిశగా సందీప్ మక్తాలా నాయకత్వంలోని ఆర్ఐ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ ముందుకు సాగుతోంది. గ్రాఫీన్‌తో పాటు కొత్త తరహా పదార్థాలపై పరిశోధన, సాంకేతిక అభివృద్ధి, తయారీ, ప్రపంచ మార్కెట్లకు విస్తరణ లక్ష్యంగా యూఏఈలో అవకాశాలను పరిశీలిస్తోంది. గ్రాఫీన్ భవిష్యత్‌లో ఎలక్ట్రానిక్స్, బ్యాటరీలు, నిర్మాణం, సిరామిక్స్ తదితర అనేక రంగాల్లో ఉపయోగపడే అవకాశాలు ఉండటంతో ఈ రంగంపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరుగుతోంది.ఈ ప్రయత్నంలో భాగంగా సందీప్ మక్తాలా బృందం షార్జా, రాస్ అల్ ఖైమా సహా పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రభుత్వ, పరిశోధన, పారిశ్రామిక వర్గాలతో చర్చలు జరిపింది. ఆర్ఐ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ విస్తరణకు యూఏఈలోని పలు ఎమిరేట్లు ఆసక్తి చూపడంతో పాటు తమ ప్రాంతాల్లో కేంద్రాల ఏర్పాటును పరిశీలించాలని ఆహ్వానిస్తున్నాయి. ఈ బృందంలో గ్రాఫీన్ సాంకేతికతలో శాస్త్రవేత్త డా. రాజేంద్ర ప్రసాద్ జోషి, మైనింగ్, ఖనిజ వనరుల రంగంలో నిపుణుడు బియ్యాని రవీందర్ ఉన్నారు. జోషి సాంకేతిక పరిజ్ఞానం, రవీందర్ ఖనిజ వనరుల అనుభవాన్ని కలిపి పరిశోధన నుంచి తయారీ వరకు అవకాశాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తున్నారు.

## కాళ్లు, కడుపు చుట్టూ డ్రగ్స్ ప్యాకెట్లే..

ఏజెన్సీ ప్రాంతాల నుంచి హాషీష్ ఆయిల్‌ను సేకరించి.. హైదరాబాద్ మీదుగా బెంగళూరుకు తరలిస్తున్నట్లు సీపీ వెల్లడించారు. పక్కా సమాచారంతో చింతల్‌కుంట వద్ద నిందితులను అడ్డుకున్నామని తెలిపారు. బస్సులో ప్రయాణిస్తూ డ్రగ్స్‌ను తరలించే ప్రయత్నం చేశారని.. పోలీసులు తనిఖీలు చేయడంతో వారి అక్రమ రవాణా బయటపడిందని చెప్పారు.

#### కాళ్లకు.. కడుపుకు కిలో చొప్పున

పోలీసుల కళ్లుగప్పేందుకు క్యారియర్లు వినూత్న పద్ధతిని అనుసరించారు. ఒక్కొక్కరు రెండు కాళ్లకు కిలో చొప్పున, కడుపుకు మరో కిలో.. మొత్తం 3 కిలోల హాషీష్ ఆయిల్‌ను బ్రౌన్ టేపుతో శరీరానికి కట్టుకుని తరలించారు.

నలుగురు క్యారియర్లు కలిపి 12 కిలోల హాషీష్ ఆయిల్ తరలిస్తూ పట్టుబడ్డారు. వారి నుంచి ఐదు మొబైల్ ఫోన్లు, రూ.5 వేల నగదును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

#### రూ.10 లక్షలకు డీల్

ఈ 12 కిలోల హాషీష్ ఆయిల్‌ను బెంగళూరుకు చేర్చేందుకు అక్కడి రిసీవర్ సిజో రూ.10 లక్షలకు డీల్ కుదుర్చుకున్నట్లు పోలీసులు తెలిపారు. సరుకు బెంగళూరుకు చేరిన అనంతరం ప్రధాన నిందితులకు ఆ మొత్తాన్ని చెల్లించేలా ఒప్పందం జరిగినట్లు వెల్లడించారు.

నిరుద్యోగ గిరిజన యువతే క్యారియర్లుఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు గెమ్మెలి శ్రీను, అతని భార్య నిబియా బెంగళూరులో ఉంటున్నట్లు సీపీ తెలిపారు. వీరిద్దరూ గిరిజన ప్రాం తాలకు చెందిన నిరుద్యోగ యువతకు డబ్బు ఆశ చూపి క్యారియర్లుగా ఉపయోగించు కుంటున్నారని వెల్లడించారు. నలుగురు క్యారియర్లలో ఇద్దరు మైనర్లు ఉన్నారని తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సిపి సుమతి

గతంలోనూ ఇదే తరహాలో హాషీష్ ఆయిల్‌ను పలుమార్లు తరలించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు.

# 3యేళ్లలో గోదావరి డెల్టా ఆధునీకరణ పూర్తి

- శాసనసభలో మంత్రిజలవనరుల శాఖ మంత్రి రామానాయుడు.
- 36 ప్రాజెక్టులతో ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల చేశాం.



శాసనసభలో మంత్రి రామానాయుడు

**విజయవాడ,ఆగస్టు 17,ప్రభాతవార్తప్రతినిధి:** రానున్న మూడేళ్లలో అంటే 2029 నాటికల్లా గోదావరి డెల్టా ఆధునీకరణ పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. సోమవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో యనమదురు డ్రైన్ ఆధునీకరణ, కేసనపల్లి కెనాల్ ప్రాజెక్టు స్థితిపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ మంత్రి ఈ విషయం తెలియజేశారు. గోదావరి డెల్టా లోని కాలువలు డ్రైన్ల ఆధునీకరణ కోసం 14 కోట్లు కేటాయించి లైడార్ సర్వే పూర్తి చేశామన్నారు. డిపిఆర్ కూడా తయారు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 36 ప్రాధాన్యత ప్రాజెక్టులతో చంద్రబాబు ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల చేసినట్లు చెప్పారు. 36 ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో గోదావరి డెల్టా ఆధునీకరణ కూడా ఉందన్నారు. 2019 24 మధ్యకాలంలో అప్పటి ప్రభుత్వం ఓ అండ్ ఎం కు నిధులు కేటాయించనందు వల్లే గోదావరి డెల్టా విధ్వంసానికి గురైందని అన్నారు. డిసిల్టింగ్, లాకులు, షట్టర్లు, రోప్స్ తదితర మరమ్మత్తుల వైపు కన్నె చూడలేదని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ ఈ రెండు సంవత్సరాలలో ఓఅండ్ఎం కింద 1100 కోట్లు పైగా నిధులు కేటాయించామన్నారు. గోదావరి పశ్చిమ డెల్టాలో యనమదురు డ్రైన్ ముఖ్యమైనది. 23వేల క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న యనమదురు డ్రైన్ కు, సామర్ధ్యానికి మించి వరద వస్తోంది. యనమదురు డ్రైన్ సామర్ధ్యాన్ని 30వేల క్యూసెక్కులకు పెంచడం, శిథిలావస్థకు చేరిన ఇన్లెట్లను పునర్నిర్మాణం చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని మంత్రి వివరించారు. యనమదురు డ్రైన్ లో 86 ఇన్లెట్లకు గానూ 70 ఇన్లెట్లు శిథిలావస్థకు చేరుకున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రెండు విడతల్లో 3.2 కోట్లు కేటాయించి, 10 ఇన్లెట్ల పునర్నిర్మిస్తున్నామని అన్నారు. యనమదురు డ్రైన్ ఉప్పుటేరు ద్వారా సముద్రంలో కలుస్తున్నందున, ఉప్పుటేరును కూడా అభివృద్ధి చేయనున్నామన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలో 2686 ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరందించేందుకు, కేసనపల్లి కెనాల్ ప్రాజెక్ట్ కు అంచనాలు తయారు చేస్తున్నట్లు రామానాయుడు చెప్పారు. కొబ్బరి పంట ఆధారిత గ్రామాల్లోకి సముద్రపునీరు చొచ్చుకు వస్తోందన్నారు. ప్యాయంగా ఆయా గ్రామాలకు మంచినీరందించాలనే ఉద్దేశ్యంతో 50 కోట్లతో కేసనపల్లి కెనాల్ ప్రాజెక్టును ప్రతిపాదించినట్లు వివరించారు. 201718 గత టిడిపి పాలనలో జరిగిన డ్రెడ్జింగ్ పనులు మినహా, గత 5ఏళ్ల వైసిపి పాలనలో ఒక్క రూపాయి పని కూడా జరుగలేదని విమర్శించారు. డ్రైన్ ద్వారా సముద్రపు నీరు రావడంతో వేలాది ఎకరాల్లో రైతులు కొబ్బరి పంట నష్టపోయారని ఆవేదన చెందారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, శంకరగుప్తం డ్రైన్ సమస్యను రైతులు, నాయకులు నా దృష్టికి తీసుకువచ్చారన్నారు.

## అసెంబ్లీ కి రాకుండా గిరిజనులను రెచ్చగొడుతున్నారు.

- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

**సచివాలయం,ఆగష్టు 17,ప్రభాతవార్త :** అసెంబ్లీకి రాకుండా గిరిజనులను రెచ్చగొట్టడం సరికాదని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి విమర్శించారు.సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ చిన్న పిల్లలకు చాక్లెట్ ఇవ్వకపోతే మారం చేస్తున్నట్లు ప్రతిపక్ష హోదా ఇస్తే వస్తా అనడం హాస్యాస్పదం అన్నారు.వాళ్ళను నమ్మి కొంతమంది గిరిజనులు ఎండల్లో ధర్నా చేస్తున్నారు.1 ఆఫ్ 70యాక్టు ...అనగా గిరిజనుల భూ సంరక్షణ చట్టం రద్దు అవాస్తవం,ఇది కాపాడటం ప్రభుత్వ బాధ్యత,గిరిజనులు ఏమాత్రం భయపడవద్దు.గిరిజనులను మభ్యపెట్టి భయపెట్టి అబద్దపు ప్రచారం చేస్తున్నారు.మీరు ఐటిడిఏ ఆపేశారు,18పథకాలను ఆపేశారు.గురివిందకు తన తప్పు ఎరుగదు అన్నట్లు చేస్తున్నారు.బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ తీసేస్తే మేము తెచ్చాం...ట్రైకార్ లోన్స్ ఇచ్చాం,ఇన్నాళ్ళు మీరుగా అక్కడా ఎమ్మెల్యేలుగా ఉన్నది.మరి ఏం చేశారు.జీవోనెం 3రద్దు చేస్తే అప్పుడు సీఎంగా మీరు చేశారు? ఆయన తాడేపల్లిలో ఉంటాడో బెంగళూరులో ఉంటాడో ఎవరికి తెలియదు.అసలు డిఎస్సీపై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు.సిబిఎన్ అంటే డిఎస్సీ,డిఎస్సీ అంటే సిబిఎన్ ఇందులో మారుమాట లేదు.11సీట్లు ఇచ్చినా వీరికి బుద్దిలేదు.16వేల మంది ఉద్యోగాలు తీసేస్తాం అని బెదిరిస్తున్నారు.టీచర్లు పాఠాలు చెప్పారు...గుణపాఠాలు కూడా చెప్తామని ర్యాలీ చేస్తున్నారు గుర్తుంచుకోండి

## అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్ బురద రాజకీయాలు

**విజయవాడ.ఆగస్టు 17,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్రం పట్ల బాధ్యత లేదు కాబట్టే వరుసగా ఏడోసారి కూడా అసెంబ్లీకి గైర్హాజరయ్యారని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. ప్రతిపక్ష హోదా కల్పిస్తేనే అసెంబ్లీకి వస్తానని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి కేటాయించే సమయంతో సమానంగా తనకూ సమయం కేటాయిస్తేనే సభకు హాజరవుతానని జగన్ చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రతిపక్ష హోదా అనేది ప్రభుత్వం ఇచ్చేది కాదని, ప్రజలు ఇచ్చిన తీర్పు, శాసనసభలో పార్టీల బలాబలాల ఆధారంగా నిర్ణయించే అంశమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రిగా ఐదేళ్లు పనిచేసిన వ్యక్తికి ఈ విషయం తెలియకపోవడం ఆశ్చర్యకరమన్నారు. ప్రజలు ఎమ్మెల్యేగా ఎన్నుకున్న నాయకుడికి అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావించడం, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం బాధ్యత అని పేర్కొన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు గారితో కలిసి సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ లో మాట్లాడారు. ఈ సందర్భంగా పంతం నానాజీ మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల విషయంలో తగిన ప్రాధాన్యం ఇవ్వలేదు. ఐదేళ్లపాటు అధికారంలో ఉన్న సమయంలో ఒక్కసారి కూడా డీఎస్సీ నిర్వహించ లేదు. కూటమి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించి 16 వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే విమర్శలు చేయడం సరికాదు.శవం ఉందంటే ఎగురుకుంటూ వెళ్తాడు..జగన్ కు దేశమంటే భక్తి, గౌరవం లేవు. అందుకే ఆగస్టు 15 న జాతీయ జెండా ఎగురవేసి వందనం చేయలేదు. శవాలు కనిపించినా, నేరాలు చేసే వారు జైల్లో కూర్చొన్న బెంగళూరు నుంచి ఎగురుకుంటూ వెళ్లే జగన్ కు దేశ స్వాతంత్ర్య దినోత్సవం రోజున జెండా వందనం చేయాలని ఎందుకు అనిపించ లేదు. జగన్ లాంటోళ్లకు దేశంలో ఉండే హక్కు లేదు. దళితులపై దాడి చేసిన వారన్నా... బైక్ యాక్సిడెంట్ చేసి ప్రజల ప్రాణాలు తీసిన వారన్నా, యాక్సిడెంట్ కేసుల్ని తప్పుదోవ పట్టించిన వారన్నా ఎక్కడిలేని ప్రేమ చూపించే జగన్ కి అసెంబ్లీకి రావడానికి కుదరడం లేదా? కనీసం ప్రజా ప్రతినిధిగా కూడా కొనసాగే అర్హత లేదు. ఇలాంటి వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశాడా అనే అనుమానం ప్రజలకు వస్తోందని అన్నారు. ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ..ఏడోసారి అసెంబ్లీ సమావేశాలకు పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ దుమ్మా కొట్లారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ ఆయన సమావేశాలకు దూరంగా ఉన్నారు. విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రం పయనిస్తున్న సమయంలో, ఆ అభివృద్ధిని ఓర్వలేక మళ్లీ రాష్ట్రాన్ని విధ్వంసం వైపు మళ్లించేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై నిర్మాణాత్మక సూచనలు చేయాల్సింది పోయి బురదజల్లే రాజకీయాలకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలో 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులను కూటమి ప్రభుత్వం భర్తీ చేస్తే దానిపై అవాకులు చవాకులు పేలడం, భావితరాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయులను చులకనగా మాట్లాడం సరికాదు" అన్నారు.

## పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



**అనంతపురం, ఆగస్టు 17, (ప్రభాతవార్త బ్యూరో)** రాయలసీమలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.ముఖ్యంగా వెనుకబడ్డ రాయలసీమ ప్రాంతంలో ఎల్‌నినో ప్రభావం కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. దీంతో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయిందని కాలవ ఆందోళన వ్యక్తపరిచారు. ప్రకృతిని మనం నియంత్రించలేమని, అయితే ప్రకృతికి అనుగుణంగా వ్యవసాయ విధానాలను మార్చుకుని రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ఇప్పటికే రైతులకు సబ్సిడీపై విత్తనాలను అందించిందని, అయితే సకాలంలో వర్షాలు కురవకపోవడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయిందని తెలిపారు. ప్రస్తుత సీజన్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో సాధారణంగా 3.43 లక్షల హెక్టార్లలో పంటలు సాగు కావాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 1.68 లక్షల హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయన్నారు. సాధారణ విస్తీర్ణంలో కేవలం 49 శాతానికి మాత్రమే పంటల సాగు పరిమితమైందని వివరించారు. సాగు చేసిన పంటలు సైతం వర్షాభావం కారణంగా ఎండిపోతుండటంతో రైతులు పెట్టుబడులు కోల్పోయి తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను సాగు చేసిన రైతుల్లో చాలామంది పంటల బీమాపై ఆధారపడి బీమా చేసుకున్నారని, అయితే పంట పెట్టుబడి, ఆశించిన దిగుబడితో పోలిస్తే బీమా ద్వారా లభించే పరిహారానికి గణనీయమైన వ్యత్యాసం ఉంటుందని పేర్కొన్నారు.

# సాస్కి నిధులు రూ.500 కోట్లతో ఎంజెపిలకు శాశ్వత భవనాలు

- ఆరు బాలికల బీసీ గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్
- బీసీ బాలికల డ్రా పౌట్ల నివారణే లక్ష్యంగా అప్ గ్రేడ్
- కొత్తగా 10 బీసీ గురుకులాలు ఏర్పాటు



ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి సవిత

**విజయవాడ.ఆగస్టు 17,ప్రభాతవార్తప్రతినిధి:** సాస్కి నిధులు రూ.500 కోట్ల తో మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాలు నిర్మించాలని నిర్ణయించామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బీసీ హాస్టళ్లలో మౌలిక దుపాయాలు కల్పిస్తున్నామని, మరమ్మతులకు నిధులు కేటాయించామని తెలిపారు. వర్షా కాల అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మొదటిరోజు సోమవారం శాసనసభలో ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సవిత సమాధానాలిచ్చారు. నాణ్యమైన విద్యను అందిస్తున్న బీసీ గురుకులాలకు విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. రూ.500 కోట్ల సాస్కి నిధులతో ఎంజేపీ బీసీ గురుకులాల భవనాలు నిర్మించాలని నిర్ణయించామన్నారు. ఈ ఏడాది కొత్తగా 10 బీసీ గురుకులాలు స్థాపించామని, వాటిలో 5 రాయలసీమలో, మరో 5 ఉత్తరాంధ్రలో నెలకొల్పామని తెలిపారు. ఆరు బీసీ బాలికల గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేశామన్నారు. బీసీ బాలికల డ్రాపౌట్ల నివారణకు జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేశామన్నారు. 50 మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉన్న బీసీ హాస్టళ్లను గురుకులాల్లో విలీనం చేస్తున్నామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తరవాత ఏపీలో 32 బీసీ గురుకులాలు మాత్రం ఉన్నాయని, 201419 మధ్య 75 బీసీ గురుకులాలను సీఎం చంద్రబాబు ఏర్పాటు చేశారని మంత్రి సవిత గుర్తు చేశారు. వాటిలో 25 ఎంజేపీలకు శాశ్వత భవనాల కోసం రూ.40 కోట్లను ఆనాడు మంజూరుచేయగా, 70 నుంచి 80 శాతం మేర పనులు సైతంపూర్తయ్యాయని అన్నారు. తరవాత వచ్చిన ప్రభుత్వం బీసీ గురుకులాలను పట్టించుకోకుండా గాలి కొదిలేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అసంపూర్తి గా నిలిచిపోయిన భవనాలకు నిధులు మంజూరు చేసిందన్నారు.గోనబావి, మడకశిర, రొద్దం, పులివెందుల సహా పలు ప్రాంతాల్లో ఉన్న గురుకులాల పనులు పున:ప్రారంభించామని, త్వరలోనే వాటిని పూర్తి చేసి బీసీ బిడ్డలకు అంకితం చేస్తామని తెలిపారు. బీసీ హాస్టళ్ల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి.. బీసీ హాస్టళ్లలో90,676 మంది విద్యార్థులుచదువుతున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హాస్టళ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి సవిత తెలిపారు. సీఎస్ఆర్, డిస్ట్రిక్ మినరల్‌ఫండ్స్ ద్వారా హాస్టళ్ల మరమ్మతులుచేపట్టామన్నారు. పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న హాస్టళ్లను వేరే భవనాల్లోకి షిఫ్ట్ చేశామన్నారు. మరికొన్నింటిని గుర్తించామని, వాటిని కూడా త్వరలో షిఫ్ట్ చేస్తామని తెలిపారు. హాస్టళ్లలో మౌలిక వసతులకు అధిక ప్రాధాన్య ఇస్తున్నామని, సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు, ఇనర్వర్టర్లు, దోమ తెరలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎఫ్ఆర్ఎస్ విధానం ప్రవేశపెట్టి వార్డెన్ల, విద్యార్థుల హాజరు శాతాన్ని మెరుగు పరిచామన్నారు. హాస్టళ్లలో పారిశుధ్య నిర్వహణకు 1,291 మంది పారిశుధ్య సిబ్బందిని, 142 మంది కుక్, కమాటీలను నియమించామని తెలిపారు. 202627 బడ్జెట్ లో హాస్టళ్ల మరమ్మతులకు రూ.20 కోట్లు కేటాయించామన్నారు. 2019 24 మధ్య ఆనాటి ప్రభుత్వం హాస్టళ్ల కనీస మరమ్మతులకు, వసతులకు నిధులు కూడా కల్పించలేదని మంత్రి సవిత తెలిపారు. ఎంజేపీలకు రూ.80 కోట్లు కేటాయింపు.. రూ,.9.75 కోట్లతో భీమిలి బీసీ గురుకుల పాఠశాలకు అదనపు భవనం నిర్మిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. భీమిలి బీసీ గురుకుల పాఠశాలకు అదనపు భవనం రూ.9.75 కోట్లతో నిర్మిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. మంత్రి సవిత సమాధానమిచ్చారు. అసంపూర్తిగా నిలిచిన భీమిలి ఎంజేపీ గురుకుల పాఠశాలపై ప్రశ్నకు మంత్రి జవాబునిచ్చారు. త్వరలోనే అదనపు భవన నిర్మాణానికి అనుమతుల మంజూరు చేస్తాం. రాష్ట్రంలో 7080 శాతం మేర ఎంజేపీ భవనాలు అసంపూర్తిగా నిలిచాయి. రూ.80 కోట్లు వెచ్చించి భవన నిర్మాణాలు పూర్తి చేస్తున్నాం. 6 నెలల్లో ఎంజేపీ భవనాలను పూర్తి బీసీ బిడ్డలకు అంకితం చేస్తాం" అని మంత్రి సవిత అన్నారు. రాష్ట్రంలో భీమిలి ఎంజేపీ సహా 70 నుంచి 80 శాతం మేర ఆరు నెలల్లో ఈ ఎంజేపీ భవనాలను బీసీ బిడ్డలకు అంకితం చేస్తామని మంత్రి సవిత తెలిపారు.

# మంత్రుల నడుమ సరస సంభాషణ



**విజయవాడ,ఆగస్టు 17,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల ప్రారంభంలో కూటమి మంత్రుల మధ్య ఆసక్తికర సంభాషణ చోటు చేసుకుంది. ఎపి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బిజెపి కండువాతో శాసనసభలోకి వచ్చారు. ఈ క్రమంలో ఎపి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సరదాగా స్పందించారు. 'సత్యగారూ.. మీకెందుకండి ప్రత్యేకంగా పార్టీ కండువా? మీరు బిజెపి అని ప్రపంచమంతటికి తెలుస్గు గా అంటూ నవ్వుతూ లోకేశ్ చమత్కరించారు. లోకేశ్ వ్యాఖ్యలకు సీనియర్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కూడా జత కలిశారు. 'అవునండీ. జాతీయ స్థాయిలో ప్రముఖ నేతల్లో సత్యకుమార్ కూడా ఒకర్ను అంటూ సత్యకుమార్‌ను ప్రశంసించారు. దీంతో అక్కడి వాతావరణం మరింత ఆహ్లాదకరంగా మారింది. 'మా పార్టీ వారికి కూడా క్రమశిక్షణ గురించి నేర్పించండ్ని అంటూ సత్యకుమార్‌ను ఉద్దేశించి లోకేశ్ సరదాగా వ్యాఖ్యానించారు. ఈ సమయంలో పక్కనే ఉన్న టిడిపి శాసనసభ్యులొకరు 'పార్టీ ఫస్ట్, సర్ని! అని స్పందించారు. దీనికి సత్యకుమార్ యాదవ్ చిరునవ్వుతో సమాధానం ఇచ్చారు. 'నేషన్ ఫస్ట్.. పార్టీ నెక్స్ట్.. సెల్ఫ్ లాస్ట్ని! అని ఆయన పేర్కొన్నారు. సత్యకుమార్ చెప్పిన ఈ మాటలు అక్కడున్న మంత్రులు, ఎమ్మెల్యేలను ఆకట్టుకున్నాయి. దీంతో శాసనసభ ప్రాంగణంలో నవ్వులు పూశాయి. ఈ చతర భాషణంతో రాజకీయ పార్టీల మధ్య ఉన్న స్నేహపూర్వక వాతావరణం, నేతల మధ్య ఉండే అనుబంధం స్పష్టంగా కనిపించింది. బిజెపి జాతీయ కార్యదర్శిగా సత్యకుమార్ రాజకీయ ప్రాధాన్యాన్ని అచ్చెన్నాయుడు ప్రస్తావించారు. అయితే, లోకేశ్ తనదైన శైలిలో చమత్కరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా 'నేషన్ ఫస్ట్.. పార్టీ నెక్స్ట్.. సెల్ఫ్ లాస్ట్ని! అనే సత్యకుమార్ వ్యాఖ్య చర్చనీయాంశంగా మారింది.

# ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకురండి

- జనసేన లెజిస్లేచర్ పార్టీ డిప్యూటీ లీడర్ మంత్రి నాదెండ్ల మనోహర్

**విజయవాడ,ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** అసెంబ్లీ సమావేశాల్లో ప్రజల తరఫున జనసేన బలమైన గొంతు వినిపించాలని జెఎస్పీ లెజిస్లేచర్ పార్టీ డిప్యూటీ లీడర్ ,మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేసారు.అసెంబ్లీ జరిగే ప్రతి నిమిషం విలువైనదే. ప్రజలకు సంబంధించిన సమస్యలను, ఇబ్బందులను ప్రజాప్రతినిధులుగా బాధ్యతగా సభ ముందుకు తీసుకురావాలన్నారు.వివిధ అంశాలపై జరిగే చర్చల్లో జనసేన పార్టీ ప్రజాప్రతినిధులంతా పాల్గొనాలన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర జ్వరం ఉండటం మూలంగా సభకు హాజరు కాలేకపోతున్నారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి అందించే సూచనలు అనుసరిస్తూ సభా కార్యక్రమాలలో పాలుపంచుకుందాము అన్నారు. శాసనసభ వర్షకాల సమావేశాలు సోమవారం మొదలైన సందర్భంగా సభలో జనసేన పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, సభ్యులు వ్యవహరించాల్సిన తీరుపై జనసేన లెజిస్లేచర్ పార్టీ సమావేశాన్ని మంత్రి శ్రీ కందుల దుర్గేష్ ఎమ్మెల్సీ నాగబాబు గారితో కలిసి మనోహర్ సోమవారం అసెంబ్లీలోని జేఎల్పీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ"ప్రజల సమస్యలను సభ దృష్టికి తీసుకురావడం ద్వారా పరిష్కారం దొరుకుతుంది. ఉప ముఖ్యమంత్రిపవన్ కళ్యాణ్ మార్గదర్శకంలో సభలో జనసేన సభ్యులందరం హుందాగా, క్రమశిక్షణగా నడుచుకోవాలి. చర్చ సందర్భంగా ప్రతి విషయం మీద లోతుగా అధ్యయనం చేసి సభలో మాట్లాడాలి. అలాగే నియోజకవర్గాల్లోని ప్రధాన సమస్యలను పరిష్కరించేలా ప్రజల గళం కావాలి. రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావం రాష్ట్రంపై ఉండే అవకాశం కనిపిస్తోంది. నియోజకవర్గాల్లో తాగునీటి సమస్య, సాగునీటి సమస్యలను సభలో చర్చించేందుకు సమాయత్తం కావాలి. ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా పనిచేయాలి. వివిధ కీలక అంశాల మీద సభలో జరిగే చర్చలో జనసేన పార్టీకి కేటాయించే సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మండలి సమావేశాలకు వైసీపీ వచ్చినా, సభను సజావుగా జరగకుండా అడ్డుపడటమే వారి ఉద్దేశంగా కనిపిస్తోంది. అక్కడ కూడా ప్రజా సమస్యలను ప్రస్తావించాలి. అన్ని చర్చల్లో పాల్గొవాలి. శాసనసభ, మండలి జరిగే అన్ని రోజుల్లో జీరో అవర్ నుంచి ప్రశ్నోత్తరాలకు, చర్చలకు జనసేన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందుబాటులో ఉండాలి అని సూచించారు. సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# అసెంబీలో ఆరుగురు ప్యానల్ స్పీకర్‌లు

**విజయవాడ, ఆగస్టు 17, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ శాసనసభలో కొత్తగా ఆరుగురు సభ్యులను ప్యానల్ స్పీకర్‌లు నియమించారు. వీరిలో సీనియర్ సభ్యులు మండలి బుద్ధప్రసాద్, జ్యోతుల నెహ్రూ, విష్ణుకుమార్‌రాజు, కోళ్ళ లలితకుమారి, వరదరాజులు రెడ్డి, దాసరి సుధలను ప్యానల్ స్పీకర్లుగా నియమించారు. ప్యానల్ స్పీకర్‌లుగా నియమితులయిన వీరిని సహచర శాసనసభ్యులు అభినందించారు. **మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ పదవికి నోటిఫికేషన్ :** శాసనమండలిలో ఖాళీగా ఉన్న డిప్యూటీ చైర్‌పర్సన్ పదవికి నోటిఫికేషన్ జారీ చేసారు. ఈనెల 18వతేదీ నామినేషన్‌లు స్వీకరించి, 19 వతేదీ ఎన్నికలు నిర్వహించనున్నారు. మండలిలో వైసిపికి మెజార్టీ సభ్యులు ఉన్నందున ఈపదవి వైసిపికే దక్కనుంది. డిప్యూటీ చైర్‌పర్సన్ పదవికి వైసిపి తమ అభ్యర్ధిగా మాధవరావును ఇప్పటికే ఖరారు చేసింది. దీంతో మాధవరావు ఎన్నిక లాంఛనం కానుంది.

# అసెంబ్లి సమావేశాలు

## పురపాలక శాసనముల మూడో సవరణ బిల్లుకు ఆమోదం

**విజయవాడ,.ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనముల మూడో సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. మంత్రి నారాయణ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టగా.. స్వల్ప చర్చ అనంతరం సభ ఆమోదించింది. ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేయడంతో పాటు, మున్సిపల్ రికార్డుల్లో యజమాని పేరు మార్పు ప్రక్రియను వేగవంతం చేసేలా ప్రభుత్వం ఈ సవరణలు చేసింది.ప్రస్తుతం ఆస్తి రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత మున్సిపాలిటీల్లో యజమాని పేరు నమోదు కోసం విడిగా మ్యుటేషన్ ప్రక్రియ చేపట్టాల్సి వస్తోంది. ఇకపై రిజిస్ట్రేషన్ జరిగే సమయంలోనే మున్సిపల్ రికార్డుల్లోనూ యజమాని పేరు ఆటోమేటిక్‌గా మారేలా వ్యవస్థను అనుసంధానం చేయనున్నారు. రిజిస్ట్రేషన్ సమయంలోనే మ్యుటేషన్ ఫీజు చెల్లించేలా చట్టంలో మార్పులు చేశారు. అలాగే కార్పొరేషన్లు, గ్రేడ్‌ల వారీగా ఉన్న మున్సిపాలిటీల్లో మ్యుటేషన్‌కు ఏకీకృత ఫీజులు అమలు చేసేలా సవరణలు తీసుకొచ్చారు. దీంతో ఆస్తుల బదలాయింపు ప్రక్రియ మరింత సులభంగా, వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంది.

## 20 వరకు అసెంబ్లీ సమావేశాలు

**సచివాలయం,ఆగష్టు 17,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ (బిఏసి) సమావేశం సోమవారం అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగింది.సభాపతి అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,మంత్రులు పయ్యావుల కేశవ్,నాదెండ్ల మనోహర్,ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు,జి.వి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో అసెంబ్లీ సమావేశాల నిర్వహణ,షెడ్యూల్ ఖరారుపై ప్రధానంగా చర్చించారు.బిఏసి నిర్ణయం మేరకు..ఈనెల 20వ తేది వరకు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి.మొత్తం నాలుగు రోజులుపాటు ఈ సమావేశాలను నిర్వహించాలని బిఏసి సమావేశంలో అధికారికంగా ఖరారుచేశారు.

## ప్రైవేట్ అసోసియేషన్లకు నిబంధనల ప్రకారం భూకేటాయింపునకు అనుమతి లేదు



**విజయవాడ,ఆగస్టు16,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రైవేట్ అసోసియేషన్లకు నిబంధనల ప్రకారం ప్రైవేట్ అసోసియేషన్లకు అమరావతిలో భూకేటాయింపునకు అనుమతి లేదు. బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సీఆర్‌డీఏను 5 ఎకరాల భూమి కోరింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అమరావతిలో భూకేటాయింపు నిబంధనలు. టాయింపునకు 6 మోడల్స్‌తో రూల్స్, 5 మోడల్స్‌తో రెగ్యులైజేషన్స్. జీవో 228లోని రూల్ 5 ప్రకారం భూకేటాయింపునకు అవకాశం లేదని నారాయణ వివరించారు,. జీఓ 229 క్లాజ్ 6.5 ప్రకారం కూడా భూమి కేటాయింపు సాధ్యం కాదు. ప్రైవేట్ అసోసియేషన్లకు అమరావతిలో భూకేటాయింపునకు అనుమతి లేదు. నామినేషన్, దరఖాస్తు ప్రాతిపదికన భూకేటాయింపునకు అనుమతి లేదు. నిబంధనల ప్రకారం బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్‌కు భూమి కేటాయించలేదు "అని మంత్రి నారాయణ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.ల్యాండ్ పూలింగ్ భూమిలో 98 శాతం మేర ప్లాట్లు కేటాయింపు. అసెంబ్లీలో కీలక వివరాలు మంత్రి నారాయణ వెల్లడించారు. అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభం తర్వాత ప్రాజెక్టుల పరిస్థితి, నిధులు, రైతుల ప్లాట్లపై మంత్రి నారాయణ వివరాలు వెల్లడించారు. సభ్యులు శ్రావణ్ కుమార్, బుచ్చయ్య చౌదరి ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. అమరావతిలో 119 మౌలిక వసతుల ప్రాజెక్టులకు గాను, 113 ప్రాజెక్టులకు లెటర్ ఆఫ్ అప్రూవల్ జారీ చేశారన్నారు. 97 ప్రాజెక్టులకు గాను నాలుగు పూర్తి కాగా, పురోగతిలో 93 ప్రాజెక్టులు ఉన్నాయని వివరించారు. మొత్తం రూ.41,187.70 కోట్ల రుణం సమకూర్చుకోబడిందని తెలిపారు. "ప్రపంచ బ్యాంకు, హడ్కో, నాబార్డ్, ఎన్ఏబీఎఫ్ఐడీ, ఏపీపీఎఫ్‌సీ ద్వారా రుణం. 2024 నుంచి ఇప్పటివరకు రూ.12,731.13 కోట్లు ఖర్చు. అమరావతిలో 119 పనులకు రూ.66,802 కోట్లు ఖర్చవుతుంది. ప్రస్తుతం 103 పనులకు రూ.58,093 కోట్లు ఖర్చవుతుంది. గత ప్రభుత్వం పనులు నిలిపివేయడంతో 25 శాతం ఖర్చు పెరిగింది. ల్యాండ్ పూలింగ్ భూమిలో 98 శాతం మేర ప్లాట్లు కేటాయింపు. 30,173 మంది రైతులకు 71,299 రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు. 2014 నుంచి ఇప్పటివరకు రైతులకు రూ.2,248.02 కోట్ల మేర కౌలు చెల్లించాం. 29 గ్రామాల్లో రూ.904 కోట్లతో మౌలిక వసతుల కల్పన. ఆయా పనులకు ఆగస్టు 27న టెండర్లు ఖరారు చేస్తున్నాం. రాజధాని గ్రామాల్లో ఆర్ అండ్ బీ రోడ్ల పనుల ఆలస్యం వాస్తవమే. ఆర్ అండ్ బీ మంత్రితో చర్చించి పనులు వేగవంతం చేశాం" అని మంత్రి నారాయణ అన్నారు.

## డిఎస్సీలో జరిగిన అవకతవకలపై చర్చకు వైకాపా సభ్యుల డిమాండ్

**సచివాలయం,ఆగష్టు 17,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 50వ శాసనమండలి మొదటి రోజు సోమవారం 10గంటలకు రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అధ్యక్షతన శాసనమండలి ప్రారంభమైంది.డిఎస్సీ 2025లో జరిగిన అవకతవకలపై చర్చించాలని వైసీపీ ఎమ్మెల్సీలు డాక్టర్ చంద్రశేఖర్,కల్పలతా,ఎం.వి.రామచంద్రరెడ్డి ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరించి ప్రశ్నోత్తరాలు కార్యక్రమాన్ని మండలి చైర్మన్ కొనసాగించారు. పీఎన్‌జి కనెక్షన్ల గురించి సభ్యులు అడిగిన ప్రశ్నకు మౌలిక సదుపాయాలు,పెట్టుబడుల శాఖ మంత్రి సి.జనార్ధన్‌రెడ్డి సమాధానమిచ్చారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి పైప్డ్ నేచురల్ గ్యాస్ (పిఎన్‌జీ) కనెక్షన్లను అందించాలని ప్రభుత్వం ప్రతిపాదించిన విషయం వాస్తవమేనని,దీనిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 30,96,668గృహ వినియోగ పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్లు అందించడం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. అంతేకాకుండా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సిజిడి) సంస్థలు సమర్పించిన నివేదికల ప్రకారం 13,08.2026నాటికి ఆంధ్రప్రదేశ్ 90,013గ్యాస్ వినియోగ పైప్డ్ న్యాచురల్ గ్యాస్ కనెక్షన్లు అందించడం జరిగింది.మిగిలిన కనెక్షన్లను ఇచ్చే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. పోర్టుల ప్రైవేటీకరణ గురించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు మౌలిక సదుపాయాలు,పెట్టుబడుల శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి సమాధానమిచ్చారు.

## గిరిజనుల భూములను కాపాడటం ప్రభుత్వ బాధ్యత - సంధ్యారాణి

**విజయవాడ, ఆగస్టు17,ప్రభాతవార్తప్రతినిధి:** గిరిజనుల భూముల రక్షణకు కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు. 1/70 చట్టాన్ని రద్దు చేస్తామంటూ ప్రతిపక్షం చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని తెలిపారు. గిరిజనులను మభ్యపెట్టి, భయపెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రి మాట్లాడుతూ.. గిరిజనుల భూ సంరక్షణ కోసం అమల్లో ఉన్న 1/70 చట్టాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. గిరిజనులు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, వారి భూములకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అసెంబ్లీలో గిరిజనుల సమస్యలపై ప్రశ్నలు వేసి, సమాధానాలు వినేందుకు సభకు రాకుండా బయట గిరిజనులను రెచ్చగొట్టడం ఎంతవరకు సమంజసమని మంత్రి ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో చర్చకు రావాలని సూచించారు. టీచర్లు పాఠాలు చెప్తాం.. గుణపాఠాలు కూడా నేర్పుతాం" అంటూ ర్యాలీలు చేస్తున్న వైసిపి పార్టీ నాయకులు ముందుగా తమ గత పాలనను గుర్తు చేసుకోవాలి అని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని చెప్పడం చిన్నపిల్లలకు చాక్లెట్ ఇవ్వకపోతే మారాం చేసినట్టుగా ఉందని మంత్రి ఎద్దేవా చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన సంక్షేమంపై తీవ్ర నిరక్ష్యం జరిగిందని మంత్రి ఆరోపించారు. ఐటీడీఏలను నిర్వీర్యం చేయడంతో పాటు గిరిజనుల కోసం అమలవుతున్న 18 పథకాలను నిలిపివేశారని విమర్శించారు"గురివింద గింజ తన కింద నలుపు ఎరుగదు అన్నట్టు వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారు" అని మంత్రి అన్నారు.



## మౌత్‌వాష్ లిక్విడ్‌లతో జాగ్రత్త !

మామూలుగా మనం నోటి శుభ్రత కోసం మౌత్‌వాస్ లిక్విడ్‌లు వాడుతుంటాం. అందులోనూ ఆల్కహాల్ బేస్డ్‌వి వాడే అమ్మాయిల సంఖ్యా ఎక్కువే. ఈ లిక్విడ్‌లోని హానికర రసాయనాలు మన ఆరోగ్యానికి చేటు చేస్తాయట. దీన్ని 3 నెలలపాటు తరచూ వాడితే..చిగుళ్ల సమస్యలతోపాటు పేగు క్యాన్సర్లూ వచ్చే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నారు. సాధారణంగా మన నోట్లో మంచీ, చెడూ రెండు రకాల బ్యాక్టీ రియా ఉంటుంది. అయితే, ఈ లిక్విడ్‌లోని హానికర రసాయనాలు జీర్ణ క్రియకూ, నోటి శుభ్రతకూ ఉపయోగపడే కీలకమైన ఓరల్ మైక్రోబయోమ్ లను నాశనం చేస్తాయట. అంతేకాదు, బిపిని నియంత్రించే యాక్టినో బ్యాక్టీరియా కూడా ఈ ఆల్కహాల్ మౌత్‌వాష్ వాడకం వల్ల తగ్గిపోతుందట. కాబట్టి, అవి కొనేముందే ఎటువంటి రకాలో చూసి కొనడం ఉత్తమం.

## చర్మకాంతికి తేనె !



తేనె వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయన్న విషయం తెలిసిందే. ఆరోగ్యానికే కాదు.. సౌందర్య పరిరక్షణలోనూ తేనె ఎంతగానో ఉపయోగపడుతుంది. మరి అదెలాగో తెలుసుకుందాం ..

కాలి గాయాల పైన తేనెను పూయడం నల్లమచ్చలు పడవు. మొటిమల మీద తేనెను రాయడం వల్ల అతి త్వరగా తగ్గుతాయి. తేనె రాయడం వల్ల మొటిమల మచ్చలు చర్మపు రంగులో కలిసిపోతాయి. . తేనె చర్మకాంతిని పెంచడమే కాకుండా చర్మంలో తేమ ఉండేలా చేసి మృదువుగా మారుస్తుంది. అంటే చక్కటి మాయిశ్చరైజర్‌గా ఉపయోగపడుతుందన్న మాట. . మోచేతులు, మోకాళ్ల దగ్గర చర్మం పల్లగా మారిందా..? తేనెను పూయడం వల్ల ఈ నలుపు తగ్గి మృదువుగా మారుతుంది. పరగడుపున తేనె, నిమ్మరసం కలిపి తీసుకోవడం వల్ల త్వరగా సన్నబడే అవకాశాలు ఎక్కువ. రోజూ తేనెను తీసుకోవడం వల్ల రక్తశుద్ధి జరిగి చర్మం కాంతులీనుతుంది.

**ఇవి కూడా...** తేనె జుట్టుకు సహజ కండిషనర్‌గా ఉపయోగపడుతుంది. తేనె, ఆలివ్ ఆయిల్ కలిపి జుట్టుకు పట్టించి అరగంట తర్వాత తల స్నానం చేయడం వల్ల జుట్టు పట్టులా మెరుస్తుంది. తలస్నానం చేసేముందు తేనె, పాలు కలిపి తలకు పట్టిస్తే జుట్టు ఒత్తుగా, ఆరోగ్యంగా తయారువు తుంది. టీ, కాఫీ,జ్యూస్, స్వీట్స్, సలాడ్స్‌లో చక్కెరకు బుదులుగా తేనెను వాడొచ్చు. దీనివల్ల బరువు తగ్గే అవకాశా లుంటాయి.



**వయసులో పని ఏముంది? మనసులోనే అంతా ఉంది !**

## ధైర్యే సాహసే 'కౌర్' పట్టు'బిగించారు !

ఇదేదో తెలుగు సినిమాలో పాటలా ఉందే ? ఎప్పుడో విన్నట్టులా ఉందే? ఔను అది నిజం. కానీ 'విద్యాకౌర్' విషయంలో అదే నిజమైంది. "కారు డ్రైవింగా? మీరా? ఈ వయసులోనా? అదేం కుదరదు. 59 ఏళ్ల వయసులో మీకు కారు నేర్పడం' మా వల్ల కాదని డ్రైవింగ్ కోచింగ్ సెంటర్‌కి వెళ్లిన విద్యాకౌర్‌కు ఎదురైన సమాధా నం. అయినా ఆమె పట్టు వదల్లేదు. పట్టుదలతో ముందు కు సాగింది. ఇప్పుడామెకు 72 ఏళ్ల అయినా ఎంచక్కా కారు డ్రైవింగ్ చేసుకుంటూ చలాకీగా ట్రాఫిక్ రద్దీలో ఎన్ని ఆటంకాల నైనా ఎదురొడ్డి తన కారుతో పెద్ద పెద్ద రోడ్ల మీద నుంచి దూసుకు పోతుంటారు. తాను కోచింగ్ కోసమని వెళ్లినపుడు డ్రైవింగ్ అబ్బాయి ఇంత పెద్ద వయసులో నీకెలా? మేం నేర్పలేమంటూ ముఖం మీదనే చెప్పేవాడు. ఆమె జీర్ణించుకోలేకపోయింది. పంతం పట్టి సొంత కారు కొనుక్కుంది. అంతటితో ఆమె ఆగిపోలేదు. పక్కింటి వారిని బతిమాలితే ఆమెకు ఎలాగోలా కారు డ్రైవింగ్ నేర్పారు. వయసు కాదు. మనసు కౌర్. దానివేగం ముఖ్యం. అనుకున్నందునే తాను నడిరోడ్డు మీద జనాభా మధ్యలోంచి కారును అలలోకగా నడుపుకుని వెళ్లిపోతోంది. ఆమె ఓ పాఠశాల ప్రిన్సిపాల్‌గా నాలుగు దశాబ్దాలపాటు ఎందరో విద్యార్థులకు పాఠాలు బోధించారు. యువత భవితను తీర్చిదిద్దడంలో పలువురి ప్రశంసలు అందుకున్నారు. ఒకసారి నిరుత్సా హానికి గురైతే ఎంతటి వారి మనసైనా కాస్త వెనక్కిలాగుతుంది. కానీ 'విద్యాకౌర్' అలాంటివేమీ లెక్క చేయలేదు. ఆనాటి తిరస్కరణ ఆమెలో ఆత్మ విశ్వాసాన్ని పెంచింది. ఉల్లాసపరిచింది. ప్రాథమికంగా వాహన చోదకతను గూర్చి తెలుసుకుంది. క్లచ్‌ను పట్టుకోవడం, గేర్లు మార్చడం, ఎదురొచ్చే వాహనాలను తప్పించు కుంటూ స్టీరింగ్ అదుపులో ఉంచుకోగలగడంతో ధైర్యం మరింత పెరిగింది. కారు స్టీరింగ్ పట్టుకుని అలా.. అలా.. ముందుకురుకుతూనే జమ్మునగరాన్ని చుట్టి వచ్చేస్తోంది. 19 ఏళ్లకే విద్యాకౌర్ గృహస్థాశ్రమంలోకి చేరింది. యువతకు విద్యా బుద్ధులు నేర్పే పనిలో నలభై వత్సరాలకు పైగా వేలాదిమంది విద్యార్థులను ఉన్నత చదువులకు తయారు చేసారు. ఆమె ఇప్పుడు కారు డ్రైవింగ్‌లో కూడళ్ల దాటగలదు. ఇరుకిరుకు సందుల్లోనూ కారు మలుపు తప్పించి మరో చోటికి వెళ్లడంలో ఇప్పుడు ఆమెను మించిన వారు లేరు. కలలు కల్లలు కాకుండా సంకల్పం చెప్పుకుంటే జీవితం వాటిని సాధించు కుంటూ ముందుకు సాగిపోవడమంటే ఇదే.

## హనుమకు ప్రదక్షిణలు



హనుమంతుడు ఎంతటి పరాక్రమవంతుడో.. అంతటి వినయ సంపన్నుడు. అష్ట సిద్ధులు తెలిసిన బుద్ధిశాలి. శ్రీరామ అంటే ఆయనకంటే ముందుగా పలికే భక్తాగ్రేసరుడు. అలాంటి హనుమంతుడిని అంకిత భావంతో సేవిస్తే చాలు కరిగిపోతాడు. ఆకుపూజ చేయించి .. తీపి అప్పాలు నైవేద్యంగా సమర్పిస్తే చాలు పొంగిపోతాడు. ఇక తన నామాన్ని స్మరిస్తూ ప్రదక్షిణలు చేసే భక్తుల కోరికలు నెరవేర్చడానికి ఆయన ఎంత మాత్రం ఆలస్యం చేయడు. అనారోగ్యం తో బాధలు పడుతున్నవారు .. దుష్ట శక్తుల వలన పీడించబడుతున్నవారు .. గ్రహ దోషాలచే అవస్థలు పడుతున్నవారు .. తలపెట్టిన కార్యాలు పూర్తికాక ఇబ్బందులు పడుతున్నవారు .. హనుమంతుడికి అనునిత్యం ప్రదక్షిణలు చేయడం వలన ఆశించిన ఫలితం వెంటనే కనిపిస్తుంది. అనునిత్యం ప్రదక్షిణలు చేయడం కుదరని పక్షంలో ప్రతి మంగళవారం చేసినా మంచి ఫలితం కనిపిస్తుంది. హనుమంతుడిని పూజిస్తే సమస్త దేవతలను ఆరాధించినట్టే .. ఆయా దేవతల అనుగ్రహాన్ని పొందినట్టే అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## మందారం విరబూచేలా..



మన ముంగి ట్లో మొక్కలెన్ని ఉన్నా.. మందారం ప్రత్యేకం. రకరకాల వర్ణాలు, ఆకృతుల్లో.. పెద్ద పెద్ద పూలతో నిండుగా విరబూస్తుంది. నేలలోనే కాదు కుండీ ల్లోనూ చక్కగా విరబూ స్తుంది. మరి దీన్నెలా పెంచాలో చూద్దామా..

ఈ మొక్క ఉష్ణ సమశీతోష్ణ మండల వాతావరణంలో సులువుగా ఎదుగుతుంది. మందారాన్నే దీన్ని చైనీస్ రోజ్ అని కూడా అంటారు. దీని శాస్త్రీయ నామం.. హైబిస్కస్ రోజా సైనేన్సిస్. ఇది ఎరుపు, పసుపు, తెలుపు, కాషాయం, గులాబీ.. ఇలా బోలెడు రంగులు, వివిధ ఆకృతుల్లో చెట్టు నిండా పూలతో కనువిందు చేస్తుంది. ఈ పూలలోని మకరందం కోసం సీతాకోక చిలుకలు, హమ్మింగ్ బర్డ్స్ దీనిపై వాలుతూ మరింత ఆకర్షణ తెస్తాయి. ఈ పువ్వు, ఆకుల్లో ఔషధ గుణాలెన్నో అందుకే ఆయుర్వేద వైద్యంలో విరివిగా వాడతారు. మందార మొక్కకు ఆరు నుంచి ఎనిమిది గంటల పాటు నేరుగా సూర్యరశ్మి తగిలేచోట నాటు కోవాలి. కుండీల్లో పెంచాల నుకున్నప్పుడు మూడొంతుల ఎర్రమట్టికి ఒక వంతు వర్మీ కంపోస్ట్, రెండు టేబుల్ స్పూన్ల వేపపిండి కలిపి కుండీల్లో నింపు కోవాలి. నేలలో పిహెచ్ బ్యాలెన్స్ చేసేందుకు వేర్ల దగ్గర మట్టిని గుల్లచేసి రెండు చెంచాల ఎప్సమ్ సాల్ట్ వేయాలి. ఇలా నెలకో సారి చేస్తే సరి. లేదంటే నిమ్మతొక్కల పొడి, వెనిగర్ వంటివీ చల్లుకోవచ్చు. పూలు ఎక్కువగా రావాలంటే మాత్రం ప్రతి పదిహేను రోజులకోసారి 16:16:16 ఆల్‌పర్పస్ ప్లాంట్ ఫుడ్‌ని అందించాలి. పొటాషియం ఎక్కువగా ఉన్న ఎన్‌పికె ఎరువునీ ఈ కాలంలో వాతావరణంలో వేడి ఎక్కువగా ఉంటుంది కాబట్టి రెండు పూటలా నీళ్ల అందించాలి. ఈ మొక్కకు చీడపీడల సమస్య ఎక్కువ. తెల్లతోమ, పేనుబంక, బూడిద తెగులు వంటివి కనిపిస్తాయి. ప్రారంబ దశలో వ్యాధిని గుర్తిస్తే ఆకుల్ని కత్తిరించి దూరంగా పడేయాలి. లేదంటే సబ్బునీళ్లతో బలంగా మొక్కపై నీళ్లను చల్లడం వల్లా ఉపయోగం ఉంటుంది. ఈ మొక్కల ముదురు కాండాలను కణుపుల వరకూ కత్తిరించి అంటుకట్ట కుని కూడా పెంచొచ్చు.

## రసం పొడి



మనలో చాలా మందికి పప్పుచారు అంటే ఎంత ఇష్టమో రసం కూడా అంతే ఇష్టం. ముఖ్యంగా తమిళుల రసం మరీ మరీ బాగుంటుంది. అయితే రసం పౌడర్ బయట కొనుక్కోవాల్సిన అవసరం లేకుండా ఇంట్లోనే సులువుగా చేసుకోవచ్చు. **కావలసినవి:** కందిపప్పు, శనగపప్పు, జీలకర్ర మిరియాలు పావు కప్పు చొప్పున, ధనియాలు అర కప్పు, ఏడెనిమిది ఎండు మిరపకాయలు, ఇగువ, పసుపు చెంచా చొప్పున తీసుకుంటే పావు కిలో రసం పొడి తయారవుతుంది.

**తయారీ:** ముందుగా శనగ, కందిప్పులపు వేయించి తీయాలి. అదే కడాయిలో ధనియాలు వేయించాలి. అవి తీసి జీలకర్ర, తర్వాత మిరియాలు వేయించాలి. ఆ తర్వాత మిరప కాయలు, కరివేపాకు కలిపి వేయించాలి. ఇలా ఒకదాని తర్వాత ఒకటిగా వేయించాలి. చల్లారాక మిక్సీ జార్‌లో వేయాలి. వాటికి ఇంగువ, పసుపు జతచేసి గ్రైండ్ చేయాలి. అంతే రసం పొడి తయారైపోతుంది. దీన్ని తడి లేని, గాలి చొరబడని సీసాలో నిలువ చేసుకుంటే క్షణాల్లో ఘుమఘుమలాడే రసం ఏసుకోవచ్చు. రసం నోటికి హితవుగానూ ఉంటుంది. తిన్నది తేలిగ్గా జీర్ణం అవుతుంది .

# తెర

## 'ఇరుముడి' గ్రాండ్ ప్రి రిలీజ్ ఈవెంట్



మాస్ మహారాజా రవితేజ మోస్ట్ అవైటెడ్ మూవీ ఇరుముడ్డి ఆగస్టు 21న థియేటర్లలో విడుదల కా నుంది. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ డి ఫ్రరెంట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో రవితేజ మాట్లాడుతూ.. మా ప్రొడక్షన్ డిజైనర్ సాహి సురేష్, ఎడిటర్ ప్రవీణ్ పూడి, డీఓపీ విష్ణు శర్మ ఈ సినిమాను ఎంతో ఓన్ చేసుకుని పనిచేశారు. అందరూ తమ సొంత సినిమా అనుకుని పనిచేశారు. విష్ణు శర్మ ఎక్స్‌ట్రార్డినరీ కెమెరామెన్. నాకు, శివ నిర్వాణకు తోడుగా తను కూడా పరిగెత్తాడు. ఫెంటాస్టిక్ వర్క్ ఇచ్చాడు. డైరెక్టర్ శివ నిర్వాణ మాట్లాడుతూ.. 'మల్లెపూల పల్లకి'పాట వెనుక చాలా శ్రమ ఉంది. ఈ పాట ఒరిజినల్ కంపోజర్స్, సింగర్స్‌ను పిలిచి వాళ్లతోనే చేయించడం జరిగింది. ఈ పాట థియేటర్‌లో ఒక తాండవంలా ఉంటుంది. నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ.. ఇరుముడి అయ్యప్ప స్వామి మాల వేసుకున్న ఒక భక్తుడి బ్యాక్‌గ్రౌండ్‌లో సాగే థ్రిల్లర్. అదే సమయంలో ఇది ఒక ఎమోష నల్ రైడ్. అద్భుతమైన కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను ఎక్స్‌ట్రార్డినరీగా తెరకెక్కిం చారు మా డైరెక్టర్ శివ నిర్వాణ. సినిమా అనుకున్న దానికంటే చాలా అద్భుతంగా వచ్చింది. . డైరెక్టర్ బాబీ కొల్లి మాట్లాడుతూ.. చిరంజీవి సినిమా షూటింగ్‌లో ఉన్నాను. రవితేజ ఫంక్షన్ అంటే పది నిమిషాల ముందే పంపించే శారు. రవితేజ 2014 లో 'పవర్' సినిమాతో నన్ను దర్శకుడిని చేశారు. మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాష్ కుమార్ మాట్లాడుతూ: ఇరుముడి నాకు చాలా స్పెషల్ ప్రాజెక్ట్. శివ నిర్వాణ అద్భుతంగా బాధ్యతతో చేసిన సినిమా ఇది. హీరోయిన్ ప్రియా భవానీ శంకర్ మాట్లాడుతూ: ముందుగా మా డైరెక్టర్ శివ నిర్వాణకి థాంక్యూ. నాకు కావేరి లాంటి గొప్ప పాత్రను ఇచ్చారు. బేబీ నక్షత్ర మాట్లాడుతూ.. ఇది తెలుగులో నాకు ఫస్ట్ సినిమా. ముఖ్యమైన పాత్ర పోషించినందుకు చాలా ఆనందంగా ఉంది. డైరెక్టర్ బుచ్చిబాబు సనా మాట్లాడుతూ: రవితేజ సినిమాలు చూస్తూ పొంది ఇండస్ట్రీకి వచ్చాను. నేను రాసుకున్న మొదటి కథ కూడా ఆయన కోసమే రాసుకున్నాను. డైరెక్టర్ సాయి రాజేష్ మాట్లాడుతూ: కలర్ ఫోటో సినిమా సమయంలో రవితేజ గారు మమ్మల్ని ఎంకరేజ్ చేశారు. బేబీ సినిమా విషయంలో ఆయన చేసిన ట్వీట్ మాకు ఎంతో హెల్ప్ అయ్యింది.డైరెక్టర్ రాహుల్ సాంకృత్యన్ మాట్లాడుతూ: శివ అండ్ టీమ్‌కి కంగ్రాట్యులేషన్స్. ఇలాంటి అందమైన పదాన్ని సినిమా టైటిల్‌గా పెట్టడం చాలా ఆసక్తికరంగా ఉంది.

## 'ఆస్మాన్' ఫస్ట్ లుక్ పోస్టర్ లాంచ్



శ్రీమతి. కొండారు శ్రీనివాసరావు సమర్పణలో శ్రీ క్లీంకార సెల్యూలాయిడ్ బ్యానర్ మీద మేఘాంశ్ శ్రీహరి హీరోగా రామ్ నందన్ తెరకెక్కి స్తున్న చిత్రం 'ఆస్మాన్'. ఈ సినిమాని వెంకటేష్ కొండారు, శ్రీకాంత్ మన్నెం నిర్మిస్తున్నారు. ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, అరబిక్ భాషల్లో రూపొందుతోంది. స్వర్గీయ నటుడు శ్రీహరి జయంతి సందర్భంగా మూవీ ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ను శనివారం నాడు రిలీజ్ చేశారు. .. శాంతి శ్రీహరి మాట్లాడుతూ.. .. మేఘాంశ్ మీద నమ్మకంతో 'ఆస్మాన్' చేసేం దుకు ముందుకు వచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. మేఘాంశ్‌ని కూడా పగలు, రాత్రి అన్న తేడా లేకుండా వర్క్ చేయిస్తున్నారు. శ్రీహరి గారు కూడా అలానే నటించేవారు. ఆర్టిస్టులు ఎప్పుడూ అలానే కష్టపడి నటించాలి. మేఘాంశ్‌ని అద్భుతంగా చూపిస్తున్న రామ్ నందన్‌కి థాంక్స్. హీరో మేఘాంశ్ శ్రీహరి మాట్లాడుతూ.. 'ఆస్మాన్' చిత్రంలో అవకాశం ఇచ్చిన నిర్మాతలకు థాంక్స్. రామ్‌తో వర్క్ చేయడం ఓ గొప్ప ఎక్స్‌పీరియెన్స్. సెట్‌లో ఎప్పుడూ ఓ పండుగ వాతావరణం కనిపించేది. రాయంచ మా చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. దర్శకుడు రామ్ నందన్ మాట్లాడుతూ.. 'ఆస్మాన్' మూవీతో అందరికీ ఓ కొత్త ఎక్స్‌పీరియెన్స్ ఇస్తుంది. థియేటర్లో అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన నిర్మాత వెంకట్ గారు, హీరో మేఘాంశ్‌కి, విజువల్స్ ఇచ్చిన షోయబ్‌కి థాంక్స్. నిర్మాత వెంకటేష్ మాట్లాడుతూ.. 'ఆస్మాన్' పోస్టర్ అద్భుతంగా ఉంది. నాకు పోస్టర్ చూస్తుంటే మాత్రం ఫుల్ ఎనర్జిటిక్‌గా అనిపిస్తోంది. మేఘాంశ్‌ది ట్రాన్స్‌ఫార్మర్‌లాంటి బాడీ. మేఘాంశ్ యాక్టింగ్ చూసి అందరం ఆశ్చర్యపోయే వాళ్లం. సెట్‌లో అందరి కంటే ముందుంటాడు. రియల్ స్టార్ కొడుకు అంటే ఇలానే ఉంటాడనిపించేలా ఉంటాడు.

## 'అమీర్ లోగ్' ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా ఉంది: దర్శకుడు రమణా రెడ్డి సోమ



**మీ నేపథ్యం గురించి చెప్పండి?..**
మాది నల్గొండ జిల్లాలోని రాఘవపురం. 1997లోనే ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కి వచ్చాను. జేఎన్టీయూలో ఆర్కిటెక్ట్ చదివాను. ఆ టైంలోనే ఎక్కువగా సినిమాలు చూస్తుండేవాడ్ని. 2007లోనే ఆఫీస్ స్టార్ట్ చేశాను.

**సినిమాలు తీయాలనే ఆలోచన ఎలా వచ్చింది?..**
కథలు రాయడం, చదవడం నాకు చాలా ఇష్టం. ఆరేడేళ్ల నుంచి కథల నుంచి రాయడం ప్రారంభించాను. నా సొంత అనుభవాలు, చూసిన వాటి నుంచి ఎన్నో రాసేవాడ్ని. తర్వాత సినిమాకి కథలు ఎలా రాయాలని నా స్నేహితుడి ద్వారా నేర్చుకున్నాను.

**మొదటి సినీ ప్రయత్నం గురించి చెప్పండి?..**
మూడేళ్ల క్రితం షార్ట్ ఫిల్మ్ తీశాను. రాత్రి రాశా.. ఉదయం పూట షూటింగ్ చేసేశాం. ఊర్లో, సిటీలో కలిపి 33 నిమిషాలు ఫుటేజ్ వచ్చింది. అవుట్ పుట్ చూసి.. ఇలా కాదు.. ఇంకాస్త బాగా తీయాలని అనుకున్నాను.

**అమీర్ లోగ్ జర్నీ గురించి చెప్పండి?..**
'అమీర్ లోగ్' అనే టైటిల్‌ను ముందు ఫిక్స్ అయ్యాను. అక్కడి నుంచి అసలైన అమీర్ లోగ్ ఎవరు? అని రకరకాలుగా రాసుకున్నాను. ఓ బస్తీ, ముగ్గురు కుర్రాళ్లు అని కథను రాయడం ప్రారంభించాను.


**ఎన్ని రోజుల్లో షూటింగ్ పూర్తి చేశారు?..**
దాదాపు మా సినిమాని బస్తీలోనే షూటింగ్ చేశారు. డెమోతో కలిపి దాదాపు 43 రోజులు అయింది. బస్తీతోనే కేవలం 38 రోజులు షూటింగ్ చేశాం.

**.రానా, ఆయన టీం తీసుకుంటున్న జాగ్రత్తలు, ఇచ్చిన సలహాలు ఏంటి?..**
'అమీర్ లోగ్' సినిమాని స్పిరిట్ టీంకి చూపించాం. ఫస్ట్ హాఫ్ చూసే బాగుందని అన్నారు.

**హిందీ భాషని ఎక్కువగా చూపించారు? సినిమాలో సబ్ టైటిల్స్ ఏమైనా వేస్తారా?..**
మన హైదరాబాద్‌లో మాట్లాడినట్టుగానే సినిమాలో ఉంటుంది. యాస మాత్రమే కనిపిస్తుంది. మన తెలుగు పదాల్లోనే ఉర్దూ పదాలు ఉంటాయి.

**అమీర్ లోగ్ మ్యూజిక్ గురించి చెప్పండి?..**
స్మరణ్‌ను ఓ దావత్ సాంగ్ ఇవ్వమని అడిగాను. కానీ స్మరణ్ సినిమాని చూసి ఎక్కడెక్కడ పాటలు ఉంటే బాగుంటుందో చెప్పాడు. అలా మాకు 10 అద్భుతమైన పాటల్ని ఇచ్చాడు.

## 'సాV3' మూవీ టీజర్ లాంచ్



స్రామాట్, డీమోన్ పవన్, లిఖిత (రాను బొంబాయికి రాను సాంగ్ ఫేమ్) హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'సాV3'. ఈ చిత్రాన్ని లక్ష్మి కృష్ణ ఫిలింస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.2గా నిర్మాత వి. విజయ నిర్మిస్తున్నారు. నటుడు, దర్శకుడు కృష్ణ మాయ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. సింగర్, బిగ్ బాస్ ఫేమ్ రాము రాథోడ్ మాట్లాడుతూ 'సాV3' సినిమా టీజర్ నాకు బాగా నచ్చింది. స్రామాట్, లిఖిత, డీమోన్ పవన్ తమ పర్ ఫార్మెన్స్ లతో ఆకట్టుకున్నారు. నటి హారిక మాట్లాడుతూ ఈ సినిమాలో నేనొక ఇంపార్టెంట్ రోల్ చేశాను. నేను ఈ పాత్రలో మెప్పించ గలను అని నమ్మి అవకాశం ఇచ్చిన డైరెక్టర్ కృష్ణ మాయకి థ్యాంక్స్. నటి రీతు చౌదరి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొనే అవకాశం రావడం సంతోషంగా ఉంది.'సాV3' సినిమా టీజర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. ప్రొడ్యూసర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ కృష్ణ మాయ సినిమా పట్ల ప్యాషన్ ఉన్న టెక్నీషియన్. నేను ప్రొడ్యూస్ చేసిన అన్ని సినిమాలకు వర్క్ చేశాడు. నటుడిగా, ఆర్ట్ డైరెక్టర్ గా నా మూవీస్ కు పనిచేశాడు. అన్నారు.హీరో డీమోన్ పవన్ మాట్లాడుతూ మా 'సాV3' సినిమా టీజర్ లాంఛ్ ఈవెంట్ కు వచ్చిన అతిథులు అందరికీ థ్యాంక్స్. నా స్నేహితులు చాలా మంది ఈ కార్యక్రమంలో పాల్గొని విష్ చేయడం ఆనందంగా ఉంది. ఈ చిత్రంలో హీరోగా నటించే అవకాశం కల్పించిన కృష్ణ మాయ కి థ్యాంక్స్. హీరోయిన్ లిఖిత మాట్లాడుతూ నేను కూడా మీతో పాటే 'సాV3' సినిమా టీజర్ చూస్తున్నాను. టీజర్ చాలా బాగుంది. హీరో స్రామాట్ మాట్లాడుతూ నన్ను ఇప్పటిదాకా మన మూవీస్ లో లవర్ బాయ్ లా, చాక్లెట బాయ్ లా, ఫియాన్సే లా, డబ్బున్న కుర్రాడిలా చూపించారు.

## 'ఫైట్ మహా' 21న వరల్డ్‌వైడ్ రిలీజ్



సునీల్, అఖిల్ ఉడ్డెమారి, ప్రదాన పాత్రల్లో డా. శ్రీవాణి గోపిచంద్, వైష్ణవి, సిద్ధార్థ్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటిస్తున్న సినిమా 'ఫైట్ మహా' కలలు నిజమైతే నిజం ఎవరిది అనేది ఈ చిత్ర ట్యాగ్ లైన్. సరికొత్త సైకలాజికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు దర్శకుడు ఆనంద్ చంద్ర. న్యూ ఐ మూవీస్ ఎల్ ఎల్ పీ బ్యానర్ పై ఏవీఎస్ రాజు, ఆర్ కుమార్ రాజు, ఆనంద్ చంద్ర నిర్మిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ చేతుల మీదుగా గత నెల విడుదల చేసిన టీజర్ అద్భుతమైన స్పందన వచ్చింది, మిలియన్ ప్లస్ వ్యూస్ తో ప్రస్తుతం ఆకట్టుకుంటుంది. ప్రొడ్యూసర్ ఏవీఎస్ రాజు మాట్లాడుతూ 'దర్శకుడు ఆనంద్ చంద్ర ఈ కథ చెప్పినప్పుడు మా అందరికీ బాగా నచ్చింది. కథే ఈ సినిమా నిర్మించేందుకు మమ్మల్ని ఇన్స్ పైర్ చేసింది. డైరెక్టర్ మాకు కథ ఎంతబాగా చెప్పాడో అంతే బాగా రూపొందించాడు. వైజాగ్, కేరళ, హైదరాబాద్ లో ఈ సినిమాను చిత్రీకరించాం. ఈ సినిమా పోస్టర్ లో కేవలం ఇద్దరు సునీల్, అఖిల్ ఉడ్డెమారి కనిపించినా షుమారు 40 మంది నటీ నటులు ఈ చిత్రంలో అలరించనున్నారు. డైరెక్టర్ ఆనంద్ చంద్ర మాట్లాడుతూ 'ఫైట్ మహా'లో మేము చూపించిన స్లీప్ వాకింగ్ అనే కాన్సెప్ట్ చాలా యునిక్‌గా వుంటుంది. గతంలో ఇలాంటి కాన్సెప్ట్ తో సినిమాలు వచ్చినా, మన తెలుగు ప్రేక్షకులకు మాత్రం ఈ చిత్రంలోని కాన్సెప్ట్ కొత్తగా ఉంటుందని నమ్మకం ఉంది అన్నారు.

## 'హుషార్ పిట్టలు' విజయోత్సవ వేడుక



'హుషార్ పిట్టలు'టీంని చూస్తే ఎంతో గర్వంగా ఉంది.. విజయోత్సవ వేడుకలో ప్రముఖ నిర్మాత బెక్కం వేణుగోపాల్..అన్న్, వాసవి గణేషన్ జంటగా రూపొందిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'హుషార్ పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మించిన ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. ఈ సినిమాని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు ఆగస్ట్ 15న భారీ ఎత్తున విడుదలైంది. గత నాలుగైదు రోజులుగా వేస్తున్న ప్రీమియర్లకు ఆల్రెడీ అద్భుతమైన స్పందన వచ్చింది. ఇక సినిమా రిలీజ్ అయిన తర్వాత సక్సెస్ ఫుల్‌గా దూసుకుపోతోంది. ..ప్రముఖ నిర్మాత డి. సురేష్ బాబు మాట్లాడుతూ.. .'హుషార్ పిట్టలు' సినిమాని ఇప్పటి వరకు లక్ష మంది చూశారు. దాదాపు కోటి ముప్పై లక్షల గ్రాస్ వచ్చింది. కంటెంట్ బాగుంటే ఆడియెన్స్ సినిమాని చూస్తారు. ప్రీమియర్ల నుంచి మంచి రెస్పాన్స్ దక్కించు కుంది. టీజర్, ట్రైలర్ ద్వారా మంచి బజ్ ఏర్పడింది. సక్సెస్ అవ్వడంతో టీం అంతా సంతోషంగా ఉంది. బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఎన్నో చిన్న చిత్రాలు తీసి సక్సెస్‌ను చూశాను. మళ్లీ ఈ హుషార్ పిట్టల్లు మూవీని అందరితో కలిసి థియేటర్లో చూసి, ఆ సక్సెస్‌ను చూడటం ఆనందంగా అనిపించింది. దర్శకుడు భిక్షు మాట్లాడుతూ.. కంటెంట్ ఈజ్ కింగ్ అని మళ్లీ మా హుషార్ పిట్టలు నిరూపించింది. మాకు ఈ జర్నీలో సహకరించిన మీడియాకి థాంక్స్. మాకు ఇంత విజయాన్ని అందించిన ప్రేక్షకులకు థాంక్స్ అన్నారు.



### ది హండ్రెడ్ మెన్స్ ఛాంపియన్‌గా

# సూపర్ జెయింట్స్

## ఫైనల్లో ట్రెంట్ పై అద్భుత విజయం

**లండన్:** ది హండ్రెడ్ మెన్స్ 2026 ఫైనల్‌లో మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ డిఫెండింగ్ ఛాంపియన్స్ అయిన ట్రెంట్ రాకెట్స్‌పై ఘన విజయం నమోదు చేసి ఛాంపియన్‌గా నిలిచింది. లండన్‌లోని లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన ఈ పోరులో, జెయింట్స్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించి తమ తొలి టైటిల్‌ను కైవసం చేసుకుంది. టిమ్ సీఫెర్ట్ యొక్క అద్భుత ప్రదర్శన మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ టైటిల్‌ను కైవసం చేసుకోవడానికి సహాయపడింది. రాకెట్స్ మొదట బ్యాటింగ్ చేయడంతో ఈ పోరు ప్రారంభమైంది. బెన్ డకెట్, ఫిన్ అలెన్ వరుసగా 31, 15 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. అన్యూరిన్ డొనాల్డ్ 38 పరుగులు, మిచెల్ శాంట్నర్ 20 పరుగులతో నాటౌట్‌గా నిలవగా, లూయిస్ గ్రెగొరీ 32 పరుగులు జోడించాడు. దీంతో రాకెట్స్ తొలి ఇన్నింగ్స్‌లో మొత్తం 158 పరుగులు చేసింది. ఈ ఇన్నింగ్స్‌లో 3 వికెట్లతో జెయింట్స్ తరఫున నూర్ అహ్మద్ అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. సోనీ బేకర్ 2 వికెట్లు, జోష్ టంగ్, లియామ్ డాసన్ కూడా చెరో వికెట్ పడగొట్టారు. లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన సూపర్ జెయింట్స్ టిమ్ సీఫెర్ట్, పాల్ వాల్టర్‌లతో ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. సీఫెర్ట్ 72 పరుగులు చేయగా, పాల్ వాల్టర్ 22 పరుగులు చేసి మంచి ప్రదర్శన కనబరిచాడు. జోస్ బట్లర్ మరో 23 పరుగులు జోడించగా, ల్యూస్ డు ప్లూయ్ 27 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో జెయింట్స్ 98 బంతుల్లోపే లక్ష్యాన్ని ఛేదించి, 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. రాకెట్స్ తరఫున మహమ్మద్ అమీర్ 3 వికెట్లతో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. కాల్విన్ హారిసన్ 2 వికెట్లు తీశాడు.

## మహిళల ఛాంపియన్స్ లీగ్..<br>బంగ్లాదేశ్‌పై భారత్ విజయం



**మలేషియా:** ఏఎఫ్‌సి మహిళల ఛాంపియన్స్ లీగ్ ప్రిలిమ్స్‌లో బంగ్లాదేశ్‌కు చెందిన జట్టు రాజ్‌షాహి స్టార్స్‌పై ఈస్ట్ బెంగాల్ (భారత్ జట్టు) సునాయాసంగా విజయం సాధించింది. మలేషియాలోని కోటా కినాబాలులోని లికాస్ స్టేడియంలో సోమవారం బంగ్లాదేశ్‌కు చెందిన రాజ్‌షాహి స్టార్స్ ఎఫ్‌సిపై 4-0 తేడాతో విజయం సాధించి, ఈస్ట్ బెంగాల్ ఛాంపియన్స్ లీగ్ 2026-27 ప్రాథమిక దశ ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించింది. ఘనా క్రీడాకారిణి ఒలివియా అనోక్యే రెండు గోల్స్ చేయగా, భారత అంతర్జాతీయ క్రీడాకారిణులు అస్తమ్ ఒరాన్, సౌమ్య గుగులోత్ చెరొక గోల్ చేసి ఘన విజయాన్ని ఖాయం చేశారు. ఈస్ట్ బెంగాల్ బలంగా ప్రారంభించి, తొమ్మిది నిమిషాల తర్వాత 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. గోల్ కీపర్ రూప్నా చక్మా ఎంతగానో ప్రయత్నించినప్పటికీ, ఒలివియా పెనాల్టీని సునాయాసంగా గోల్‌గా మలిచింది. 26వ నిమిషంలో అస్తమ్ ఒరాన్ ద్వారా ఐడబ్ల్యుఎల్ ఛాంపియన్ తన ఆధిక్యాన్ని మరింత పెంచుకోగా, విరామానికి ముందు బంగ్లాదేశ్ జట్టుకు పరిస్థితి మరింత దిగజారింది. 38వ నిమిషంలో రింపా హల్దార్ పంపిన క్రాస్ రూప్నాను దాటి వెళ్ళగా, వెనుక పోస్ట్ వద్ద సులంజన రౌల్ అత్యంత వేగంగా స్పందించి బంతిని వెనక్కి పంపగా, ఒలివియా ఆ సాయంత్రపు తన రెండవ గోల్‌ను సాధించింది. విరామం తర్వాత రాజ్‌షాహి పుంజుకుంది, కానీ మరింత ప్రతిఘటన చూపినప్పటికీ, మోనికా చక్మా కొట్టిన ఒకే ఒక్క లాంగ్‌రేంజ్ షాట్‌ను పాంథోయ్ చాను ఎలాంగ్‌బామ్ అడ్డుకుంది. మోషల్ గర్ల్స్ తమ చేతిలో ఉన్న అనుకూలతతో ఓపికతో 71వ నిమిషంలో ప్రత్యర్థి రక్షణలో జరిగిన పొరపాటును సద్వినియోగం చేసుకుని స్కోరును పెంచారు. సులంజన అందించిన పాస్‌ను సౌమ్య గోల్‌గా మలచడంతో భారత జట్టు అద్భుతమైన ప్రదర్శనకు ముగింపు పలికింది.

# 284 రన్స్‌తో కుప్పకూలిన శ్రీలంక

## టీమిండియా 178 పరుగుల ఆధిక్యం

**న్యూఢిల్లీ:** శ్రీలంకతో తొలి టెస్టులో భారత్‌కు భారీ ఆధిక్యం లభించింది. మూడో రోజు సోమవారం ఆట ముగిసే సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 79.4 ఓవర్లలో 284 పరుగులకు కుప్పకూలింది. అంతకుముందు 460/9 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగులకు ఆలౌట్ అయింది. దేవదత్ పడిక్కల్(167) సెంచరీతో రాణించగా, కేఎల్ రాహుల్(82) శతకాన్ని చేజార్చుకున్నాడు. ధ్రువ్ జురెల్(51) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య(4/109) నాలుగు వికెట్లు, కేశర నువాంత(3/175) మూడు వికెట్లు, అసితా ఫెర్నాండో(2/63) రెండు వికెట్లు తీసాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకకు భారత బౌలర్లు షాకిచ్చారు. సిరాజ్, జడేజా, మానవ్ సుతార్ నిప్పులు చెరగడంతో శ్రీలంక 90 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. దాంతో శ్రీలంక 99/5 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో సోనాల్ దినుషా, నిరోషణ్ డిక్‌వెల్లా అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శనతో భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగి శ్రీలంకను ఆదుకున్నారు. ఈ క్రమంలో నిరోషన్ డిక్‌వెల్లా 67 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించగా, దినుషా 92 బంతుల్లో అర్ధశతకాన్ని అందుకున్నాడు. దాంతో శ్రీలంక 215/5 స్కోర్ టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లో 146 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో పాతుకుపోయిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. సెంచరీ దిశగా సాగిన నిరోషన్ డిక్‌వెల్లా(80)ను కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. ఈ వికెట్‌తో మ్యాచ్ భారత్‌వైపు మలుపు తిరిగింది. ఆ వెంటనే కేశర నువాంత(2)ను జడేజా ఔట్ చేయగా, ప్రభాత్ జయసూర్య(10)ను మానవ్ సుతార్ వెనక్కిపంపాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా మరోవైపు సోనాల్ దినూషా 167 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ మరుసటి బంతికే అతన్ని జడేజా ఎల్బీగా పెవిలియన్ మార్చాడు. లాహిరు కుమార(10)ను మానవ్ సుతార్ ఔట్ చేయడంతో శ్రీలంక ఇన్నింగ్స్‌కు తెరపడింది. ఆ వెంటనే వర్షం రావడంతో అంపైర్లు మూడో రోజు ఆటను ముగించారు.








## వరల్డ్ ఛాంపియన్‌షిప్..<br>రెండో రౌండ్‌లోకి సింధు

**న్యూఢిల్లీ:** న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన బిడబ్ల్యూఎఫ్ బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ ప్రారంభ రౌండ్‌లో, మాజీ ఛాంపియన్ పివి సింధు అనుభవం లేని ఐరిష్ షట్లర్ సోఫియా నోబుల్‌పై వరుస గేమ్‌లలో విజయం నమోదు చేసింది. ఐదుసార్లు పతక విజేత అయిన సింధు, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో తొలిసారిగా ఆడుతున్న నోబెల్‌పై కేవలం 29 నిమిషాల్లోనే 21-7, 21-11 తేడాతో సునాయాసంగా గెలుపొందింది. తొలి గేమ్‌లోనే 8-0 ఆధిక్యంతో దూసుకుపోయిన సింధు ఆ తర్వాత వెనుతిరిగి చూడలేదు. రెండవ సెట్‌లో నోబుల్ మెరుగ్గా ఆడింది, ఆట మధ్య విరామ సమయానికి ఆమె కేవలం మూడు పాయింట్ల తేడాతో వెనుకబడి ఉంది. అయితే ఆ తర్వాత వచ్చిన 13 పాయింట్లలో 10 పాయింట్లను గెలుచుకుని ఆమె విజయాన్ని ఖాయం చేసుకుంది. ఇదే సమయంలో ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్‌ల మహిళల డబుల్స్ జోడీ, ఎంఆర్ అర్జున్-హరిహరన్ అమ్సకరుణన్‌ల పురుషుల డబుల్స్ జోడీ కూడా రెండో రౌండ్‌లో తమ స్థానాలను ఖరారు చేసుకున్నాయి. ట్రీసా-గాయత్రి స్పెయిన్‌కు చెందిన పౌలా లోపెజ్-లూసియా రోడ్రిగ్జ్‌లను 21-9, 21-13 తేడాతో ఓడించింది. అలాగే గాయం కారణంగా ఐరిష్ ద్వయం స్కాట్ గిల్డియా-పాల్ రేనాల్డ్స్ మ్యాచ్ నుండి వైదొలగడంతో, అర్జున్-హరిహరన్ వారిపై 21-16, 6-4 ఆధిక్యంలో ఉన్నారు.

# టీమిండియాకు బంగ్లా షాక్

## డబ్ల్యూటిసి ఫైనల్‌పై పెను ప్రభావం

**న్యూఢిల్లీ:** టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే బలహీన జట్టుగా భావించిన బంగ్లాదేశ్ ఆస్ట్రేలియాపై సంచలన విజయం పాయింట్ల పట్టిక ముఖచిత్రాన్నే మార్చేసింది. ఈ చారిత్రక విజయంతో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టిక ఒక్కసారిగా తలకిందులైంది. కంగారూ జట్టు అగ్రస్థానానికి గండిపడగా, బంగ్లాదేశ్ తన నాలుగో స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. మరోవైపు భారత జట్టు అవకాశాలపై ఈ ఫలితం పెను ప్రభావాన్ని చూపుతోంది. ఆడిన ఐదు మ్యాచ్‌లలో మూడో విజయం సాధించడంతో ఆ జట్టు పాయింట్ల శాతం 58.33 నుంచి ఏకంగా 66.67 శాతానికి ఎగబాకింది. మరోవైపు అగ్రస్థానంలో కొనసాగుతున్న ఆస్ట్రేలియాకు ఈ ఓటమి పెద్ద ఎదురుదెబ్బగా మారింది. ఆ జట్టు పాయింట్ల శాతం 87.50 నుంచి 77.77 శాతానికి పడిపోయింది. ప్రస్తుతం రెండో స్థానంలో ఉన్న దక్షిణాఫ్రికా (75.00శాతం) ఆస్ట్రేలియాకు అత్యంత చేరువగా వచ్చింది. మూడో స్థానంలో న్యూజిలాండ్ 72.22 శాతంతో కొనసాగుతోంది.



కాగా బంగ్లాదేశ్ విజయం భారత్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ అనూహ్య మార్పుల వల్ల ఐదో స్థానంలో ఉన్న భారత జట్టు (48.15 శాతం), ఆరో స్థానంలో ఉన్న శ్రీలంక (41.67 శాతం) తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. బంగ్లాదేశ్ దూకుడుతో ఫైనల్ రేసు మరింత ఉత్కంఠగా మారింది. ఈ సైకిల్‌లో భారత్‌కు ఇంకా తొమ్మిది టెస్టు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడకుండా నేరుగా ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకోవాలంటే శ్రీలంకతో జరుగుతున్న రెండు టెస్టుల సిరీస్‌ను టీమిండియా 2-0 తేడాతో క్లీన్ స్వీప్ చేయాల్సి ఉంటుంది. అయితే తొలి టెస్టులో ఊహించని పరాజయం ఎదురైనా ఫైనల్ తలుపులు పూర్తిగా మూసుకుపోవు. మిగిలిన టెస్టుల్లో కనీసం 7 మ్యాచ్‌లు గెలిస్తే పాయింట్ల శాతాన్ని 60 శాతానికి పైగా చేరి భారత్ ఫైనల్ రేసులో నిలబడగలదు. టీమిండియా ముందున్న తొమ్మిది టెస్టుల ప్రయాణం అంత తేలికైనదేమీ కాదు. శ్రీలంక పర్యటనలో రెండు టెస్టుల సిరీస్ తర్వాత స్వదేశంలో న్యూజిలాండ్‌తో రెండు టెస్టుల సిరీస్ ఆడాల్సి ఉంది. ఆ తర్వాత అత్యంత కీలకమైన ఆస్ట్రేలియా పర్యటనలో ఐదు టెస్టుల బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ ఎదురుచూస్తోంది. ఈ కఠినమైన షెడ్యూల్‌లో మెజారిటీ మ్యాచ్‌లు గెలవడం భారత జట్టుకు పెద్ద సవాలుగా మారనుంది.



# ఆర్‌బీఐ కీలక నిర్ణయం

## ఎఫ్సీఎన్ఆర్‌బి స్వాప్ విండో ముందుగానే మూసివేత

**ముంబయి, ఆగస్టు 17:** విదేశీ కరెన్సీ నిధులు అంచనాలకు మించి భారీగా రావడంతో ప్రత్యేకఎఫ్‌సిఎన్‌ఆర్-బి స్వాప్ విండోను ముందుగానే మూసివేయాలని రిజర్వ్ బ్యాంకు నిర్ణయించింది. ఈనెల 13 నాటికి బ్యాంకులు ఈ డిపాజిట్ల ద్వారా 52.3 బిలియన్ డాలర్లు సమీకరించాయి. సెప్టెంబర్ 30 వరకు ఈ పథకం అందుబాటులో ఉంటే మొత్తం నిధుల సమీకరణ 100 బిలియన్ డాలర్లు దాటే అవకాశం ఉండేది. దీంతో గడువును కుదించిన ఈ విండో ముగిసే నాటికి మొత్తం ఎఫ్‌సిఎన్‌ఆర్ సమీకరణ సుమారు 70-80 బిలియన్ డాలర్లకు చేరుతుందని ఆర్‌బీఐ అంచనా వేస్తోంది.

ఈ స్వాప్ విండోను ముందుగానే మూసివేయడానికి ప్రధాన కారణాల్లో ఒకటి ఆర్‌బీఐపై పెరిగే హెడ్జింగ్ ఎక్స్‌పోజర్. ఎఫ్‌సిఎన్‌ఆర్ డిపాజిట్ల కాలపరిమితి సాధారణంగా 3-5 సంవత్సరాలు ఉంటుంది. దీంతో డిపాజిట్ల పరిమాణం పెరిగే కొద్దీ, రానున్న అనేక సంవత్సరాల్లో ఆర్‌బీఐ నిర్వహించాల్సిన విదేశీ కరెన్సీ ఎక్స్‌పోజర్ కూడా పెరుగుతుంది. అదే సమయంలో రాబోయే మూడు నుంచి ఐదేళ్లలో అంతర్జాతీయ వడ్డీ రేట్ల పరిస్థితిపై స్పష్టత లేదు. భవిష్యత్ గ్లోబల్ వడ్డీ రేట్లు, హెడ్జింగ్ వ్యయాలను ముందుగా అంచనా వేయడం కష్టంగా ఉన్న నేపథ్యంలో భారీగా అదనపు విదేశీ కరెన్సీ ప్రవాహాలను ప్రోత్సహించడం వల్ల ఆర్‌బీఐపై దీర్ఘకాలిక హెడ్జింగ్ భారం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. అందువల్ల ఈ పథకానికి ఊహించిన దానికంటే ఎక్కువ స్పందన రావడంతో పూర్తి గడువు వరకు విండోను కొనసాగించాల్సిన అవసరం తగ్గిందని ఆర్‌బీఐ భావిస్తోంది. భవిష్యత్తులో విదేశీ మారక ద్రవ్య లిక్విడిటీ పరిస్థితులు అదనపు డాలర్ల నిధులను కోరుకుంటే, ఆర్‌బీఐ ఇలాంటి స్వాప్ సదుపాయాన్ని తిరిగి ప్రవేశపెట్టవచ్చు.

మొత్తంగా చూస్తే, అంచనాలకు మించి వచ్చిన డాలర్ ప్రవాహాలను నియంత్రించడం, దీర్ఘకాలిక హెడ్జింగ్ ఎక్స్‌పోజర్‌ను సమతుల్యం చేయడమే ఎఫ్‌సిఎన్‌ఆర్ స్వాప్ విండోను ముందుగానే మూసివేయడం వెనుక ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.

**వాణిజ్యం**

# వారంలో నష్టాల బోణీ

## నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి, ఆగస్టు 17:** బెంచ్‌మార్క్ సూచీలు సోమవారం నష్టాలతో వారం ప్రారంభించాయి. ఇరాన్ వివాదం ముగింపునకు సంబంధించి ఎలాంటి పురోగతి కనిపించకపోవడంతో ముడిచమురు ధరలు అధిక స్థాయిలో కొనసాగడం మార్కెట్ సెంటిమెంట్‌పై ఒత్తిడి తెచ్చింది. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 89 డాలర్ల వద్ద కొనసాగింది. ఐటీ, ఎఫ్ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించగా, మెటల్ షేర్లు లాభపడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 281.09 పాయింట్లు నష్టపోయి 77,728.16 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 78.35 పాయింట్లు క్షీణించి 24,287.65 వద్ద స్థిరపడింది. నిఫ్టీని ఎక్కువగా దెబ్బతీసిన షేర్లలో ఇన్ఫోసిస్ 2.51 శాతం, సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ 2.49 శాతం, భారతి ఎయిర్‌టెల్ 1.14 శాతం చొప్పున పడిపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.18 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.06 శాతం చొప్పున పెరిగాయి. మార్కెట్ వెడల్పు ప్రతికూలంగా ఉంది. బీఎస్ఈలో 2,087 షేర్లు లాభపడగా, 2,353 షేర్లు నష్టపోయాయి. మరో 240 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. బ్రెంట్ ముడిచమురు అక్టోబర్ ఫ్యూచర్స్ 93 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 89.45 డాలర్లకు చేరింది. ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5 సెటిల్‌మెంట్ గోల్డ్ ఫ్యూచర్స్ 0.46 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,55,190 వద్ద ముగిశాయి. విదేశీ మారక మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా క్షీణించి 95.6500 వద్ద కొనసాగింది. మోల్బియో డయాగ్నోస్టిక్స్:బీఎస్ఈలో తొలి ట్రేడింగ్ రోజును రూ.1,036.30 వద్ద ముగించింది. ఇది ఇష్యూ ధర రూ.807తో పోలిస్తే 28.41 శాతం ప్రీమియం. షేరు రూ.980 వద్ద లిస్ట్ అయి 21.44 శాతం ప్రీమియం నమోదు చేసింది. ట్రేడింగ్‌లో రూ.925.80 నుంచి రూ.1,064.85 మధ్య కదిలింది. హారిజన్ ఇండస్ట్రియల్ పార్క్స్ 4:48 గంటల సమయానికి 3,52,05,000 షేర్లకు బిడ్లు వచ్చాయి. మొత్తం 25,13,56,273 షేర్లు ఆఫర్‌లో ఉండగా, ఇష్యూ 0.14 రెట్లు మాత్రమే సబ్‌స్క్రైబ్ అయింది. ధరల శ్రేణి ఒక్కో షేరుకు రూ.57-60గా ఉంది. కనీసం 250 షేర్లు, ఆ తర్వాత వాటి గుణిజాల్లో బిడ్ చేయాలి. లలితా జ్యువెలరీ మార్ట్ సోమవారం4:48 గంటల సమయానికి 4,32,49,448 షేర్లకు బిడ్లు వచ్చాయి. మొత్తం 6,27,61,403 షేర్లు ఆఫర్‌లో ఉండగా, ఇష్యూ 0.69 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. 17న ప్రారంభమైన ఐపీఓ 19న ముగుస్తుంది. ధరల శ్రేణి ఒక్కో షేరుకు రూ.190-201గా నిర్ణయించారు. కనీసం 74 షేర్లకు, ఆ తర్వాత వాటి గుణిజాల్లో బిడ్ చేయవచ్చు.

## ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ చైర్‌పర్సన్‌గా శబ్నమ్ సిన్హా


**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్‌లో నాయకత్వ మార్పు చోటుచేసుకోనుంది. మూడు దశాబ్దాలకు పైగా అభివృద్ధి ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక సేవలు, ప్రజా విధాన రంగాల్లో అనుభవం ఉన్న శబ్నమ్ సిన్హా.. ప్రస్తుత చైర్‌పర్సన్ సునీల్ భారతి మిత్తల్ స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతికి లోబడి 2026 అక్టోబర్ 1 నుంచి ఆమె చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. సునీల్ భారతి మిత్తల్ సెప్టెంబర్ 30, 2026తో నాన్




ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ పదవి నుంచి తప్పుకోవడంతో పాటు బ్యాంక్ బోర్డు నుంచి వైదొలగనున్నారు. దీంతో 2016 ఏప్రిల్‌లో ప్రారంభమైన ఆయన పదవీకాలం ముగియనుంది. ప్రస్తుతం ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ బోర్డులో స్వతంత్ర డైరెక్టర్‌గా ఉన్న శబ్నమ్ సిన్హా మూడేళ్ల పాటు చైర్‌పర్సన్‌గా కొనసాగనున్నారు. మిట్టల్ హయాంలో ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ వినియోగదారులు, సంస్థల కోసం అందించే బ్యాంకింగ్ సేవలను విస్తరించడంతో పాటు ఆదాయం పరంగా దేశంలోనే అతిపెద్ద పేమెంట్స్ బ్యాంక్‌గా ఎదిగిందని కంపెనీ తెలిపింది.

# బ్యాంకుల్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు రూ.1లక్షకోట్లు!

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** దేశంలోని వివిధ బ్యాంకుల్లో డిపాజిట్ చేసి, మర్చిపోయిన, క్లెయిమ్ చేసుకోని సొమ్ము విలువ దాదాపు రూ.1 లక్ష కోట్లు ఉంటుందని ఆర్బీఐ తెలిపింది. పార్లమెంట్‌లో ఆర్థిక శాఖ ఇటీవల వెల్లడించిన వివరాల ప్రకారం జనవరి 31, 2026 నాటికి దేశంలోని బ్యాంకుల్లో క్లెయిమ్ చేయని సొమ్ము రూ.98,073. దీనికి సంబంధించిన వివరాల్ని గతంలోనే వెల్లడించింది. ఈ సొమ్మును గురించి తెలుసుకునేందుకు అవకాశాలు కూడా కల్పించింది. ఇందుకోసం ఆర్బీఐ ఉద్గామ్ అనే పోర్టల్‌ను కూడా ఏర్పాటు చేసింది. ఈ పోర్టల్ ద్వారా ఎవరైనా తమకు సంబంధించిన లేదా మర్చిపోయిన లేదా మరణించిన తమ వారి బ్యాంకు డిపాజిట్లకు సంబంధించిన వివరాలు తెలుసుకోవచ్చు. సంబంధిత బ్యాంకుల్ని సంప్రదించి, తమ డబ్బు అందడానికి




కావాల్సిన ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ డబ్బు వారికి అందుతుంది. చాలా మంది తమ డబ్బును రహస్యంగా దాచుకోవడం కోసం తమవారికి తెలియకుండా బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తుంటారు. అలాంటి వారు వాటి వివరాల్ని మర్చిపోవచ్చు. లేదా వారు మరణించి ఉండొచ్చు. దీంతో ఆ డబ్బు బ్యాంకులో అలాగే, నిలిచిపోతుంది. ఒక బ్యాంకులో రెండేళ్లకంటే ఎక్కువ కాలం డిపాజిట్లకు సంబంధించి ఎలాంటి లావాదేవీ జరగకుంటే ఆ ఖాతాను నిర్వహణలో లేని లేదా నిలిచిపోయిన ఖాతాగా గుర్తిస్తారు. ఆ తర్వాత పదేళ్లపాటు ఆ ఖాతాను ఎవరూ క్లెయిమ్ చేసుకోకుంటే ఆ నిధిని డీఈఏకు తరలిస్తారు. ఈ డబ్బు బదిలీ అయినంత మాత్రాన సంబంధిత వ్యక్తులు లేదా వారి కుటుంబ సభ్యులు, చట్టబద్ధమైన అర్హతదారులకు చెందకుండా పోదు.



## రికార్డు స్థాయికి సోయా ఆయిల్ దిగుమతులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం కారణంగా నల్ల సముద్రం నుంచి సన్‌ఫ్లవర్ ఆయిల్ సరఫరాలకు అంతరాయం ఏర్పడటంతో భారత్ ప్రత్యామ్నాయంగా సోయా నూనె దిగుమతులను భారీగా పెంచుతోంది. ఆగస్టులో దేశంలోకి సోయా నూనె దిగుమతులు రికార్డు స్థాయిలో 6.20 లక్షల టన్నులకు చేరుకోవచ్చని అంచనా. ఆగస్టు సోయా నూనె దిగుమతులు ప్రస్తుత మార్కెటింగ్ సంవత్సరంలోని నెలవారీ సగటు 4,24,549 టన్నుల కంటే దాదాపు 46 శాతం అధికం కానున్నాయి. ప్రస్తుత మార్కెటింగ్ సంవత్సరం నవంబర్‌లో ప్రారంభమైంది. భారత్ సన్‌ఫ్లవర్ ఆయిల్ అవసరాల్లో ఎక్కువ భాగం రష్యా, ఉక్రెయిన్ నుంచే వస్తుంది. రెండు దేశాల మధ్య యుద్ధం కారణంగా ఆగస్టు, సెప్టెంబర్‌లో రావాల్సిన సుమారు 1.50 లక్షల టన్నుల సన్‌ఫ్లవర్ ఆయిల్ సరుకులు ఆలస్యమయ్యాయి. దీంతో ఆగస్టులో సన్‌ఫ్లవర్ ఆయిల్ దిగుమతులు జూలైతో పోలిస్తే 28 శాతం తగ్గి 1.80 లక్షల టన్నులకు పడిపోవచ్చని అంచనా. ఇది ఫిబ్రవరి తర్వాత అత్యల్ప స్థాయి. రష్యా, ఉక్రెయిన్‌లు పరస్పరం పోర్టులు, సముద్ర మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుంటుండటంతో బ్లాక్ సీ మార్గంలో వంటనూనెల రవాణా కష్టతరంగా మారింది. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలోని రిఫైనర్లపై దీని ప్రభావం ఎక్కువగా ఉంది. పండుగల సీజన్ సమీపిస్తుండటంతో దేశంలో వంటనూనెలకు డిమాండ్ కూడా పెరుగుతోంది. జూలైలో మొత్తం వంటనూనెల దిగుమతులు 10 నెలల గరిష్ఠానికి చేరుకుని 14.8 లక్షల టన్నులుగా నమోదయ్యాయి. అదే సమయంలో సోయా నూనె దిగుమతులు 31 శాతం పెరిగి 4,98,881 టన్నులకు చేరాయి. సెప్టెంబర్‌లోనూ 6 లక్షల టన్నులు దాటే అవకాశంసోయా నూనెకు పెరిగిన డిమాండ్ ఆగస్టుతో ముగిసే అవకాశం కనిపించడం లేదు. సెప్టెంబర్-డిసెంబర్ డెలివరీ కోసం భారత్ ఇప్పటికే దాదాపు 14 లక్షల టన్నుల సోయా నూనెను బుక్ చేసుకున్నట్లు వ్యాపారులు తెలిపారు. సెప్టెంబర్‌లో కూడా నెలవారీ దిగుమతులు 6 లక్షల టన్నులు దాటవచ్చని ఓ డీలర్ అంచనా వేశారు. అర్జెంటీనా, బ్రెజిల్ లతోపాటు చైనా, ఈజిప్ట్, థాయ్‌లాండ్, టర్కీ నుంచి కూడా సరుకులను రిఫైనర్లు కొనుగోలు చేస్తున్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.